అనుదినం... జనస్వరం

సమగ్ర తెలుగు దినపత్రిక

నవతెలంగాణ

సోమవారం 15-5-2023

సంపుటి : 9 | సంచిక : 134 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

ఎండ@45.9డిగ్రీలు



రాష్ట్రంలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

- వడగాలులు వీచే వకాశం!
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వివరాలు 5లో..





ఫ్లాప్ షో..!

మోడీ అన్నీ తానై ప్రచారం చేసినా ఫలితం శూన్యం

మోడీ గారడీ ఏ మాత్రం పని చేయలేదు. మోడీ విశేష జనాదరణ కలిగిన నాయకుడని, బీజేపీ విజయం ఆయన పైనే ఆధారపడి ఉందని చాలా మంది విశ్వసిస్తుంటారు. అయితే ఆయన పైనే ఆధారపడడం పెద్ద తప్పిదమని కర్నాటక ఫలితాలు నిరూపించాయి. యడియూరప్ప వంటి ప్రజాబాహుళ్యం కలిగిన నాయకుడిని పక్కనపెట్టి, బజరంగబలి పేరిట ఓట్లు కొల్లగొట్టాలని బీజేపి కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. అయితే ఇది యాధృచ్ఛికంగా జరిగినదేమీ కాదు. రాష్ట్ర నాయకత్వాలు బలంగా ఉండడం అధిష్టానానికి సుతరామూ ఇష్టం లేదు. మోడీని మాత్రమే ముందుకు తేవాలని ఆ పార్టీ కోరుకుంది. అయితే ఈ ఎత్తుగడ కర్నాటకలో బెడిసికొట్టింది. స్థానిక నేతలను విస్మరించి, అంతా తానై మోడీ జరిపిన ఎన్నికల ప్రచారం బీజేపీకి ఏ మాత్రం ఉపయోగపడలేదు సరికదా వికటించింది.

బెంగళూరు : ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్నాటకలో ప్రధాని నరేంద్ర మోడీ ఎక్కుపెట్టిన బాణాలు గురి తప్పాయి. బజరంగ్‌దళ్‌పై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన తర్వాత పరిస్థితి బీజేపీకి అనుకూలంగా మారిందంటూ కార్పొరేట్ మీడియా ఊదరగొట్టింది. రాష్ట్రంలో పట్టు కోల్పోతున్న బీజేపీకి కాంగ్రెస్ హామీ ఊపిరి పోసిందంటూ వ్యాఖ్యలు చేసింది. మరో వారంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా మోడీ రాష్ట్రంలో సుడిగాలి పర్యటన జరిపారు. రోడ్‌షోలు, బహిరంగ సభలతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీని పదేపదే ప్రస్తావిస్తూ హిందూత్వ కార్డును బయటికి తీశారు. జాతీయ మీడియాలో ఈ విషయానికి విశేష ప్రాధాన్యత లభించింది. అయితే పోలింగ్ రోజున ప్రజలు ఈ విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని ఫలితాలు రుజువు చేశాయి. కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజారిటీ అందిస్తూ కన్నడిగులు విలక్షణ తీర్పు ఇచ్చారు.

చేతులు కాలాక...

పైగా బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం పలు సందర్భాలలో హిందూత్వ విధానాలను అవలంబించడం ప్రజలకు ఆగ్రహం ...2లో

అందరిలోనూ అసంతృప్తే

అయితే ఇదేమీ ఆశ్చర్యకరమైన విషయం కాదు. మత జాతీయతావాదం మాదిరిగానే హిందూత్వ కూడా భావోద్వేగాలపై ఆధారపడిన అంశం. అనేక హింసాత్మక నేరాలకు పాల్పడిన బజరంగ్‌దళ్‌ను బజరంగ్‌బలితో పోల్చడం ఓటర్లకు ఏ మాత్రం రుచించలేదు. వాస్తవానికి ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేసిన విషయం రాష్ట్ర ఆర్థిక దుస్థితి. నిరుద్యోగ సమస్య కారణంగా పట్టణ ఓటర్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మరోవైపు సంక్షేమ ఫలాలు అందకపోవడంతో రైతులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ద్రవ్యోల్బణం ప్రభావంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై బీజేపీ మద్దతుదారులు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సమస్యల వలయంలో చిక్కుకుపోవడంతో కులాల ఆధారంగా ఓట్లు వేసే పద్ధతికి స్వస్తి చెప్పారు.

ప్రజాస్వామ్యశక్తులకు ఊతమిచ్చే ఫలితం : పినరయి



కొచ్చి : రాబోయే ఎన్నికలలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలకు కర్నాటక ఫలితాలు ఊతమిచ్చాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. వివిధ రాష్ట్రాలలో ...2లో

కోటా పెంచినా దక్కని ఫలితం !

ఎస్సీ, ఎస్టీ సీట్లలో రాలని ఓట్లు

ఎస్సీలు, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచాలని, ఎస్సీలకు అంతర్గతంగా రిజర్వేషన్లు కల్పించాలని కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆ వర్గాల ఓట్లను రాబట్టలేకపోయింది. రాష్ట్రంలోని 51 రిజర్వ్‌డ్ స్థానాలలో ఆ పార్టీకి దక్కింది కేవలం 12 మాత్రమే. 2018 ఎన్నికలలో బీజేపీ 22 రిజర్వ్‌డ్ స్థానాలను గెలుచుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు బీజేపీ ప్రభుత్వం ఎస్సీల రిజర్వేషన్లను 15శాతం నుండి 17శాతం, ఎస్టీల రిజర్వేషన్లను 3శాతం నుంచి 7శాతం పెంచింది. 2018 ఎన్నికలలో ...2లో

హైకమాండ్ చేతిలో

సీఎం ఎంపిక

కర్నాటక కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నిర్ణయం

- ముగ్గురు ఏఐసీసీ పరిశీలకుల సమక్షంలో భేటీ



బెంగళూరు : కర్నాటక కొత్త ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయించాలని కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కోరింది. బెంగళూరులోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో ఆదివారం కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది. కర్నాటకలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించేందుకు జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు సుశీల్ కుమార్ షిండే, జితేంద్ర సింగ్, దీపక్ బబారియా హాజరయ్యారు. సమావేశానికి ముందు మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్‌లతో ఎఐసిసి పరిశీలకులు సమావేశమయ్యారు. కర్నాటకలో కొత్త ముఖ్యమంత్రి, మంత్రివర్గం ఈ నెల 18వ తేదీ గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమానికి సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే హాజరవుతారని, ప్రతిపక్ష పార్టీలకు కూడా ఆహ్వానం పంపుతారని తెలిసింది. గత అసెంబ్లీ గడువు ఈ నెల 24తో ముగియనున్నందున కర్నాటకలో కొత్తగా ఎన్నికైన అసెంబ్లీని అంతకుముందే ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్టీ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్ సిఎం పదవిపై ఆసక్తి వ్యక్తం చేశారు.

సిద్ధరామయ్య, శివకుమార్‌లకు మద్దతుగా పోస్టర్లు

సిద్ధరామయ్య మద్దతుదారులు బెంగళూరులోని ఆయన ఇంటి వెలుపల "కర్నాటక తదుపరి ముఖ్యమంత్రి" అని పేర్కొంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. "కర్నాటక కొత్త ముఖ్యమంత్రి"కి "పుట్టినరోజు శుభాకాంక్షలు" తెలుపుతూ శివకుమార్ మద్దతుదారులు ఇంటి బయట పోస్టర్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఆయన పుట్టినరోజు. 224 మంది సభ్యుల సభలో కాంగ్రెస్ 135 సీట్లను కైవసం చేసుకుంది. ఇద్దరు ఇండిపెండెంట్లు ...5లో

బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే తొలగించాలి

రెజ్లర్ల సంఘం చీఫ్‌ను అరెస్టు చేయాలి :

వ్యవసాయ కార్మిక సంఘాల నేతల డిమాండ్



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే తొలగించి, ఆయనపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మికసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 22 రోజులు పూర్తి చేసుకుంది. ధర్నా శిబిరాన్ని ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు ఆందోళన చేస్తున్న క్రీడాకారులకు ఉద్యమ సహాయ నిధిని అందజేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బి. వెంకట్, రాజ్యసభ ఎంపీ శివ దాసన్, బోలా ప్రసాద్, బిజిలాల్ భారతి, రాధిక మీనన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ ప్రధాని మోడీ అండతోనే బ్రిజ్ భూషణ్ పెట్రేగి పోతున్నారని, ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రధాని మోడీ నియంతృత్వాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. రెజ్లర్లు చేస్తున్న పోరాటం దేశ ప్రతిష్టకు, ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన పోరాటమని అన్నారు. దేశానికి గోల్డ్ మెడల్ తీసుకొచ్చిన రెజ్లర్లను రోడ్డున పడేసిన బ్రిజ్ భూషణ్ ను తక్షణమే పదవి నుంచి తొలగించి ..సత్వరమే అరెస్టు చేయాలని డిమాండ్ ...5లో



అంబేద్కర్ సేవలు మరువలేనివి

- లండన్‌లోని అంబేద్కర్ మ్యూజియాన్ని సందర్శించిన మంత్రి కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లండన్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ అక్కడి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ మ్యూజియాన్నిఆదివారం సందర్శిం చారు. బారిష్టర్ చదువు కోసం ఇంగ్లాండ్ వెళ్లిన అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఈ మ్యూజియంలో పొందుపరిచారు. ఎంతో ఆసక్తితో ఈ మ్యూజియాన్ని తిలకించిన కేటీఆర్ ఆనాడు అంబేద్కర్ నివసించిన గదిని కూడా చూశారు. హైదరాబాద్‌లో ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహ నమూనాను మ్యూజియం అధికారులకు కేటీఆర్ బహూకరించారు. ఇండియన్ హై కమిషన్‌కు అంబేద్కర్ చిత్రపటాన్ని ఇచ్చారు. బాబా సాహెబ్ సహకారాన్ని హైలైట్ చేయడంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అసాధారణ ప్రయత్నాలకు ఎఫ్ఏబీఓ-యూకే కూడా మంత్రి కేటీఆర్‌ను సత్కరించింది. విలియం గౌల్డ్, క్రిస్టోఫ్ జాఫ్రెలాట్‌ల తో కలిసి రచించిన 'అంబేద్కర్ ఇన్ లండన్' పుస్తకం సంతకం కాపీని మంత్రి కేటీఆర్‌కు ఎఫ్ఏబీఓ ప్రెసిడెంట్ సంతోష్‌దాస్ అందించారు. ప్రజాస్వా మ్య సంక్షేమ భారత నిర్మాణంలో అంబేద్కర్ చేసిన ...5లో

రవాణా రంగాన్ని రక్షించాలి

కార్మికుల జీవనోపాధిని కాపాడాలి

- పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి
- ఎక్సైజ్ సుంకాన్ని ఉపసంహరించుకోవాలి
- అసంఘటిత రవాణా కార్మికులకు సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించాలి
- మోటర్ వెహికల్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి: రోడ్డు రవాణ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ జాతీయ కన్వెన్షన్



వివరాలు 2లో..


అయోధ్యలో ముస్లిం అభ్యర్థి విజయం



పుర ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..

- రామజన్మభూమి వెనుక భాగంలోని వార్డులో గెలుపు
- మూడో స్థానంలో బీజేపీ

లక్నో : యూపీలోని నగరపాలక ఎన్నికల్లో ఒక ముస్లిం అభ్యర్థి విజయం ఆశ్చర్యం కలిగిస్తున్నది. హిందూత్వ ప్రాబల్యం అధికంగా ఉండే అయోధ్య లోని ఒక వార్డులో సదరు అభ్యర్థి గెలిచారు. ఇండిపెండెంట్‌గానే పోటీ చేసి ఈ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. అయోధ్యలో జరిగిన మేయర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. మొత్తం 60 వార్డుల్లో 27 వార్డులను ఆ పార్టీ కైవసం చేసుకున్నది. ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) 17 స్థానాల్లో విజయం సాధించగా.. స్వతంత్రులు 10 స్థానాల్లో గెలిచారు. ఈ ఎన్నికల్లో సుల్తాన్ అన్సారీ ...5లో



సీబీఐ చీఫ్‌గా ప్రవీణ్ సూద్

కర్నాటక డిజీపీకి దక్కిన పదవి..

- బీజేపీకి కొమ్ముకాస్తున్నారంటూ కాంగ్రెస్ ఆరోపణలు
- ఫలితాలు రాగానే కర్నాటక నుంచి సీబీఐ బాస్ గా పదోన్నతి..

వివరాలు 2లో..

అడ్డగోలు దందా..!

నారాయణ విద్యాసంస్థల నయామోసం

పార్ట్-1

- జేఈఈ మెయిన్ ఫలితాలపై తప్పుడు ప్రకటనలు
- ఆలిండియా స్థాయిలో ఒకటో ర్యాంకులు ఐదు వచ్చాయంటూ ప్రచారం
- టాప్‌టెన్‌లో మూడు ర్యాంకులేనంటూ వెల్లడి
- ఆ కాలేజీలో చదవకపోయినా వాడుకున్న ర్యాంకర్ల పేరు
- విద్యార్థులు,తల్లిదండ్రులను మభ్యపెడుతున్న వైనం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ



ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చేయటం ఇంద్రజాలికుల మాయాజాలం. రాని ర్యాంకును వచ్చినట్టు చూపటం లేని విద్యార్థిని ఉన్నట్టు చూపటం నారాయణ దందాజాలం. ఈ కార్పొరేట్ దందాలో అటు తల్లిదండ్రులు,ఇటు విద్యార్థులు సమిధలవుతున్నారు. లాభాలే పరమావధిగా ధనార్జనే లక్ష్యంగా కొనసాగుతున్న ఈ అడ్డగోలు వ్యవహారాన్ని అడ్డుకోవాల్సిన సర్కారు చేష్టలుడిగి చూస్తున్నది. ఈ మొత్తం వ్యవహారంపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ విద్యాసంస్థ అయిన నారాయణ జేఈఈ మెయిన్ ఫలితాలకు సంబంధించి తప్పుడు ప్రకటన విడుదల చేసిందంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలిండియా స్థాయిలో ఒకటో ర్యాంకులు ఐదు నారాయణ విద్యాసంస్థకు మాత్రమే సొంతమంటూ ప్రచారం చేసుకున్నది. ఒకటో ర్యాంకు సాధించిన వారిలో పి లోహిత్ ఆదిత్య సాయి, సాయి దుర్గారెడ్డి నందిపాటి, ధీరావత్ తనూజ్, దీశాంక్ ప్రతాప్‌సింగ్, ఎండీ సాహిల్ అక్తర్ ఉన్నారు. అయితే ఆ ర్యాంకులు వారికి ఏయే కేటగిరీలో వచ్చాయో ప్రకటించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఆ ఐదు ర్యాంకులూ జనరల్ కేటగిరీలోనే వచ్చాయా? లేక ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఇలా వివిధ కేటగిరీల్లో వచ్చాయా అనే స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. ఇంకోవైపు టాప్‌టెన్‌లో మూడు ర్యాంకులు వచ్చాయంటూ అదే విద్యాసంస్థ ప్రకటించింది. ఓపెన్ కేటగిరీలో రెండు, ఐదు, ఆరు ర్యాంకులే వచ్చాయని వివరించింది. ఆలిండియా స్థాయిలో ఒకటో ర్యాంకులు ఐదు వచ్చిన నారాయణ విద్యాసంస్థకు టాప్‌టెన్‌లో మూడు ర్యాంకులే వచ్చాయంటూ ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. విద్యార్థులు, తల్లిదండ్రులను మభ్యపెట్టడమే దీని ఉద్దేశమని అర్థమవుతున్నది. ఇంకోవైపు ఆలిండియా ఒకటో ర్యాంకు వచ్చిన పి లోహిత్ ఆదిత్యసాయి ...5లో

కాంగ్రెస్‌కు ముస్లింల దన్ను



బీజేపీ కొంపముంచిన హిజాబ్, హలాల్

- మైనారిటీ వ్యతిరేక చట్టాలపై వెల్లువెత్తిన ఆగ్రహం

బెంగళూరు : కర్నాటకలో హిజాబ్, హలాల్ వివాదాలు బీజేపీ కొంపముంచాయి. కమలదళంపై ఆగ్రహంతో ఊగిపోయిన మైనారిటీలు కాంగ్రెస్‌కు దన్నుగా నిలిచారు. పాత మైసూరు ప్రాంతంలో ముస్లింల జనాభా 11 శాతం వరకూ ఉంటుంది. అయితే 2008 తర్వాత అక్కడి నుండి జనతాదళ్ (ఎస్) తరఫున ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా ఎన్నిక కాలేకపోవడం ఇదే మొదటిసారి. పాత మైసూరులో జేడీ (ఎస్)కు బలమైన కేడర్ ఉన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఈ తరహా ఫలితం రావడాన్ని పరిశీలిస్తే ముస్లింలు ఈసారి కాంగ్రెస్‌కు అండగా నిలిచారని అర్థమవుతోంది. పాత మైసూరులో అత్యధిక స్థానాలు గెలుచుకోవడానికి ఒక్కలిగులు, ముస్లింల ఓట్ల పైనే జేడీ (ఎస్) ఎక్కువగా ఆధారపడుతోంది. అందుకే హిజాబ్, హలాల్ విషయాలపై ఆ పార్టీ బాహాటంగానే గళం విప్పింది. అయినప్పటికీ జేడీ (ఎస్)కు ఒరిగిందేమీ లేదు.

జేడీ (ఎస్)పై అనుమానంతోనే...

పాత మైసూరు ప్రాంతంలో ఒక్కలిగుల ఓట్లతో పాటు ముస్లింల ఓట్లు కూడా ఈసారి కాంగ్రెస్‌కే పడ్డాయని రాజకీయ విశ్లేషకుడు ఎ.నారాయణ తెలిపారు. ముస్లిం ఓట్ల కోసం జేడీ (ఎస్) హిజాబ్‌ను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఆ పార్టీ చివరికి బీజేపీ పంచన చేరుతుందేమోనన్న అనుమానంతో మైనారిటీలు కాంగ్రెస్‌కే మద్దతు ఇచ్చారని ఆయన వివరించారు. ఫలితాలు కూడా ఈ విషయాన్నే నిరూపించాయి. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 15 మంది ముస్లిం అభ్యర్థులను బరిలో దింపగా వారిలో 9 మంది విజయం సాధించారు. జేడీ (ఎస్) 22 మంది మైనారిటీలను పోటీకి నిలిపినా ఒక్కరూ గెలవలేకపోయారు.

2018 ఎన్నికలలో ఐదుగురు ముస్లింలు కాంగ్రెస్ తరఫున, ఇద్దరు జేడీ (ఎస్) తరఫున అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని 224 అసెం బ్లీ స్థానాలలోనూ 65 స్థానాలలో ముస్లిం ఓటర్లు చెప్పుకో దగిన సంఖ్యలో ఉన్నారు. వాటిలో సగం సీట్లను కాంగ్రెస్ చేజిక్కించుకుంది. రాష్ట్ర జనాభాలో 13 శాతం మంది ముస్లిం లు ఉన్నారని 2011 జనాభా లెక్కలను బట్టి తెలు స్తోంది.

బొమ్మై ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం

కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన 15 మంది ముస్లిం అభ్యర్థులలో కేవలం ముగ్గురు మాత్రమే కోస్తా కర్నాటక ప్రాంతానికి చెందిన వారు. ఆ ప్రాంతంలో బీజేపీ తన ఆధిపత్యాన్ని నిలుపుకుంది. బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం ముస్లింలను లక్ష్యంగా చేసుకొని పలు చర్యలు చేపట్టడం వారి ఆగ్రహానికి కారణమైంది. గత సంవత్సరం ప్రీ-యూనివర్సిటీ కళాశాలలలో హిజాబ్ ధారణను నిషేధించింది. దీంతో ఉడిపి వంటి కోస్తా జిల్లాలలో నిరసనలు మిన్నంటాయి. ముస్లింలను బహిష్కరించాలంటూ పిలుపునిచ్చిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బీసీ నగేష్ తుముకూరు జిల్లా తిప్‌తూర్ అసెంబ్లీ స్థానంలో ఓడిపోయారు. మత మార్పిడులను, పశువుల రవాణాను నిషేధిస్తూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు కూడా మైనారిటీల వ్యతిరేకతకు కారణమయ్యాయి. హలాల్ మాంసంపై నిషేధం విధించాలని కొందరు బీజేపీ నాయకులు పిలుపునివ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇతర వెనుకబడిన తరగతుల కింద ముస్లింలకు కల్పించిన 4% రిజర్వేషన్లను రద్దు చేయాలన్న నిర్ణయం కూడా బీజేపీ పతనానికి కారణమైంది. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నిర్ణయాన్ని అమలు చేయబోనని ప్రకటించింది. అటు కాంగ్రెస్ కూడా కోటాను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చి ముస్లింల అభిమానాన్ని చూరగొన్నది.

బజరంగ్‌దళ్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలను నిషేధిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. అయితే బజరంగ్‌దళ్‌పై నిషేధ ప్రకటన కాంగ్రెస్ ఎత్తుగడలో ఓ భాగమే. హిందువుల ఓట్లు పూర్తిగా బీజేపీ వెనుక సంఘటితం కాలేదని తాము ముందుగానే అంచనా వేశామని, బజరంగ్‌దళ్‌పై తీసుకున్న నిర్ణయం ఓ పాచిక అని, చివరికి అది పారిందని పేరు చెప్పడానికి ఇష్టపడని కాంగ్రెస్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. పాత మైసూరు ప్రాంతంలో మాదిరిగానే బాంబే కర్నాటక ప్రాంతంలో కూడా కాంగ్రెస్‌కు ముస్లింలు పెద్ద సంఖ్యలో ఓటేశారు. అక్కడ కాంగ్రెస్‌కు 33 సీట్లు రాగా బీజేపీ 16 స్థానాలతో సరిపెట్టుకుంది.

ఫ్లాప్ షో..!

(మొదటిపేజీ తరువాయి)

కలిగించింది. పాఠశాలలకు వెళ్లే ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించకుండా అడ్డుకోవడం, హలాల్‌పై నిషేధం విధించడం, 18వ శతాబ్దిలో మైసూర్‌ను పాలించిన టిప్పు సుల్తాన్ ఒక్కలిగుల చేతిలో హత్యకు గురయ్యారంటూ కల్పిత కథను ప్రచారం చేయడం వంటి చర్యలు బీజేపీ విజయావకాశాలను దారుణంగా దెబ్బతీశాయి. హిందూత్వ కార్డును ప్రయోగించడం వల్ల బీజేపీకి నష్టం జరగవచ్చునని ఎన్నికలకు కొద్ది వారాల ముందే బొమ్మై గ్రహించారు. అయినా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోయింది. మరోవైపు ముస్లిం ఓటర్లు పూర్తిగా కాంగ్రెస్ వైపు సంఘటితమయ్యారు. మైనారిటీలు గతంలో కంటే ఇప్పుడు పది శాతం ఎక్కువగా కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని సర్వేలు తేల్చేశాయి.ఏదేమైనా ఎన్నికల ఫలితాలు బీజేపీ హిందూత్వ వాదనను వెనక్కి నెట్టాయి. హిజాబ్‌పై నిషేధం విధించడానికి ప్రధాన కారకుడైన మంత్రి బీసీ నగేష్ ఓడిపోయారు. సుఫీల ప్రార్థనా మందిరంపై వివాదాన్ని సృష్టించిన బీజేపీ నాయకుడు సీటీ రవికి కూడా పరాజయం తప్పలేదు. హలాల్‌పై నిషేధం విధించడాన్ని ఆయన సమర్థించారు కూడా. హిందువుల ప్రాబల్యం అధికంగా ఉండే కొడగూ ప్రాంతంలోని రెండు స్థానాలనూ కాంగ్రెస్ గెలుచుకుంది. ఆర్థిక ఇబ్బందులతో అష్టకష్టాలు పడుతున్న హిందూ ఓటర్లను హిందూత్వ నినాదం ఏ మాత్రం ఆకర్షించలేకపోయింది.

స్థానిక నాయకత్వాన్ని విస్మరించి...

మరో ముఖ్యమైన విషయమేమంటే ప్రతి దానికీ అధిష్టానం పైనే ఆధారపడడం కూడా బీజేపీ కొంప ముంచింది. ప్రచారం చివరి దశలో కాంగ్రెస్ పార్టీ 'నందిని' పాల అంశాన్ని తెర పైకి తెచ్చింది. కర్నాటక పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ అయిన నందినిని బలహీనపరచి, గుజరాత్‌కు చెందిన అమూల్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న బీజేపీ ప్రభుత్వ ప్రయత్నం పాత మైసూర్ ప్రాంతంలో కొంత ప్రభావం చూపింది. ఆర్థికపరంగా ఎదురైన సవాళ్లు, పెరగని వేతనాలు, ద్రవ్యోల్బణం వంటివి కర్నాటక ఫలితంపై ప్రభావం చూపాయి. ఇన్ని ప్రతికూలతల నడుమ రాబోయే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ఎలా సమాయత్తమవుతుందో వేచి చూడాల్సిందే.

కోటా పెంచినా దక్కని ఫలితం !

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ 16ఎస్సీ స్థానాలు, 6 ఎస్టీ స్థానాలు గెలుచుకోగా ఈ ఎన్నికలలో 12 ఎస్సీ స్థానాలు మాత్రమే లభించాయి. ఎస్టీ అభ్యర్థులలో ఒక్కరు కూడా గెలవ లేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ 21 ఎస్సీ సీట్లు, 14 ఎస్టీ సీట్లు గెలుచు కుంది. 2018 ఎన్నికలతో పోలిస్తే ఆ పార్టీకి 15 రిజర్వ్‌డ్ స్థానాలు అదనం గా లభించాయి. ఏ కులానికైనా రిజర్వేషన్లు పెంచాలన్నా లేదా తగ్గించాల న్న సుదీర్ఘమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని, శాస్త్రీయ గణాం కాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పీసీసీలో సామాజిక న్యాయ విభాగం అధ్యక్షుడు సీఎస్ ద్వారకానాథ్ చెప్పారు. అయితే బీజేపీ ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి గణాంకాలు అందు బాటులో లేవని విమర్శించారు. యాభై శాతం పరిమితిని మించి రిజర్వేష న్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణను తీసుకొచ్చే విషయంలో బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు. దీంతో ప్రభుత్వ ఉద్దేశంపై ఎస్సీ లు, ఎస్టీలలో అనుమానాలు రేకెత్తించేందుకు కాంగ్రెస్, జేడీ (ఎస్)లకు ఆయుధం దొరికినట్లయింది. అయితే రిజర్వేషన్ల పెంపుపై కర్నాటక బీజేపీ లేఖ రాసినప్పటికీ 50 శాతానికి మించి పెంచే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర మంత్రి ఎ. నారాయణస్వామి లోక్‌సభకు తెలియజేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీలలో మరిన్ని అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ప్రజాస్వామ్య శక్తులకు ఊతమిచ్చే ఫలితం :పినరయి

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇతర బీజేపీ యేతర పక్షాలు బీజేపీని ఓడించే లక్ష్యంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పు ఫలితమే కర్నాటకలో బీజేపీ ఓటమి అని చెప్పారు. ఎన్నికలలో ఓటమి చెందినా అధికారాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ చేసే ప్రయత్నాల పట్ల జాగరూకతతో ఉండాలని కాంగ్రెస్‌కు పినరయి సూచించారు

ఆ రైళ్లను తెలంగాణలో ఆపండి

- రైల్వే శాఖ మంత్రికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మీదుగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న రైళ్లకు ఇక్కడ కూడా స్టాప్‌లు ఇవ్వాలని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారంనాడాయన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాసారు. యశ్వంత్‌పూర్ - హజ్రత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (నెం. 12649/12650) కాచిగూడ నుంచి బయలుదేరి కర్నూలు చేరుకునే వరకు 200 కిలోమీటర్ల మధ్యలో ఎక్కడా స్టాప్ లేని విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. ఆ రైలును మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్లో స్టాప్ ఏర్పాటుచేయాలని కోరారు. తద్వారా ఢిల్లీ, బెంగుళూరు వంటి సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ఈ ప్రాంత ప్రజలు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం ఉండదని వివరించారు.

రవాణా రంగాన్ని రక్షించాలి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రవాణా రంగాన్ని రక్షించటంతో పాటు కార్మికుల జీవనోపాధిని కాపాడాలని ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఆర్గనైజేషన్స్ నేషనల్ కన్వెన్షన్ పిలుపు ఇచ్చింది. ఈ కన్వెన్షన్ ఆదివారం సీఐటీయూ కేంద్ర కార్యాలయం (బీటీఆర్ భవన్)లో జరిగింది. కె.కె.దివాకరన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్), ధర్మవీర్ చౌదరి (ఎన్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ), జయరాజన్ (ఏఐసీసీటీయూ), నాగరాజన్ (టీటీఎస్ఎఫ్)లు కన్వెన్షన్‌కు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

ఎన్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిర్మల్ సింగ్ ధాలివాల్, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, ఏఐసీసీటీయూ నేత ఎస్.కె.రాయ్, టీటీఎస్ఎఫ్ నేత సంపత్ కన్వెన్షన్‌లో మాట్లాడారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నేత ఆర్. లక్ష్మయ్య ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌ను కన్వెన్షన్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సదస్సుకు అతిథిగా హాజరైన సీఐటీయూ కార్యదర్శి ఆర్.కరుమ్‌లైయన్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు గిరి ప్రసంగించారు.

కన్వెన్షన్ నిర్ణయాలు

జూన్, జూలై నెలలో రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించాలని కన్వెన్షన్ పిలుపు ఇచ్చింది. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న క్రూరమైన విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రవాణా కార్మికులు భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చింది. సెప్టెంబర్ రెండో వారంలో అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ స్థాయిలో ప్రదర్శనలు జరపాలని, రాష్ట్ర స్థాయిలో సమన్వయ కమిటీ నాయకత్వం సమావేశమై కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న రోడ్డు రవాణా కార్మికులందరూ పాల్గొని కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయాలని సదస్సు విజ్ఞప్తి చేసింది.

డిమాండ్లు

- డీజిల్, పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఉపసంహరించుకోవాలి. 2020 జూన్ 7న ఆయిల్ కంపెనీలు సవరించిన ధరలను వెనక్కి తీసుకోవాలి.
- రాష్ట్రాలకు వచ్చే ఆదాయ నష్టాన్ని సక్రమంగా భర్తీ చేస్తూ పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి పొందుతున్న వారికి కొత్త వాహనాల కొనుగోలు కోసం జాతీయ బ్యాంకుల ద్వారా రుణం ఇచ్చే ఏర్పాట్లు చేయాలి.
- ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీల వేధింపులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.
- బీమా ప్రీమియంలను నియంత్రించాలి. ప్రీమియం రేట్లను నిర్ణయించడంలో పారదర్శకత పాటించాలి.
- అపాయింట్‌మెంట్ లెటర్స్, చట్టాల వర్తింపు కోసం వి.వి.గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ సిఫారసులను సక్రమంగా అమలు చేస్తూ అసంఘటిత రవాణా కార్మికుల కోసం సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించండి.
- సవరించిన మోటర్ వెహికల్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి. మెరుగైన, సరైన ప్రత్యామ్నాయ విధానం కోసం భాగస్వామ్య పక్షాలతో చర్చించాలి.
- కార్మిక వర్గ లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి
- స్వయం ఉపాధితో సహా అసంఘటిత రోడ్డు రవాణా కార్మికులందరూ కార్మిక శాఖ రిజిస్టర్లలో నమోదు చేయాలి.
- స్వయం ఉపాధితో సహా అసంఘటిత రోడ్డు రవాణా కార్మికులందరూ అన్ని కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలి. అందుకనుగుణంగా తగిన సవరణలు చేయాలి.
- పోలీసులు, ఇతర అధికారుల వేధింపులను తక్షణమే ఆపాలి.
- ఉబర్, ఓలా వంటి యాప్ ఆధారిత కంపెనీల్లో పని చేసే డ్రైవర్లను కార్మికులుగా పరిగణించాలి. అందుకనుగుణంగా మోటర్ వెహికిల్ చట్టం, ఎంటీడబ్ల్యూ చట్టంలో సవరణలు చేయాలి.
- కాంట్రాక్టర్ల ద్వారా ఆయిల్ ట్యాంకర్లపై పనిచేసే డ్రైవర్లు, క్లీనర్‌లకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ మొదలైనవి చెల్లించాలి. ఆయిల్ కంపెనీలు అమలుకు బాధ్యత వహించాలి. కాంట్రాక్టర్లతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఈ నిబంధన చేర్చాలి.
- డ్రైవర్ వృత్తిని గౌరవంగా చూడాలి.
- బడ్జెట్‌ను కేటాయించడంతో రాష్ట్రాల్లో ఉండే ఆర్టీసిలను బలోపేతం చేయాలి. విస్తరించాలి.
- 1:2 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్టీసీలకు మూలధన సహకారం పునరుద్ధరించాలి. ఈ ప్రయోజనం కోసం వివిధ దేశాలలో చేస్తున్న విధంగా నిధులను సమీకరించడానికి తగిన పద్ధతులు అనుసరించాలి.
- దేశంలోని అన్ని ఆర్టీసిలకు పేరుకుపోయిన అప్పులను ప్రభుత్వాలు వన్-టైమ్ సెటిల్‌మెంట్‌తో ఈక్విటీగా మార్చాలి.
- లక్ష బస్సులను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసి, వన్ టైమ్ సెటిల్‌మెంట్‌గా దామాషా ప్రాతిపదికన అన్ని ఆర్టీసిలకు పంపిణీ చేయాలి.
- ఎక్సైజ్ డ్యూటీ, డీజిల్, ఛాసిస్, స్పేర్స్, ఫ్యాబ్రికేషన్ మొదలైన వాటిపై సేల్స్ టాక్స్ నుంచి ఆర్టీసిలను మినహాయించాలి.
- ఎఫ్ఎఎంఈ I, II కింద ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీలతో మాత్రమే సేకరించాలి. నిర్వహించాలి.
- ఆర్టీసీలకు "లాభం, నష్టం" స్కేల్‌లో కొలవకూడదు.
- ప్రయివేట్ ఆపరేటర్ల అక్రమ కార్యకలాపాలను వెంటనే ఆపాలి. ఎంవి యాక్ట్‌కు అవసరమైన సవరణలు తీసుకురావాలి.
- ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్టీసీ చట్టం 1950లోని సెక్షన్ 19(1)(సి)లో నిర్దేశించిన విధంగా న్యాయమైన వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్ ఏర్పాటు, నివాసం, విశ్రాంతి కోసం స్థలాలు, వినోదం ఇతర సౌకర్యాలతో సహా తగిన సేవా పరిస్థితులు అందించాలి.
- ఆర్టీసీ కార్మికులందరూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ పథకానికి అర్హులు కావాలి.
- ఆర్టీసీ కార్మికులను కూడా కోవిడ్-19 వారియర్స్‌గా పరిగణించాలి. 50 లక్షల బీమా, ఇతర ప్రయోజనాలు ఇవ్వాలి.
- ఆర్టీసీలు ఉత్తమ నిర్వహణ పద్ధతులను ఏర్పరచుకున్నందున, వారి స్వంత స్క్రాపింగ్ విధానాలను అవలంబించినందున బస్సులను స్క్రాప్ చేయడం తప్పనిసరి చేయకూడదు.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదలైన ప్రాంతాల్లో జరుగుతున్న విధంగా అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి గూడ్స్ రవాణాను చేపట్టేందుకు అన్ని ఆర్టీసీలకు అనుమతి ఇవ్వాలి.
- పెట్రోలు, డీజిల్ అవుట్ లెట్ డీలర్ షిప్ అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి ఆర్టీసీలకు మంజూరు చేయాలి.

సీబీఐ చీఫ్‌గా ప్రవీణ్ సూద్

కర్నాటక డిజీపీకి దక్కిన పదవి..

- బీజేపీకి కొమ్ముకాస్తున్నారంటూ కాంగ్రెస్ ఆరోపణలు
- ఫలితాలు రాగానే కర్నాటక నుంచి సీబీఐ బాస్‌గా పదోన్నతి..

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తదుపరి డైరెక్టర్‌గా కర్నాటక డీజీపీ ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైశ్వాల్ పదవీ విరమణ అనంతరం ప్రవీణ్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండేండ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రధాని మోడీ, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేతలతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ శనివారం సాయంత్రం సమావేశమైంది. కర్నాటక డీజీపీ ప్రవీణ్ సూద్, మధ్యప్రదేశ్ డీజీపీ సుధీర్ సక్సేనా, తాజ్ హాసన్‌లను ఈ పదవి కోసం ఎంపిక చేసింది. చివరికి ప్రవీణ్ సూద్‌ను సీబీఐ డైరెక్టర్‌గా నియమించింది. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైశ్వాల్ రెండేండ్ల పదవీ కాలం మే 25తో ముగుస్తుంది. ఆయన తరువాత ప్రవీణ్ సూద్ సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. సీబీఐ డైరెక్టర్ పదవిలో నియమితులైనవారి పదవీ కాలం రెండేండ్లు ఉంటుంది.

ఆ తరువాత ఐదేండ్ల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది. ప్రవీణ్ కర్నాటక కేడర్ 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం కర్నాటక డీజీపీగా పని చేస్తున్నారు. ఆయనపై ఇటీవల కర్నాటక కాంగ్రెస్ నేత డికె శివ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతున్నారని, బీజేపీని కాపాడుతున్నారని, ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే ఆ రాష్ట్ర డీజీపీని అత్యున్నత కేంద్ర దర్యాప్తు సంస్థల్లో ఒకటైన సీబీఐ డైరెక్టర్‌గా నియమించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

బీజేపీ ముక్త్ సౌతిండియా

- కర్నాటకలో ఓటమితో ఆ పార్టీ పతనం మొదలైంది: ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కర్నాటకలో ఘోర పరాజయంతో బీజేపీ ముక్త్ సౌతిండియాగా దక్షిణ భారతదేశం మారిందని పీయూసీ చైర్మెన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కర్నాటక నుంచే అభివృద్ధి నిరోధక బీజేపీ పతనం మొదలైందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమలనాథుల మత విద్వేష రాజకీయాలకు కాలం చెల్లిందని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు వెన్నుదన్నుగా నిలిచి పేద ప్రజల బతుకులను బలి చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ డ్రామాలకు శాశ్వతంగా తెరవేయడానికి కన్నడ ప్రజలు దేశానికే దిశానిర్దేశం చేశారని అభినందించారు. తెలంగాణలో బీజేపీకి డిపాజిట్లు కూడా రావని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సింగిల్ డిజిట్ స్థానాలు కూడా రావని తెలిపారు.

నోటా కంటే తక్కువే !

- అన్ని చోట్లా ఆప్ డిపాజిట్లు గల్లంతు



బెంగళూరు : దక్షిణాదిన పాగా వేయాలని అమ్‌ఆద్మీ పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో నోటాకు 0.69% ఓట్లు రాగా ఆ పార్టీకి అంతకంటే తక్కువగా అంటే 0.58 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. ఆప్ అభ్యర్థిగా గడగ్ జిల్లాలోని రాన్ అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన అనేకల్ దొడ్డయ్యకు మాత్రమే గౌరవప్రదమైన ఓట్లు (8,839) లభించాయి. పోలైన 1,78,196 ఓట్లలో ఆయనకు 4.96 % శాతం ఓట్లు వచ్చాయి. బెంగళూరు నగరంలో ఆప్ తరఫున బరిలో నిలిచిన ప్రముఖులు బ్రజేష్ కాలప్ప, మోహన్ దాసరి కూడా చిత్తుగా ఓడిపోయారు. ఆప్ మొత్తం 208 మంది అభ్యర్థులను పోటీకి నిలిపింది. అయితే క్షేత్రస్థాయిలో తగిన మద్దతు లేకపోవడం, ప్రజల్లోకి సరిగా వెళ్లలేకపోవడం వంటి కారణాలతో ఓటర్ల ఆదరణ పొందలేక పోయింది. ఆ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2.25 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. పార్టీ అభ్యర్థులలో 72 మందికి మాత్రమే వెయ్యి కంటే ఎక్కువ ఓట్లు లభించాయి. పార్టీకి రాజీనామా చేసి ఆప్‌లో చేరిన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి కాలప్పకు చిక్‌పేట్‌లో కేవలం 600 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

జూన్ 1 నుంచి కొత్త రేషన్ కార్డులు?


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో జూన్ 1 నుంచి కొత్తరేషన్ కార్డులు జారీ చేయనున్నారు. పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకోసం రెండు కమిటీలను నియమించింది. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు కొత్తగా పేర్లను చేర్చుకునేవారికి ఇది ఉపయోగకరంగా ఉండనుంది.



కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఫ్రెంచ్ ప్రభుత్వం

నెల్లూరు నరసింహారావు



ఫ్రాన్స్‌లోని ఎమ్మాన్యుయల్ మక్రాన్ ప్రభుత్వం పెన్షన్ సంస్కరణ పేరుతో పదవీ విరమణ వయస్సును 62 నుంచి 64 ఏండ్లకు పెంచి, పెన్షన్లలో కోతను విధించింది. లేబర్ యూనియన్లు, ప్రతిపక్షపార్టీలు జనవరి 19 నుంచి 13 రోజుల పాటు సాధారణ సమ్మెను నిర్వహించాయి. ఈ పారిశ్రామిక సమ్మెకు మద్దతుగా దేశ వ్యాప్తంగా వందలాది ప్రదర్శనలు జరిగాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు జాతీయ అసెంబ్లీ ఆమోదం అవసరం లేకుండా చేయగలిగే ఫ్రెంచ్ రాజ్యాంగంలోని 49.3 అధికరణను ఉపయోగించి పెన్షన్ సంస్కరణను ఆమోదించాడు. ఏప్రిల్ 14వ తేదీనాడు ఫ్రెంచ్ రాజ్యాంగ పరిషత్తు సంస్కరణ ప్రణాళికను పాక్షికంగా ఆమోదించింది. దాని తరువాత పదవీ విరమణ వయసు పెంపుదలకు సంబంధించిన చట్టంపై ఫ్రెంచ్ అధ్యక్షుడు సంతకం చేశాడు.

మేడే రోజున లక్షలాది కార్మికులు తమ పెన్షన్లలో కోత విధించటాన్ని వ్యతిరేకిస్తూ ఫ్రెంచ్ నగరాలలో చేసిన ప్రదర్శనలపై మక్రాన్ ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని మోపింది. ప్రదర్శకులపై పోలీసులు జరిపిన హింసలో వేలాదిమంది గాయపడ్డారు. తమను ధిక్కరిస్తే పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలు ఎలా విరుచుకుపడతాయో చూపటానికన్నట్టుగా ఆ రోజున ఫ్రాన్స్ అంతటా పోలీస్ జులుం కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాన్స్ లో ఏర్పడిన విచీ ప్రభుత్వం తరువాత నిరసన తెలుపుతున్న ప్రజల మీద ఇంతగా హింసను ప్రయోగించిన ప్రభుత్వం మరొకటి లేదు. ఫ్రాన్స్‌లోని 75శాతం ప్రజలు వ్యతిరేకిస్తున్న ఈ పెన్షన్ కోతలను సమర్థించుకోవటానికి ఫ్రెంచ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున హింసను ఆశ్రయిస్తోంది.

ఇటీవల కాలంలో ఫ్రాన్స్ లో సామాజిక అసమానతలపై జరిగిన "ఎల్లో వెస్ట్" ఉద్యమంలో కంటే ఎక్కువగా రాజ్యహింస చెలరేగుతోంది. సంవత్సరంపాటు జరిగిన ఆ ఉద్యమంలో 10వేల మందికిపైగా అరెస్టు అయ్యారు. 4400మంది గాయపడ్డారు. 30మంది వికలాంగులుగా మారారు. ఒకరు చనిపోయారు. 2023లో ఫ్రెంచ్ ట్రేడ్ యూనియన్లు 14 సార్లు జాతీయ స్థాయిలో నిరసనలకు ఇచ్చిన పిలుపుల్లో వేలాది మంది అరెస్టు అయ్యారు. అనేక వందలమంది రబ్బర్ బుల్లెట్ల కాల్పుల్లో గాయపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలపై ప్రభుత్వం పాశవికంగా హింసను ప్రయోగించటాన్ని కవర్ చేస్తున్న జర్నలిస్టులపై కూడా పోలీసులు దాడిచేశారు.

ఫ్రాన్స్‌లో చెలరేగిన హింస ఉక్రెయిన్‌లో నాటో దళాలు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి యుద్ధం చేస్తున్నాయని చెబుతున్నది ఎంత అబద్ధమో చెబుతున్నది. పెన్షన్లలో కోతలు విధించగా మిగిల్చిన వందలాది కోట్ల యూరోలను సంపన్నులకు పన్నుల రాయితీ ఇవ్వటానికి, అదనంగా 90బిలియన్ యూరోలను సైనిక వ్యయం కోసం వెచ్చించటం జరుగుతోంది. ఏఏ వర్గాల ప్రయోజనాలకోసమైతే నాటో సామ్రాజ్యవాద దేశాలు రష్యాతో యుద్ధం చేస్తున్నాయో అవే వర్గ ప్రయోజనాలకోసం అత్యంత సంపన్నమైన సామ్రాజ్యవాద దేశాలలో కూడా హింసాయుత పాలనను సాగిస్తున్నాయి. అయితే మక్రాన్ ఎంతగా రాజ్యహింసను ప్రయోగించిన ప్పటికీ ప్రజా ఉద్యమాన్ని నియంత్రించ లేక పోయాడు. పెంచిన హింసతోపాటు ఉద్యమం కూడా బలోపేతమైంది.

ఒకవైపు నాటో దేశాల మద్దతుతో ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుంటే మరోవైపు నాటో దేశాలలో కార్మికుల ఉద్యమాలు ఉవ్వెత్తున్న లేస్తున్నాయి. ఏ ఆర్థిక, భౌగోళిక, సామాజిక వైరుధ్యాలు సామ్రాజ్యవాద పాలక వర్గాలను యుద్ధాలకు పురికొల్పుతున్నాయో అవే వైరుధ్యాలు కార్మికులను పోరాటాలకు కార్యోన్ముఖులను చేస్తున్నాయి. రాజ్యహింస పెరుగుతున్నాకొద్దీ రాజీలేని పోరాటాల అనివార్యతపట్ల కార్మికులకు అవగాహన పెరుగుతోంది. సాధారణ సమ్మెతో ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేయటానికి మూడింట రెండు వంతుల ఫ్రెంచ్ ప్రజల మద్దతు ఉందని ఈ విషయంపై చేసిన పోల్స్ తెలియజేస్తున్నాయి. అయితే ఇందుకు కార్మిక వర్గం తన సకల శక్తులను వినియోగించాలి.

ఫ్రాన్స్‌లో పెల్లుబికిన కార్మిక వర్గ నిరసనలు అంతర్జాతీయంగా పాలక వర్గాలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. పెన్షన్లలో కోతలు విధించటం చట్టంగా మారటంతో చెలరేగిన నిరసనోద్యమం, వేతనాలలో కోతలు, సామాజిక మితవ్యయ చర్యలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం జర్మనీ, బ్రిటన్‌తోసహా ఐరోపాలోని వివిధ దేశాలలో సమ్మెలకు దారి తీస్తున్నాయి. ఫ్రాన్స్‌లో జరుగుతున్న నిరసనోద్యమం పట్ల వివిధ దేశాలు మే డే రోజున తమ ఆందోళనను వెలిబుచ్చాయి. ఉక్రెయిన్లో రష్యాతో యుద్ధం కొనసాగటానికి తమ దేశాలలో కూడా వేతనాలలో కోతలను, సామాజిక మితవ్యయ చర్యలను విధించినప్పుడు ఫ్రాన్స్ లో వలే కార్మికులు నిరసన ఉద్యమాలకు దిగుతారేమోనని ఈ దేశాలు భయపడుతున్నాయి.

1968 మే నెలలో ఫ్రెంచ్ సాధారణ సమ్మె జరిగినప్పుడు అది అంతర్జాతీయంగా అనేక విప్లవోద్యమాలు చెలరేగటానికి దారితీసిందని పెట్టుబడిదారీ దేశాలలోని పాలక వర్గాలకు తెలుసు. ఐరోపాలో బ్రిటన్, పోర్చుగల్, గ్రీస్, స్పెయిన్ దేశాలలో ప్రభుత్వాలు పతనం అయ్యాయి. ఆ ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా ఒక తరం విద్యార్థులను, కార్మికులను రాడికలైజ్ చేసింది. 55సంవత్సరాల తరువాత, 1991లో సోవియట్ పతనం జరిగిన మూడు దశాబ్దాల తరువాత ప్రపంచమంతా వర్గ పోరాటాలు చెలరేగుతున్నాయి. ప్రపంచీకరింపబడిన పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిష్కారంలేని భౌగోళిక రాజకీయ, ఆర్థిక వైరుధ్యాలతో ఒక నూతన నాటో-రష్యా ప్రపంచ యుద్ధంలో కూరుకుపోతున్న పాలక వర్గాలు జనజీవితాలను మెరుగుపరచగల స్థితిలో లేవు. ప్రజలు తిరగబడుతుంటే ఈ పాలక వర్గాలు హింసను ఆశ్రయించక తప్పని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మరింత ప్రజాస్వామ్యం కోసం పోరాడక తప్పని అనివార్యత ప్రజల ముందు ఉంది. అలా జరగకపోతే జనజీవనం భరించలేనంతగా దిగజారుతుంది. ఇటువంటి నూతన వాస్తవంతో ప్రపంచం సంక్షుభితం అయివుంది.

తెలంగాణ సమాజాన్ని అద్దంలో చూపిన 'ఐదు తరాలు'

ఆ పుస్తకం ముందు తరాలకు స్ఫూర్తి

- మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'ఐదు తరాల పుస్తకం..తెలంగాణ సమాజాన్ని అద్దంలో చూపించింది. ఈ పుస్తకం ముందు తరాలకు స్ఫూర్తి' అని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపుకలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఐదు తరాలు' పుస్తకాన్ని నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషలో సహజత్వం రచయితకే సాధ్యమని అన్నారు. సాహిత్యం పరంగానే కాకుండా చరిత్రకు సంబంధించిన రెఫరెన్స్‌గానూ ఈ పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. పాతకాలంలో జరిగిన సంఘటనలను కండ్లకు కట్టినట్టు రచయిత వివరించారని తెలిపారు.

తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ 'ఈ పుస్తకం మా నాయిన పరకాయ ప్రవేశం చేసి రాసినట్టుగానే అనిపించింది. సహజత్వాన్ని గుర్తు చేస్తున్నది' అని అన్నారు. గతంలో తెలంగాణ భాష, యాస, మాండలికమంటేనే నవ్వుకునేవారనీ, నేడా పరిస్థితి లేదని చెప్పారు. జమీందార్ల కులంలో పుట్టి పేదవారి కోసం పనిచేయడంతోపాటు పేదలకు సంబంధించిన వెయ్యి కేసులను వాదించి గెలిపించిన ఘనత రచయిత మల్లారెడ్డికే దక్కుతుందన్నారు. సమసమాజం కోసం పోరాడి ప్రాణాలర్పించిన వ్యక్తి జార్జిరెడ్డి అని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు.

వేమన, బసవేశ్వరుడు లాంటి ఎంతో మంది సమాజం కోసం పనిచేశారని తెలిపారు. ఒక సిద్ధాంతం కోసం అడవిలో అన్నలు పోరాడుతుంటే ఓ పత్రిక కండోమ్ ల గురించి వార్త రాసి ఆ ఉద్యమాన్ని కించపర్చిందని, ఇది తగదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలు, దోపిడీలు, దౌర్జన్యాలను అడ్డుకోవడానికి పిడికిలెత్తాల్సిందేనని అన్నారు. తెలంగాణ రాకముందు కరెంట్ లేక పాముకాట్లతో, కరెంట్ షాకులతో, పోలీసుల కూంబింగ్‌లో అనేక మంది రైతులు మరణించారని తెలిపారు. కేసీఆర్ పాలనలో 24గంటల కరెంట్‌తో ఆ బాధల్లేవని గుర్తు చేశారు.తాగునీటి కోసం బిందెల కొట్లాటలేదని చెప్పారు. రాపోలు సుదర్శన మాట్లాడుతూ ఈ పుస్తకం సేవా పరిమళాలు వెదజల్లే గులాబీ..ఎర్ర గులాబీ అని అన్నారు. ఇది పక్కా చరిత్ర పుస్తకమేనని కొనియాడారు. అందులో మూలవాసుల కథ అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. రచయిత వేముల ప్రభాకర్ మాట్లాడుతూ అధికార పీఠంలో సాహిత్య ఏనుగు అని నరసింహారెడ్డిని ప్రశంసించారు. మల్లారెడ్డికి నక్సలైట్లు, పేదల లాయర్ అని పేరుందని గుర్తుచేశారు.

రచయిత అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ రూ.100కోట్ల విలువైన భూములను కాపాడిన ఘనత లాయర్ మల్లారెడ్డికే దక్కుతుందని అన్నారు. ఆయన చరిత్రను సినిమా రూపంలో తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

రచయిత గుడిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మ నవల తెలుగులో వచ్చింది కానీ, తెలంగాణ భాషలో కూడా వచ్చి ఉంటే బాగుండేదని అన్నారు.కవిత్వం, కవితలను సిలబస్‌లో చేర్చాలని కోరారు. పుస్తక రచయిత గులాబీల మల్లారెడ్డి మాట్లాడుతూ లాయర్‌గాను, సర్పంచ్‌గాను, రచయితగాను ప్రజలకు ఎంతో సేవా చేశానని అన్నారు. దోపిడీ, అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా ధిక్కారస్వరం వినిపించానని తెలిపారు. అప్పటి రెవెన్యూ శాఖ మంత్రి నేదుమల్లి జనార్ధన్‌రెడ్డితో మాట్లాడి రూ.100కోట్ల విలువైన భూములను పేదలకు ఇప్పించానని గుర్తుచేశారు.

అనంతరం పుస్తక రచయిత ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెహమన్, ఆవంచ ప్రమోద్, కూర చిదంబరం, రాజశేఖర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి భారతే నెం.1

- 'గీతం' కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ కన్వకేషన్‌లో.. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు
- యువత వల్లనే ఏదైనా సాధ్యం
- హైదరాబాద్‌ను త్రిబుల్ పీ ఫార్ములాతో అభివృద్ధి చేశా
- బాబు చేతుల మీదుగా పట్టాల ప్రదానం



నవతెలంగాణ-పటాన్‌చెరు

భారతదేశం 2047 నాటికి ఆర్థికంగా ప్రపంచంలోనే తొలి లేదా ద్వితీయ స్థానానికి చేరుకుంటుందని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తెలిపారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ.. తొలి పట్టాల ప్రదానోత్సవ వేడుకను ఆదివారం గీతం యూనివర్సిటీ హైదరాబాద్ ప్రాంగణంలోని శివాజీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రబాబు నాయుడు హాజరై మాట్లాడారు. ఏదైనా సాధించాలనుకుంటే, దానిని దృశ్యమానం (విజువలైజ్) చేసుకుని, ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ, దాన్ని స్పష్టంగా అమలు చేయాలని సూచించారు.

తన దృష్టిలో 2047 నాటికి కార్పొరేట్ గవర్నెన్స్‌లో భారతీయులు ఆధిపత్యం చెలాయిస్తారని, పబ్లిక్ గవర్నెన్స్‌లో కూడా ఆధిపత్యం వహించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం అమెరికా, ఐరోపాల్లో మధ్యతరగతి ఆదాయం ఎక్కువగా ఉన్నవారు ఉన్నారని, భవిష్యత్తులో అది భారత్ వైపు మళ్లుతుందన్నారు. ప్రస్తుతం 31 శాతంగా ఉన్న భారత మధ్య తరగతి 2030 నాటికి 60 శాతానికి పెరుగుతుందని అంచనా వేశారు. పబ్లిక్ పాలసీని రూపొందించడానికి ఇదో సదవకాశంగా యువతకు పిలుపునిచ్చారు. మన జనాభాకు సరైన విద్య, నైపుణ్యాలను ఇవ్వగలిగితే అద్భుతాలు చేయవచ్చన్నారు. యువత వల్లనే ఏదైనా సాధ్యమవుతుందని, కలలు కనాలి, వాటిని సాకారం చేసుకోవడానికి కష్టించాలని సూచించారు. తాను హైదరాబాద్‌ను త్రిబుల్ పీ ఫార్ములాతో అభివృద్ధి చేశానని, ఒక్క నయా పైసా వెచ్చించకుండా, ఎల్ అండ్ టీకి హైటెక్ సిటీ టవర్ నిర్మాణ బాధ్యతను కేవలం స్థలం ఇవ్వడం ద్వారా పబ్లిక్, ప్రయివేటు పార్టనర్‌షిప్ ఫార్ములాతో ప్రారంభించామన్నారు. ప్రస్తుతం తాను. ఫోర్ పీ ఫార్ములాను ప్రతిపాదిస్తున్నానని, ప్రజలు, ప్రభుత్వం, ప్రయివేటు పార్టనర్‌షిప్‌తో పేద-ధనికుల మధ్య అంతరాన్ని కూడా నిర్మూలించవచ్చని ధీమా వెలిబుచ్చారు. అప్పటి అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్ కాదన్నా జీనోమ్ వ్యాలీని 1500 ఎకరాల్లో శ్రీకారం చుట్టామని, ప్రస్తుతం కరోనా వ్యాక్సిన్ అక్కడే ఉత్పత్తి అయిందన్నారు. అనంతరం గీతం అధ్యక్షులు ఎం.శ్రీ భరత్ తన అధ్యక్షోపన్యాసంలో పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథి చంద్రబాబును సత్కరించారు.

కాగా, 43 మంది కేఎస్పీపీ విద్యార్థులకు పీజీ డిగ్రీ పట్టాలను అందించారు. కేఎస్పీపీ విద్యార్థి ప్రీతీష్ ఆనంద్‌కు బంగారు పతకాన్ని చంద్రబాబు బహూకరించారు. కేఎస్పీపీ విద్యార్థి సంయోగిత దిలీప్ సత్పుటే నేతృత్వంలో, గీతం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ముఖ్య అతిథి నుంచి పట్టాను అందుకున్న వారి పేర్లను గీతం అకడమిక్స్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ ఇ.వరియార్ ప్రకటించారు. కాగా, గీతం రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్ అధికారిక ధ్రువీకరణలపై కులపతి సంతకం తీసుకున్నారు. తమ పిల్లలను వత్తినిపుణులుగా తీర్చిదిద్దినందుకు తల్లిదండ్రులు కౌటిల్యా అధ్యాపక బృందానికి కతజ్ఞతలు తెలియజేశారు. కేఎస్పీపీ విద్యార్థి వసీం అహ్మద్ విద్యార్థులందరి తరఫున తన స్పందనను తెలుపగా, కౌటిల్యా డీన్ సయ్యద్ అక్బరుద్దీన్ అమూల్య సందేశాన్ని ఇచ్చారు. చివరగా, కౌటిల్యా సహ వ్యవస్థాపకులు ప్రతీక్ కున్వల్ వందన సమర్పణ చేశారు.

తల్లిని మించిన యోధులెవ్వరూ లేరు : మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచంలో తల్లిని మించిన యోధులు మరెవ్వరూ లేరని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదివారం ట్విట్టర్ వేదికగా తెలిపారు. అలాంటి తల్లిని సంరక్షించుకునేందుకు తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. బిడ్డ కడుపులో పడగానే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ , బిడ్డ పుట్టగానే కేసీఆర్ కిట్ , బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ఆరోగ్య లక్ష్మి , ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి సత్వర చికిత్స అందించేందుకు ఆరోగ్య మహిళ , వ్యాధి నిరోధకత పెంచేలా 100 శాతం ఇమ్యునైజేషన్, ఇంటి నుంచి ఆస్పత్రికి, ఆస్పత్రి నుంచి ఇంటికి ఉచిత ప్రయాణ సేవల కోసం అమ్మ ఒడి వాహనాలు, రాష్ట్ర వ్యాప్తంగా 28 మాతా శిశు సంరక్షణ కేంద్రాలు.. ఇలా అనేక ఏర్పాట్లతో తల్లులను సంరంక్షించుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. తద్వారా మాతృమరణాలను తగ్గించటంలో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఇది తల్లులు, ఆడ బిడ్డల సంరక్షణ పట్ల కేసీఆర్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. మాత మూర్తులందరికీ ప్రపంచ తల్లుల దినోత్సవం సందర్భంగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ఎంసెట్ రాతపరీక్షలు

- 94.11 శాతం అభ్యర్థుల హాజరు
- నేడు ఇంజినీరింగ్ విభాగం ప్రాథమిక కీ విడుదల
- 17 వరకు అభ్యంతరాల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంసెట్ రాతపరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈనెల 10 నుంచి ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎంసెట్ రాతపరీక్షలు ముగియడంతో ఉన్నత విద్యామండలి, ఎంసెట్ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఇటీవల కాలంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ, పదోతరగతి పత్రాలు పరీక్షా కేంద్రాల నుంచి బయటికి రావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే ఆ ప్రభావం ఎంసెట్‌పైనా ఉంటుందని అందరూ భావించారు. కానీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు ముగియడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంసెట్‌కు 3,20,683 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వారిలో 3,01,789 (94.11 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 18,894 మంది గైర్హాజరయ్యారని వివరించారు. తెలంగాణ నుంచి 2,48,479 మంది దరఖాస్తు చేస్తే, 2,35,918 (94.94 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 12,561 మంది హాజరు కాలేదని తెలిపారు. ఏపీ నుంచి 72,204 మంది దరఖాస్తు చేయగా, 65,871 (91.23 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 6,333 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ పరీక్షల్లో ముగ్గురు అభ్యర్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. మొదటి రోజు నుంచి చివరి వరకు ఈ పరీక్షలు జరుగుతున్న తీరును ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి పర్యవేక్షించారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు తేదీల్లో నిర్వహించామని డీన్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎనిమిది గంటలకు ప్రాథమిక కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు. ప్రాథమిక కీపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 17వ తేదీ సాయంత్రం ఎనిమిది గంటల వరకు సమర్పించొచ్చని కోరారు. ఎంసెట్ వెబ్‌సైట్ ద్వారానే అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర పద్ధతుల్లో స్వీకరించబోమని స్పష్టం చేశారు.

ఈ సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలి

- బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు ఎస్టీటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయు ల బదిలీలు, పదోన్నతులను నిర్వహించాలని ఎస్టీటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ షెడ్యూల్‌లోనే పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీసు పర్సన్లను నియమించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలకు షూ, టై, స్కూల్ బ్యాగ్ ఉచితంగా ప్రభుత్వం అందించాలని కోరారు. కోర్టు తీర్పుతో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇస్తామని, సర్వీస్ పర్సన్లను నియమించడానికి కృషి చేస్తామని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి పిల్లలకు పుస్తకాలు, వర్క్ బుక్‌లతోపాటు షూ, బెల్టు, టై, స్కూల్ బ్యాగ్ ఉచితంగా ప్రభుత్వం అందించేలా కృషి చేస్తానన్నారని పేర్కొన్నారు.

కోటిన్నరకు చేరువలో కంటి వెలుగు పరీక్షలు

- 21 లక్షల మందికి రీడింగ్ అద్దాల పంపిణీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా కంటి పరీక్షలు విజయవంతంగా కొనసాగుతు న్నాయి. 74 పని దినాల్లోమొత్తం కోటిన్నరకు చేరువకు మందికి పరీక్షలు చేశారు. ఇప్పటికే 21 లక్షల మందికి రీడింగ్ అద్దాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. 'అంధత్వ రహిత' తెలంగాణ లక్ష్యం నినాదంతో ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 10, 285 గ్రామ పంచాయతీ వార్డుల్లో, 3221 మున్సిపల్ వార్డుల్లో కంటి పరీక్షలు పూర్తి చేశారు. దృష్టి లోపాలు సవరించేందుకు 2018, ఆగస్టు 15న సీఎం కేసీఆర్ మెదక్ జిల్లా మల్కాపూర్‌లో తొలివిడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించినసంగతి తెలిసిందే. ఈ క్రమంలో అప్పటి నుంచి ఇప్పటివరకు 50 లక్షల మందికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. అదే స్ఫూర్తితో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గత జనవరి 18 న ఖమ్మంలో ప్రారంభించారు. అనుకున్న లక్ష్యంమేరకు విజయవంతంగా కొనసాగుతున్నది. లక్ష్యంగా నిర్దేశించుకున్న 100 పనిదినాల్లో రాష్ట్రంలో అందరికి పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పరీక్షల సమయంలో ఇతర వైద్య సేవలకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర శాఖలతోసహా, అందరు ప్రజాప్రతినిధులు ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. పర్యవేక్షణకుగానూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్వాలిటీ కంట్రోల్ బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం మానిటరింగ్ చేస్తున్నది. ఇదే విధంగా కంటివెలుగు విజయవంతంగా కొనసాగితే రెండు కోట్ల మందికి కంటివెలుగు పరీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నదనే అభిప్రాయాన్ని వైద్యాధికారులు వ్యక్తం చేశారు.

వేసవి సెలవుల్లోనే పదోన్నతులు పూర్తి చేయాలి

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

- జులై 1 నుంచి నూతన వేతన సవరణ అమలు జరగాలి : యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పదోన్నతులు నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. విద్యారంగంలో నెలకొన్న పరిస్థితులను సమావేశం సమీక్షించింది. అనంతరం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, వై అశోక్ కుమార్, ఎం రవీందర్, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, కొమ్ము రమేష్, ఎస్ యాదగిరి, జాడి రాజన్న, మేడి చరణ్‌దాస్, కె భిక్షపతి, తులసీరాం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల బదిలీల జీవోపై హైకోర్టులో స్టే కొనసాగుతున్నందున మొత్తం ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం అస్తవ్యస్తంగా నడుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పదోన్నతులు, నియామకాల ద్వారానే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కనుక బదిలీలపై హైకోర్టు తీర్పు వచ్చేలోగా తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని కోరారు. తద్వారా ఏర్పడిన ఖాళీల్లో నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని గుర్తు చేశారు. సీపీఎస్ రద్దు వాగ్దానం చేసి హిమాచల్ ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు విధానాలను వ్యతిరేకిస్తూ పోరాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలోనూ సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు ప్రతినెలా మొదటి తేదీన వేతనాలివ్వాలని సూచించారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది ఏడాదిగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని కోరారు. జులై ఒకటో తేదీ నుంచి నూతన వేతన సవరణ అమలు జరిగేలా తెలంగాణ రెండో పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పై సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి ఐక్యంగా ఉద్యమిస్తే సానుకూల ఫలితాలు వచ్చే అవకాశముంటుందని, అందుకు యూఎస్‌పీసీగా అన్ని సంఘాలతో చర్చించటానికి చొరవ తీసుకోవాలని సమావేశం తీర్మానించిందని పేర్కొన్నారు.

హరిత విప్లవ స్ఫూర్తిదాత అంబేద్కర్

16న సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభ : ఎంపీ జె.సంతోశ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హరిత విప్లవ స్ఫూర్తిదాత అని రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ చైర్మెన్ జోగినపల్లి సంతోశ్‌కుమార్ కొనియాడారు. ఆయన న్యాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తనను కలవాలంటే ఒక మొక్క నాటి రావాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఆయన ఆలోచనల మేరకు అందరూ మొక్కలు నాటి సంరక్షించాలనీ, హరిత భారతావనికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహం నెలకొల్పటం, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టిన సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభను ప్రజా, ఉద్యోగ, కుల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో దానికి సంబంధించిన పోస్టర్‌ను సంతోశ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ రాజీవ్ సాగర్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవేంద్ర యాదవ్, ప్రజాసంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జలకాంతం, ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు, డీఎస్‌టీ ఎమ్‌బీసీ, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోల శ్రీనివాస్ , టీపీయూఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు గంగాధర్ , వడ్డెర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ఐటీ వింగ్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్ గుప్తా, ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వేముల భాస్కర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మోహన్ నాయక్, ఓయూజేఏసీ నాయకులు డాక్టర్ సంజీవ్ నాయక్, శివకుమార్, నిపున్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణాయే ప్రభుత్వ లక్ష్యం

'తానా' కార్యాలయ ప్రారంభోత్సవంలో బోయిన పల్లి బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హెూమ్స్ అసోసియేషన్ (తానా) నూతన కార్యాలయాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్ కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవన సముదాయంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఈ సందర్భంగా బోయినపల్లి వైద్యులకు, ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. తద్వారా ఆరోగ్య తెలంగాణ కోసం వైద్యులు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య తెలంగాణాయే ప్రభుత్వ లక్ష్యమనీ, అందు కోసం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వైద్యారోగ్యం, విద్యా అనేది ప్రభుత్వ ప్రాధాన్యతలని చెప్పారు. ఆ దిశలోనే ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీ రాకేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వీ. ప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ సీ.హెచ్. జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో వినోద్ కుమార్ ను ఘనంగా సన్మానించారు.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం

18న టీడబ్ల్యూజేఎఫ్ మహాధర్నా

- కరపత్రం ఆవిష్కరణ
- బారీగా తరలిరండి : జర్నలిస్టులకు ఫెడరేషన్ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం ఈనెల 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలం గాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఆది వారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నాకు సంబంధించిన కర పత్రాన్ని ఫెడరేషన్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు గుడిగ రఘు, జి. విజయానంద్, జి.మాణిక్‌ప్రభు, హెచ్‌యూజే కార్యదర్శి బి. జగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బివిన్ పద్మరాజు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి కల్యాణ్ చక్రవర్తి, నాయకులు రేణయ్య ఆవిష్కరించారు. గత 35 ఏండ్లుగా ఇండ్ల స్థలాల కోసం పాత్రికేయులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం కాలయాపన చేస్తోందే తప్ప నేటి వరకు ఇండ్ల స్థలాలు కేటా యించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 వేల పైచిలుకు జర్నలిస్టులు ఉన్నారని గుర్తు చేశారు. మహా నగరంలో నాలుగువేల నుంచి ఐదువేల మందికి ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీలలో ఉన్న వారితోపాటు ఏ సొసైటీలోనూ సభ్యత్వం లేని వారికి సైతం ఇండ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలతోపాటు పాత్రికేయుల సమస్యలన్నింటిని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లేందుకే ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాత్రికేయులంతా వందలాదిగా ధర్నాలో పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏ'కాకి'..

ఎంతకాలం నుండి ఆ కాకి
మా యాప చెట్టు మీద గూడు
కట్టుకుని ఉందో తెలియదు కానీ
ఊహ తెలిసినప్పటి నుండీ
దాని వయసు మారనేలేదు

సరిగ్గా.. బువ్వేళప్పుడు..
పదేపదే అది అరిచే అరుపుకి
వార్చిన బువ్వకుండ మీది సిబ్బి తీసి
అమ్మ జాలాట్ల వేయగానే
దుసేరితీగల చిక్కుకున్న మెతుకుల్ని ఆత్రంగా..
ముక్కుతో ముత్యాల్లాగ ఏరుకునేది

అది అరచినప్పుడల్లా..
తోడబుట్టినోడు వస్తే బాగుండని
గలుమకు చూపుల తోరణం గట్టి
ఆశల గంపెత్తుకొని బాయి తొవ్వల
భారంగా కదిలేది అమ్మ

పొద్దస్తమానం ఇంటిని సైనికుడి
లెక్క కాపుగాసే ఆ కాకి
పండుగకో పబ్బానికో
సుట్టాలొచ్చినప్పుడో
మాకంటే ముందే నీసు కూర
భోజనం చేసి ఇంటి మూడుసుట్లూ
అద్దం లెక్కజెక్కేది

కుళ్ళును తుడిచి లోకాన్ని
శుభ్రంజేయ ఏ కల్మషం లేకుండా
తన జాతినంతటినీ
ఏకం చేసే ఆ కాకి..
మనసుల నిండా కుళ్ళు నింపుకొని
సాటివారిపట్ల అసహనం వెళ్లగక్కే
నేటి మానవజాతికి
పాఠంజెప్పే గురువేమో..

కాకికి వెయ్యేళ్ళ ఆయుష్షు అని
నాయనమ్మ అంటుంటే..
తరాల వంశ వృక్షానికి నీళ్ళు పోస్తూ
మా బతుకు కథలకు పేజీలు కుట్టేది
ఈ కాకే కదా అని సిత్రపోయేది

దాని గూడుగూలి
ఏ గూటికి దూలమయ్యిందో కాని
దిక్కులేని పక్షైన ఆ కాకి
ఇప్పుడేదిక్కునుందో..ఏకాకిలా..

మొదటి ముద్ద పిసికి
పిట్టగోడ మీద పెట్టిన ప్రతిసారి
గుండెందుకో..
ఆకాశానికి ఆశల దండెంగడ్తది
అప్పుడనంగా వెళ్ళినకాకి
నాన్న రూపంలోనైనా
నన్ను జూస్తందుకొస్తదేమోననీ..

- తుల శ్రీనివాస్, 99485 25853

నేషనల్ హైవే!



గ్రామాల్ని, నగరాల్ని
రాష్ట్రాల్ని, రాజధానుల్ని
సామాన్యుల్ని, రాజుల్ని
సంస్కృతీ సంప్రదాయాలను
సమస్త అందాలను పూలమాలగా
ముడివేస్తుంది జాతీయ
రహదారి!
ఏదైతేనేం నీ గమ్యం
జాతీయరహదారుల గుండా
ప్రయాణం ఎంతో రసరమ్యం
జాతీయ రహదారి గుండా
పాములనడకలా ఎన్నెన్ని మలుపులో
మనిషిమనిషిలో అన్ని పులకరింతలు...
ఎన్ని నదులు, ఎన్ని వారధులో...
ఎదల్లో అన్ని స్పందనా తరగల జలధులు
చినుకు మురళికి చిగురించిన ఎన్ని కోనలు కొండలో
వాటిపై దోబూచులాడే దోర ఎండలో
వేనవేల రాగాల ఎన్ని పూల వసంత ఋతువులో....
ఎన్నెన్నీ సజీవ సుందం శిల్పాలో....
అలా కథలు కథలుగా కళ్లముందర కదలాడుతుంటాయ్
భూముల్ని, భుక్తిని కోల్పోయిన అభాగ్యుల
అణగారిన జన వారసులుగా
శప్తమయ నిరుపేదజీవుల
ఎన్ని కన్నీటికావ్యాలో....
నువ్వు కనగలిగితే జాతీయ రహదారి గుండాను
ఎన్ని మైలు రాళ్ళు
ఎన్ని మైమరపించే ఎద పరవళ్ళో...
ఆద్యంతమూ ఆనందమూ, అద్భుతమూ...

జాతీయ రహదారి !
జడమౌన రాయబారి
చరితల, నవనాగరికతల గానమే కాదు
పొరుగు రాష్ట్ర ప్రజలను అనుసంధానమే కాదు
గృహస్థవాసికి సంచారిగా మార్గం సుగమం చేస్తుంది
విసిగిన మనిషికి చిన్న తెరిపినిచ్చి బతికిస్తుంటుంది
విరిగిన మనసుని వీసమంత ఆశజిగురు పూసి అతికిస్తుంటుంది
లీటర్ల, కిలోమీటర్ల గుణకార భాగహారాలు
తలకెక్కి తైతక్కమాడితే
నీ ప్రాంతానికే కదా అంకితం ఆశల నీ శేషజీవితం
అది కాదన్ననాడే ఇక ఆరంభం
అసలైన జీవన సంరంభం
మజిలీ పట్ల ముత్యమంత అనురాగం
లవమైన బ్రతుక్కీ కించిత్ వేగం
మనసుకు 'పారవశ్య' మైలేజీనిస్తాయి
జాతీయరహదారి గుండా నీ ప్రస్థానం మొదలైదంటే
అల నీ ఆనందలోక ద్వారాలు తెరుచుకన్నట్టు
ఇంత జ్ఞానానికి, ఇంత ఆనందానికి నువు దోసిలొగ్గినట్టు.

- రమేశ్ నల్లగొండ, 8309452179

తెలంగాణ బాలల కథ - పరిశీలన

- డా॥ బి.వి.ఎన్. స్వామి, 9247817732

అస్తిత్వ ఉద్యమాల వల్ల వివక్షకు గురయిన శ్రేణుల నుండి రచయితలు పుట్టుకొచ్చారు. ఆ ఫలిత ప్రభావమా అన్నట్లు బాల రచయితలు ఉద్భవించారు. ఇందుకు సాక్ష్యంగా తెలంగాణలో వస్తున్న పిల్లలు రాసిన కథా సంపుటాలు నిలుస్తాయి. అయినను పిల్లల కోసం రాయాల్సి బాధ్యత పెద్దలకు ఉంది. జీవితానుభవం, రాయగలిగిన నేర్పు, నిబద్ధత కలిగిన రచయితలు ఉన్నారు. సాంకేతిక విప్లవం పరోక్షంగా విలువల క్షీణతకు గురిపెట్టింది. అందుకు బాలలు ఉపకరణాలయ్యారు. చేతిలోని సెల్‌ఫోన్ స్వర్గాలను చూపెట్టడం వల్ల పిల్లలు చెడు అలవాట్లకు గురి అవుతున్నారు. అక్షరం కోసం చరవాణిని ఆశ్రయిస్తే హాని ఎక్కువగానే జరిగింది. సమాజ వీధుల్లో విచ్చలవిడిగా ప్రవహిస్తున్న ఈజీమనీ వల్ల అనేక పెడధోరణులు బాలలకు అబ్బినవి. మానవీయ విలువ స్థానంలో మార్కెట్ విలువ తిష్టవేసింది. ఈ పరిణామం చాపకింది నీరులా వ్యాపించింది. దాని వల్ల తప్పుడు విలువలు సమాజంలో సాధరణమయ్యాయి. ఇదంతా ఎదుగుతున్న బాలలపై ప్రభావం చూపింది. వారు ఎండమావులనే నీటి చెలిమెలుగా పొరపడుతున్నారు. ఆ పొరపాటును సరిదిద్దాలి. అది బాధ్యత గల పెద్దల పని.


బిడ్డలకు శిక్షణ నివ్వాల్సిన కుటుంబం, విద్యావ్యవస్థ రెండూ కుంటి గుర్రాలయ్యాయి. చైల్డ్ సెంటర్డ్ ఎడ్యుకేషన్ సిస్టమ్ మరియు విద్యాహక్కు చట్టం ఉపాధ్యాయుల పాత్రను నామమాత్రం చేసాయి. ఆన్‌లైన్ చదువులు పాఠశాల ఉనికికి ఎసరుపెట్టాయి. కుటుంబ నియంత్రణ ఇంట్లోని పిల్లలకు ఎనలేని ప్రాధాన్యతనిచ్చింది. పిల్లల గొంతెమ్మ కోర్కెలను తీర్చడానికి తల్లిదండ్రులు తయారయ్యారు. ఈ దారులన్నీ పిల్లల్ని త్రిశంకు స్వర్గంలో దింపాయి. ఇప్పుడా బాలల్ని భూమార్గం పట్టించాల్సిన బాధ్యత పెద్దలది. సాహిత్య రంగానికొస్తే రచయితలది. ఆ మేరకు కొందరుపెద్దలు ముందుకొచ్చారు. తమ తమ ఆలోచనల ప్రకారం కథల్ని వండి వడ్డించారు. పెద్దల కథలు రాయడానికి కావలసిన సమర్థత కంటే రెట్టింపు శక్తి పిల్లల కథలు రాయడానికి కావాలి. చూసింది చూసినట్లు, తెలిసింది తెలిసినట్లు, విన్నది విన్నట్లు, చదివింది చదివినట్లు రాస్తే పెద్దలకు సరిపోతుంది. అలారాస్తే పిల్లలు పట్టించుకోరు. చేదు వాస్తవాలకు తీపి పూతలు పూసి అందిస్తేగాని పిల్లలు అందుకోరు. అందుకు ఓపిక, శ్రద్ధ మరింత కావాలి. కనుకనే పిల్లల కథలు రాయడం కష్టం.

ఊహాలోకాలు, మాయా ప్రపంచాలు, కీలుగుర్రాలు, మాంత్రికశక్తులు, సాహసకృత్యాలు, క్రూరమృగాలు, సాధుజంతువులు, బాలల్ని అమితంగా ఆకర్షిస్తాయి. వాటిద్వారా చెప్పిన కథలు బాలల్ని మెప్పించాయి. పంచతంత్రం, సింద్‌బాద్ సాహసయాత్రలు ఆ కోవలోనివే. సంస్కృత, ఆంగ్ల సాహిత్యాలు ఈ ఒరవడిని మనకు అందించాయి. ఈ విధానం ఇప్పటికీ ఆచరణీయమే. పశు పక్ష్యాదులు, నదీనదాలు మట్లాడుతున్నట్లు, ప్రకృతి శక్తులతో మనిషి పోట్లాడుతున్నట్లు చిత్రించిన కథలు పిల్లల్ని సంభ్రమాశ్చర్యాలతో ముంచుతాయి. అదే సమయంలో మనం చెప్పదలచిన విషయం అందించాలి. ఆధునిక సాంకేతికత అందించిన పరికరం రోబో. అన్ని పనులు చేయించినట్లే రోబోతో కథలు కూడా చెప్పించాలి. రోబో సాయంతో అంతరిక్ష యానం చేయించి సైన్సును అర్థం చేయించాలి. ఆ విధంగా పిల్లలకు శాస్త్రీయ దృష్టిని అలవర్చాలి. సాంకేతికంగా శిఖరాల్ని అందుకుంటున్న సమాజం, నైతికంగా పాతాళం వైపు పయనిస్తుంది. ఈ క్రమం మానవ జీవనాన్ని సంక్షుభితం చేస్తుంది. ఈ సంక్షోభం నుండి పిల్లల్ని రక్షించే శక్తి బాలసాహిత్యానికి ఉంది. కథ అందుకు దోహదపడుతుంది. విలువల నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం కథల వల్ల సాధ్యపడుతుంది. మొక్కల పెంపకం, పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం, సహాయం, త్యాగం, స్నేహం, తల్లిప్రేమ, జంతుప్రేమ, నిజాయితి, మానవత్వం, దేశభక్తి, సమయస్ఫూర్తి, పెంపకం, పరోపకారం, ప్రేమ, అభిమానం, కోపం, ఆత్మీయత, ధైర్యం, పిరికితనం, మొండితనం, దురాశ, స్వార్థం, సాహసం లాంటి లక్షణాల మేలు, కీడులను కథల ద్వారా అందించవచ్చు. శాస్త్రీయ దృష్టి, మార్పుకోసం ప్రయత్నం, ఇంజనీరింగ్ నైపుణ్యాల గురించికథల ద్వారా అవగాహన కల్పించవచ్చు. వీటిని నేర్పుటకు మనుష్య పాత్రలకు బదులు జంతువులను పాత్రలుగా చేసి చెప్పించాలి. దాంతో పిల్లలు నేర్చుకునే అవకాశం ఉంది.

బాలలు పాఠ్యపుస్తకాలు చదవక తప్పదు. కొంతమంది అవి చదవడానికి ఆసక్తి చూపరు. పాఠ్యప్రణాళికలోని అంశాలకు అనుగుణంగా కథలురాస్తే ఉభయతారకంగా ఉంటుంది. వారికి అవసరమైన స్తన్యం వాటి ద్వారా అందుతుంది. ఎదుగుతున్న పిల్లలకు వయసుల వారీగా చెప్పాల్సిన విషయాలను కరికులం (పాఠ్యప్రణాళిక)లో పొందుపరుస్తారు. అట్టి విషయాలను నేర్పడానికి కథలు ఉపకరిస్తాయి. వీటిని కరికులం కథలు అనవచ్చు. ఆ ధోరణిలో కథలు రాసిన రచయిత పుల్లూరి జగదీశ్వర రావు. ఇతని "లిటిల్స్", "చిలుక సాయం" అనే కథాసంపుటాల్లో ఈ ధోరణి కనపడుతుంది. ఇతడు తన కథలను ఆంగ్లంలోకి అనువదించి "బైలింగ్వల్" కథలుగా అందించారు. ఇలా అందించిన వారు అరుదు.

సమాజంలో జరుగుతున్న ఉద్యమాలు, మార్పులు రచయితను ప్రభావితం చేస్తాయి. అవి రచనలలో కనిపిస్తాయి. బాలల కథ అందుకు మినహాయింపు కాదు. గ్రాంథిక భాష, ప్రామాణిక భాష, వాడుక భాష, మాండలిక భాష లాంటి భావనలు రచయితల మధ్య చర్చలను రేపాయి. పిల్లలు వినడం, మాట్లాడటం అనే రెండు నైపుణ్యాలను బడి బయట నేర్చుకుంటారు. దీనివల్ల వారికి భాష ఒంటబడుతుంది. అలా పట్టుబడిన భాష మాండలిక భాష, ఇంట్లో నేర్చుకున్న భాషను సంస్కరించి, చక్కదిద్ది బడిలో నేర్పేభాష ప్రామాణిక భాష, ఈ రెండు భాషల మధ్య తేడా స్పష్టంగా ఉంటుంది. మాతృభాషలో అభ్యసన తొందరగా జరుగుతుంది. కనుక మాండలిక భాషలో కథలు రాస్తే పిల్లలకు విషయం అర్థమవుతుందనేది నిజం. ఆ దిశగా ఆలోచించి కథలు రాసి మెప్పించిన వాడు పెండెం జగదీశ్వర్. "గజ్జెల దయ్యం", "పసిడిమొగ్గలు", "ఉపాయం", "తాను తీసిన గోతిలో" వంటి కథా సంపుటాలు అనేకం వెలువరించాడు.





పిల్లల కథలు రాసే పెద్దలు తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా ఉన్నవి. అందించే విషయంపై స్పష్టత ఉండాలి. అందించాల్సిన పద్ధతిపై అవగాహన ఉండాలి. చెప్పాల్సిన విషయం కథలో ఒదుగుతుందో లేదో తెలిసి ఉండాలి. పిల్లలకు ఆసక్తి కలిగేలా రాయాలి. సులభంగా అర్థం కావడానికి సరళపదాలు వాడాలి. చిన్న చిన్న వాక్యాల ద్వారా విషయం చేరవేయాలి. పదాడంబరం పనికిరాదు. సంక్లిష్ట వాక్యం వాడకూడదు. గూఢార్థం కలిగిన పదాల కన్నా, అలతి అలతి పదాలు వాడటం మేలు.

పిల్లల కథలు రాసే పెద్దలు తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా ఉన్నవి. అందించే విషయంపై స్పష్టత ఉండాలి. అందించాల్సిన పద్ధతిపై అవగాహన ఉండాలి. చెప్పాల్సిన విషయం కథలో ఒదుగుతుందో లేదో తెలిసి ఉండాలి. పిల్లలకు ఆసక్తి కలిగేలా రాయాలి. సులభంగా అర్థం కావడానికి సరళపదాలు వాడాలి. చిన్న చిన్న వాక్యాల ద్వారా విషయం చేరవేయాలి. పదాడంబరం పనికిరాదు. సంక్లిష్ట వాక్యం వాడకూడదు. గూఢార్థం కలిగిన పదాల కన్నా, అలతి అలతి పదాలు వాడటం మేలు. వయసు పెరుగుతున్నా కొద్దీ పదాలు, వాక్యాలు, అర్థాలు, భావనల స్థాయి పెంచుకుంటూ పోవడం ఉత్తమం. చిన్న వయసులో రెండు వాక్యాలలో చెప్పిన కథను వయసు పెరుగుతున్నా కొద్దీ పేజీలకు విస్తరింపజేయాలి. దీనివల్ల బాలలకు అక్షర, పద, వాక్య, భావ సంపద పెరుగుతుంది. పిల్లలకు ఊహాశక్తి ఎక్కువ. నేల విడిచి సాము చేయగలరు. పిల్లల్ని కథ ఊహల్లో విహరింపజేయాలి. అద్భుత, సాహస, జానపద కథలు ఊహకు అగ్రపీఠం వేస్తాయి. కనుకనే పిల్లలు ఈ కథలను ఇష్టపడుతారు. ఇలాంటి కథలు రాయడం పెద్దలకు అగ్నిపరీక్షలాంటిది. అందుకే బాలల కథ రాయడం బహుకష్టం. అలాంటి కష్టాన్ని ఇష్టంగా చేసుకొని కథలు రాసిన పెద్దలు తెలంగాణలో చాలా మంది ఉన్నారు. రాసిన కథల్ని బాధ్యత వహించి పుస్తక రూపంలో తెచ్చే మణికొండ వేదకుమార్ లాంటి ప్రచురణ కర్తలున్నారు. బాల సాహిత్యాన్ని నెత్తికెత్తుకొని పనిచేసే గరిపల్లి అశోక్ లాంటి కార్యకర్తలున్నారు. బాల సాహిత్యం కోసమే కలం పట్టిన డా॥ పత్తిపాక మోహన్, జీవితాంతం బాలసాహిత్యం రాస్తూ, పత్రిక, శీర్షికలు నిర్వహిస్తున్న తిరునగరి వేదాంతసూరి లాంటి చాలా మంది ప్రముఖులు తెలంగాణలో ఉన్నారు.

వసుంధర, రాజగోపాలరావులు మొదలుకొని నేడు కలం పట్టిన బాలలకథారచయితల వరకు అందరు కథను బాలల వికాసం కొరకు ఉపయోగించారు. పిల్లల క్షేమం కోసం వారు పడిన తపన కథల్లో కనిపిస్తుంది. తెలంగాణలో పిల్లల కథలు రాస్తూ వివిధ అంశాలను వారి కోసం విశదపరుస్తున్న రచయితలను మరో వ్యాసంలో వివరిస్తాను.

రాజ్యమేలే రహస్యం

- తంగిరాల సోని, 9676609234

కవి తను చెప్పాలనుకున్న విషయాన్ని స్పష్టంగా సూటిగా చెప్పాలంటే ఆ కవి లోలోపల ఎంత మదనపడి మండితే అంత కవిత్వం బయటకు వస్తోంది. అందులో ఒక విషయాన్ని సెటైరికల్‌గా చెప్పడంలో ఎంతో పరిణితి అవసరం. తెలుగు కవిత్వంలో సెటైరికల్ కవి అనగానే మనకు గుర్తు వచ్చే పేరు 'మహా కవి పెడి తెరేష్ బాబు'. ఆ వరసలో ఇప్పుడు పదునైన సెటైర్స్ వేస్తూ కవిత్వాన్ని పరుగులెట్టిస్తున్నాడు 'కవి నేలపూరి రత్నాజీ' "ఒకే గొంతు", "నెత్తుటి మరకలు" కవితా సంపుటి ద్వారా కవితా లోకానికి సుప్రసిద్ధుడు సోషల్ మీడియాలో తనదైన శైలిలో అప్పటికప్పుడు కవిత్వం రాయడంలో దిట్ట. ఇప్పుడు తను 'రాజ్యమేలే తాళం చెవి' కవితా సంపుటిని సాహిత్య ప్రపంచంలోకి వదిలారు.

మొత్తం 35 కవితలు వున్నాయి. ఒక్కొక్క కవిత ఒక్కో ఆలోచన బహుజన సమాజానికి అందిస్తుంది. క్కో డైనమేట్ పేల్చాడు రాజ్యాంపై అని చెప్పడంలో సందేహం లేదు.

ఇందులో మొదటి కవిత 'కత్తిడాల్'


కత్తి డాల్ సిద్ధంగా వున్నాయ్ / ఒక విజేత మరణాన్ని కీర్తిస్తూ / విద్రోహపు తలలను ఖండించి / విజయ హాసంతో మీ వైపుకు చూస్తూ / సిద్ధ పడులే...../ .... /మాల - మాదిగ / చాకలి -మంగలి / గౌడ - శాలి / దక్కలి - రెల్లి / ఎరుకల -యానాది అనేకమంత... / కత్తిడాల్ సిద్ధంగా వున్నాయ్ / విజయహాసంతో మీ వైపుకు చూస్తున్నాయ్ !

అంటూ బహుజన మహనీయుల అడుగుజాడల్లో, బహుజన కులాలు చైతన్యమై, బహుజన పోరాట స్ఫూర్తిని నింపుకుని, బహుజన రాజ్యం కోసం, బహుజనులంతా కలిసి బహుజన రాజ్యం చేపట్టాలని అందుకు మహనీయుల ఆదర్శంగా కదలాలని కవిత ద్వారా తెలియజేసారు.

'బోధించు' కవితలో... **నడిచొచ్చింది పట్టపుటేనుగు/ అంబారీపైకెగిరి కూర్చోరా తమ్ముడా / ఆలస్యం అలసత్వం అసలు చేయకు / నీలి రెప్పలా నీడలో / బహుజన కులాల కలయిక / అన్వయం కుదిరిందా ....75 ఏళ్లుగా నమ్ముకున్న దేశం మనకేమిచ్చింది/ హరిజనులనే అపకీర్తి తప్ప !..... ....ఓటు దుడ్డు కర్ర పుచ్చుకో / పైనా ఏటారం గాళ్ళను చావ చితకదన్ని..... ఓటున్న.... నారన్నా... కోటి రూకల మాట చెబుతా విను / మన నీలి రాజ్యాన్నే కలలు కను...**

అంటూ కవితలో భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చిందీ కానీ అది ప్రజలకు కాదు ఆధిపత్య కులాలకు, ఓటు ఆయుధం వుపయోగించి నీ నీలి రాజ్యం నువ్వు సాధించుకో ఓ ఓటరన్నా ఈ దుస్థితి మారుతుంది అంటాడు.

మరో కవిత 'దశమ భాగం' పాట కవిత.... మాట ... ఏదో ఒకటి , శిల్పం... గేయం ... కావ్యం ఏదైనా, ఎదో ఒకటి చేయాలి .... నీ జాతికి అంకితమివ్వాలి .... అంబేద్కర్నీ ఎలా మర్చిపోయావురా, నా సహోదరుడా.... విగ్రహం ముందు నిలబడి నీ దోషత్వాన్ని కడుక్కో, నీ దశమ భాగాన్ని జాతి చైతన్యానికి మళ్ళించు అని అర్థంగా, ఆవేదనగా, బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న రాజ్యాన్ని అందరూ అందులో కొందరు ఉద్యోగాలు వచ్చిన తర్వాత అంబేద్కర్ను తన సమాజాన్ని పూర్తిగా మర్చిపోయి అసలు అంబేద్కరంటే ఎవరూ అనే పరిస్థితుల్లోకి బహుజన ప్రజలున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. దశమ భాగం ఇవ్వాల్సింది దేవుడకు కాదు ఈ దేశంలో బతకడానికి స్వేచ్ఛ వాయువులు పీల్చడానికి, హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ కు అని ఈ కవితలో స్పష్టంగా చెప్పాడు కవి.



అంబేద్కర్నీ ఎలా మర్చిపోయావురా, నా సహోదరుడా.... విగ్రహం ముందు నిలబడి నీ దోషత్వాన్ని కడుక్కో, నీ దశమ భాగాన్ని జాతి చైతన్యానికి మళ్ళించు అని అర్థంగా, ఆవేదనగా, బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న రాజ్యాన్ని అందరూ అందులో కొందరు ఉద్యోగాలు వచ్చిన తర్వాత అంబేద్కర్ను తన సమాజాన్ని పూర్తిగా మర్చిపోయి అసలు అంబేద్కరంటే ఎవరూ అనే పరిస్థితుల్లోకి బహుజన ప్రజలున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు.

మరో కవిత 'నీలి రాగోదయం' ....

పార్లమెంటుకు నడువ్ / నీ సొంత కాళ్ళపైనే నడువ్ / ఈ దేశ బహుజనానికి ఆయడో మంత్రం / రణక్షేత ప్రబోధ గీతం / దేవుడు ఊరేగింపులో.... బుద్ధుడు, పూలే - పెరియార్ - కబీర్- సాహు అన్నీ బహుజన బృందగానాలే / అది గాయపడ్డ వేణువు... ఓ చిగురు కొమ్మ నేలను చీల్చుకొని/ ఈ దేశ బహు జనులకు రక్షణగా భోధి వృక్షమవు తుంది.. అంటూ తరతరాల నుంచి ఈ దేశానికి చమురై, చెమటై, నెత్తురై, శ్రమ చేసింది చాలు ఇక్కనైన మనం రాజ్యం చేపట్టాలని బుద్ధుడు, పూలే, పెరియార్, సాహు, అంబేద్కర్ మహనీయుల అడుగు జాడల్లో నడిచి నీ రాజ్యాం నువ్వు సాధించుకో అని గట్టిగా చెప్పిన కవిత.

మరో కవిత 'గెలుపు'... అంబేద్కర్ అనే, ఆశయముంది, కాన్షీరామ్ ఆచరణవుంది, మాయవతి అనే ముందడుగు వుంది, ఆశయమనే ప్రమిదలో ఆచరణ నూనె పోసి మనమంతా వొత్తులమైతే, ఆ వెలుగు మనదే అవుతోంది అంటూ బలమైన కవిత్వం ద్వారా చెప్తారు.

మరొ కవిత 'నా పేరు సెలయేరు' మనువాదానికి మరణశాసనం రాస్తున్నామదిగో అని పాడే గొంతులు హత్యలు చేయబడతాయి, అణిచివేయబడతాయి... అన్యాయం అంటే లాఠీ..... రాజ్యాం వాడికి వీరభోజ్యం ... రాజ్యం వాడి చేతిలో దండం..... మన రాజ్యాం అడుగుతున్నాం, మన ఓట్లు అడుగుతున్నాం, మన వాటా అంటున్నాం, మనం ఆత్మగౌరవ నినాదాలిస్తున్నాం.... అందుకు కదా ఈ నిర్బంధాలు.... సంకెళు .... జైల్లు .... ఐనా మేం సిద్ధంగా వున్నాం.... మా గొంతుల్ని నులమలేరు... నా పేరు సెలయేరు అంటూ మీరు మమ్మల్ని ఎన్నిసార్లు ఆటంకాలకు గురిచేసిన, ఎన్ని చిత్రహింసలకు గురి చేసిన, ఎంత హింసలు పెట్టిన మా పాట, మా కవిత, మా ఉద్యమం ఆగదు. మేం పారే సెలయేర్లు అంటూ బలమైన గొంతుతో తన కవిత్వం ద్వారా బహుజనలకు మార్గనిర్దేశం చేస్తున్న బహిరంగ జన కవి నేలపూరి రత్నాజీ .... ఈ రాజ్యమేలే తాళం చెవి కవితా సంపుటి నిండా అనేక కవితలు రాజ్యం చేసే వికృత చేష్టలు, బహుజనలపై దాడులు, బహుజనులంతా కలిసి ఐక్యంగా రాజ్యాధికారం సాధించాలని రాసిన కవితలే. మరీ ముఖ్యంగా బహుజన రాజ్యాధికారం కోసం వచ్చిన కవితా సంపుటాలలో ఇది ప్రప్రథమంగా ముందు వరసలో వుంటుంది తప్పక చదవండి కవిత్వాన్ని రాయలనుకునేవారు స్పష్టంగా ఎవరి పక్షం కవిత్వం వుండాలో తెలియజేసే కవితా సంపుటి ఈ 'రాజ్యమేలే తాళం చెవి'.

సాహితీ వార్తలు

కథలు, కవితా సంపుటాలకు ఆహ్వానం!

ఖమ్మం ఈస్థటిక్స్ ఆధ్వర్యంలో అందిస్తున్న పురస్కారాలకు కథలు, కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఉత్తమ కథలుగా ఎంపికైన వాటికి మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10 వేలు అందించనున్నారు. ఉత్తమ కవితా సంపుటికి రూ. 40 వేలు అందించనున్నారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 మధ్య ప్రచురితమైన సంపుటాలను మాత్రమే పంపించాలి. నవంబర్‌లో ఖమ్మంలో నిర్వహించే వేడుకలలో పురస్కార ప్రధానోత్సవం ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు కథలు, కవితా సంపుటాలను ఆగస్టు 31లోగా ఖమ్మం ఈస్థటిక్స్ సాహిత్య పురస్కా రాలు, హార్వెస్ట్ స్కూల్, 5-7-200/11, పాకబండ బజార్, ఖమ్మం - 507003 చిరునామాకు లేదా khammamaesthetics@ gmail.com చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9849114369 నంబరు నందు సంప్రదించవచ్చు.

- రవికుమార్

18న 'జీవజలం చలం' స్మారకోపన్యాసం

చలం భావన ఆధ్వర్యంలో ఈ నెల 18న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో చలం స్మారకోపన్యాసం సభ నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సభలో నగ్నముని చలం ఆత్మకథపై ప్రసంగిస్తారు. శీల సుభద్రాదేవి, కొండేపూడి నిర్మల, ఘంటశాల నిర్మల, సజయ, మామిడి హరికృష్ణలు చలం ఆత్మకథలోని కొన్ని భాగాలను చదువుతారు.

- నాళేశ్వరం శంకరం

నేడు అచార్య కేకే రంగనాథాచార్యులు వర్ధంతి సంస్మరణ సభ

ఈ నెల 15న సోమవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్‌లో ఆచార్య కేకే రంగనాథాచార్యులు వర్ధంతి సంస్మరణ సభ నిర్వహిం చనున్నారు. ఈ కార్యక్రమంలో నిశిలేశ్వర్ విశిష్ట ప్రసంగం చేయనున్నారు.

16న గులాబీల మల్లారెడ్డి నవల ఆవిష్కరణ

గులాబీల మల్లారెడ్డి రచించిన నవల - ప్రేమ పవనాలు - మానవతా సౌరభాలు (క్యాంపస్‌లో సరిగమలు) - ఆవిష్కరణ సభ రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 16న మధ్యాహ్నం 1:30 గం॥లకు నిర్వహించ నున్నారు. ప్రముఖ రచయిత సి.ఎస్. రాంబాబు అధ్యక్షతన నిర్వహించే ఈ సభలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రముఖ రచయితలు చెన్నయ్య దోరవేటి, ప్రమోద్ ఆవంచ, వేముల ప్రభాకర్ హాజరవుతారు.



మదర్ మూన్ లైటింగ్....

వేతనం లేదు కానీ
అమ్మ మూన్ లైటింగ్ చేస్తుంది
ఒకే రోజున
ఇంటిలో పని మనిషి పాత్ర
ఆఫీస్‌లో ప్రగతిశీల మహిళగా

న్యాయం కాదు కానీ
ఏక కాలంలో
రెండు శిక్షలు అనుభవిస్తుంది
ఆడ జన్మ అవమానాలు
మధ్యతరగతి అవసరాల లేమి

పొగ రావట్లేదు కానీ
కూడ బలుక్కుని
అమ్మ డబుల్ ఇంజిన్ గాడి లా
పుట్టింటి అవసరానికి ఆసరాగా
మెట్టినింటినీ ఇంకో అంతస్తుకు లాగుతూ

ధారలు కనబడవు కానీ
అమ్మ అంతర్వాహిని
రెండు కళ్ల జీవ నదులే
తల దిండు కొంత
వాష్ రూమ్ మరికొంత
వాయిదాల చొప్పున పంచుకుంటూ

బహుమతులు లు లేవు గానీ
నిత్యం పోటీ లోనే
గోడ మీద గడియారం తో
కాళ్ళ కింది భూమి సహనం తో
సంస్కృతిసాంప్రదాయాలను భుజాన మోస్తూ...

- దాసరి మోహన్, 9985309080

ఒక్క బిడ్డతో ప్రారంభమై...

శ్రద్ధా సోపర్కర్... ధనవంతుల కుటుంబంలో పుట్టింది. మానసిక వ్యాధితో పుట్టిన తన బిడ్డకు మెరుగైన చికిత్స అందిస్తుంది. తన బిడ్డతో పాటే మరో బిడ్డ చికిత్స కోసం వచ్చింది. ఆ బిడ్డ తల్లి కడుపునిండా తిండి కూడా తినడం లేదు. ఆకలి లేక కాదు బిడ్డ చికిత్స కోసం డబ్బు దాచేందుకు. తను రోజూ కడుపు నిండా తింటే తన బిడ్డకు చికిత్స చేయించలేనని తన భయం. ఈ సంఘటనతో శ్రద్ధ గుండె కరిగిపోయింది. 'మధురం ఛారిటబుల్ ట్రస్ట్' పుట్టుకకు దారి తీసింది. ఇంతకీ ఆ వివరాలేంటో ఈ రోజు మానవిలో తెలుసుకుందాం...





శ్రద్ధా సోపర్కర్ అనే 38 ఏండ్ల మహిళ. సెరిబ్రల్ పాల్సీకి అనే వ్యాధికి చికిత్స పొందుతున్న తన కూతురికి భోజనం పెట్టేందుకు ఆసుపత్రి హాల్లో కూర్చుని ఉంది. ఈ వ్యాధితో బాధపడుతున్న వారు నడవాలన్నా, తినాలన్నా ప్రతి దానికి ఇతరులపై ఆధారపడాల్సిందే. శ్రద్ధా కూతురు గదిలోకి వెళ్ళి చుట్టూ చూసింది. ఆ గదిలోనే మరొక మహిళ బిడ్డ కూడా చికిత్స పొందుతుంది. ఆ మహిళ మధ్యాహ్న భోజనానికి కేవలం మజ్జిగ మాత్రమే తీసుకోవడం ఆమె చూసింది. ఇది శ్రద్ధకు ఆసక్తిని కలిగించింది. ఆగలేక ఆ మహిళ దగ్గరకు వెళ్ళి భోజనం ఎందుకు చేయలేదని అడిగింది. దానికి ఆమె "నేను రోజూ తింటుంటే నా కొడుకు చికిత్స కోసం డబ్బులు ఎలా దాచగలను?' అన్నది.

కుటుంబ సహకారంతో...

ఆ తల్లి మాటలు శ్రద్ధకు బాధ కలిగించాయి. 'ఆమె మాటలు విని ఒక్క క్షణం స్తంభించిపోయాను. వెంటనే ఆమె బాబు చికిత్సకు అవసరమయ్యే డబ్బును ఇచ్చి ఆ మహిళకు తాను తోచిన సహకారం అందించాలని అనుకున్నాను" అని తన భావాలు పంచుకుంది. అలా ఒక బిడ్డతో ప్రారంభించి శ్రద్ధ చాలా మంది పిల్లలకు ఆర్థిక సహాయాన్ని అందించడం మొదలుపెట్టింది. ఆమె పదవ బిడ్డకు సహాయం చేస్తున్నప్పుడు తన కుటుంబం కూడా ముందుకు వచ్చింది. ఈ సహాయ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేయాలనే నిర్ణయానికి వచ్చాను.

మెదడుకు నాలుగు చికిత్సలు

శ్రద్ధకు న్యాయశాస్త్రంలో పట్టా ఉంది. కానీ దాన్ని ఆమె వృత్తిగా స్వీకరించలేదు. ఆమె ఒక వ్యాపార కుటుంబంలో పెరిగింది. పెండ్లి జరిగి 2018లో ఆమె బిడ్డకు తల్లి అయ్యే వరకు ఆమె జీవితం వ్యాపారం చుట్టూనే తిరిగింది. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ పాప పేరు శృతి. అయితే శృతికి ఇన్ఫెక్షన్ వచ్చి సెరిబ్రల్ పాల్సీ అని తేలింది. నడవడం, కూర్చోవడం, మాట్లాడటం ఆమెకు చాలా కష్టంగా మారింది. ఇప్పటి వరకు ఆమెకు నాలుగు సార్లు మెదడు శస్త్రచికిత్సలు చేయించుకోవలసి వచ్చింది. "పిల్లలను పెంచడం చాలా పెద్ద బాధ్యత. అందులోనూ ప్రత్యేక సామర్థ్యం ఉన్న పిల్లల విషయానికి వస్తే తల్లిదండ్రులకు బాధ్యత మరింత పెరుగుతుంది" అంటారు శ్రద్ధ.

మధురం ఛారిటబుల్ ట్రస్ట్

2019లో 'మధురం ఛారిటబుల్ ట్రస్ట్' పుట్టింది. అహ్మదాబాద్‌కు చెందిన ఈ సంస్థ ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ ద్వారా ప్రత్యేక సామర్థ్యం ఉన్న పిల్లలకు సహాయం చేస్తుంది. అలాగే కీళ్ల శస్త్రచికిత్సలు, బొటాక్స్ సర్జరీలు చేయిస్తూ వినికిడి పరికరాలు, ఊతకర్రలు కూడా అందిస్తున్నారు. 2021లో ట్రస్ట్ స్టెపాథాన్ అనే ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. అది నిరుపేద ప్రజలకు ఉచితంగా కృత్రిమ కాళ్లను అందిస్తుంది.

ఖర్చుతో కూడుకున్నది...

ఇటువంటి వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తే వారిలో చాలా మార్పు వస్తుంది. వారిలో కూడా నైపుణ్యాలు పెంపొందించవచ్చు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్నది. అందువల్ల మధురం ఛారిటబుల్ ట్రస్ట్ చికిత్స, శస్త్రచికిత్సలను అందించడానికి స్పార్ష్ పీడియాట్రిక్ రిహాబిలిటేషన్ క్లినిక్ అయిన హిషు చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటర్వెన్షన్ సెంటర్‌తో జతకట్టింది. మస్తిష్క పక్షవాతంతో పాటు, ఆటిజం, మెంటల్ రిటార్డేషన్, మానసిక ఆరోగ్య సమస్యల వల్ల కలిగే వినికిడి వైకల్యాలు ఉన్న పిల్లలకు ట్రస్ట్ సహాయం చేస్తుంది. ఇప్పటివరకు ఇది 800 మంది పిల్లల చికిత్స ఖర్చు చేసింది. పోలియో, దృష్టి లోపం, వినికిడి వైకల్యం ఉన్న 10 మంది పిల్లలకు శస్త్రచికిత్స ఖర్చును స్పాన్సర్ చేసింది.





ఉచితంగా కృత్రిమ కాళ్లు

2021లో కరోనా సమయంలో థెరపీ సెంటర్‌లు మూసివేశారు. ఇది శ్రద్ధకు కొత్త ఆలోచనలు చేసేందుకు మార్గమయింది. ట్రస్ట్ స్టెపాథాన్‌ను ప్రారంభించింది. ఇక్కడ అట్టడుగు వర్గాలకు చెందిన వికలాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లను అమర్చుతారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ కూడా చేయిస్తారు. ఇవి ఒట్టోబాక్ నుండి దిగుమతి చేసుకున్న నాణ్యమైన ప్రోస్తేటిక్స్-ఆర్థోపెడిక్ టెక్నాలజీలో వ్యవహరించే జర్మన్ కంపెనీ. శ్రద్ధ దీని గురించి మరింత వివరిస్తూ 'ఈ కాళ్లు తేలికగా ఉంటాయి. మోయడానికి సులభంగా ఉంటాయి. అవి సిలికాన్ లైనర్‌తో వస్తాయి. వాటిని ధరించడం చాలా సౌకర్యవంతం. ప్రొస్తెటిక్ కాళ్లకు హైడ్రాలిక్ మోకాలి కీలు ఉంటుంది. ఇది కదలికను సులభతరం చేస్తుంది. దాని పాదాల థ్రస్ట్ సులభంగా నడిచేలా చేస్తుంది. ఇది పెట్టిన తర్వాత సైకిల్ తొక్కవచ్చు, స్నానం చేయవచ్చు, డ్రైవ్ చేయవచ్చు, ఈ కాళ్ళపై ఎక్కవచ్చు. నా నినాదం ఎల్లప్పుడూ మీ కోసం మీరు ఉపయోగించుకునే వాటిని అందించడమే" అంటుంది.

ఇప్పుడు డాన్స్ కూడా చేస్తుంది

వీరి సహాయంతో చికిత్స పొందిన రోష్ని ఎడమ పాదం లేకుండా పుట్టింది. స్నానం చేయడం, టాయిలెట్‌కి వెళ్లడం కోసం రోష్ని తనపై ఆధారపడి ఉండేదని ఆమె తల్లి సాజిదా గుర్తుచేసుకుంది. "ఆమెకు ఐదేండ్లు వచ్చే సరికి నేను తనకు ఆ పనులు చేయలేకపోయాను. మధురం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మా పాపకు ప్రొస్తెటిక్ అమర్చారు. ఇప్పుడు నా కూతురు నడవగలదు, నృత్యం చేయగలదు, గర్బా ఆడగలదు, మెట్లు ఎక్కగలదు, పాఠశాలకు వెళుతుంది. ముఖ్యంగా ఆమె సాధారణంగా పిల్లలతో ఆడగలదు. ఇకపై తనకు నడకలో ఎలాంటి ఇబ్బందీ ఉండదు" అంటూ ఆ తల్లి ఎంతో ఆనందంగా చెబుతుంది.

మరింత బాధ్యతగా...

వాస్తవానికి ప్రత్యేక సామర్థ్యం ఉన్న బిడ్డను జాగ్రత్తగా చూసుకోవడం తల్లిదండ్రుల మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఇక ఆర్థిక సమస్యలు ఉన్నాయంటే పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంటుంది. శ్రద్ధకు ఆర్థిక సమస్యలు లేకపోవడంతో తన బిడ్డకు మెరుగైన చికిత్సను అందించగలుగుతుంది. "అన్ని వనరులు ఉన్నప్పటికీ మా ప్రయాణం అంత సులభం కాదు. నిత్యం డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి, గంటల తరబడి చికిత్స, పైగా పాపకు ఎన్నో శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చింది ఇది అత్యంత బాధాకరం" అంటుంది.



ఎక్కడైనా నెగ్గొచ్చు

ఇంట్లో బంధాలు, బంధుత్వాల మధ్యే చిన్న చిన్న తగాదాలు సహజం. అలాగే ఆఫీసులో కూడా కొన్ని గొడవలు ఉంటూనే ఉంటాయి. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారంతా కలిసి ఒకే తాటి మీద నడవాలంటే కష్టమే. భిన్న మనస్తత్వాలు, పని తీరు ఉంటాయి. అలాంటివి అర్థం చేసుకొని సర్దుకుపోతే జీవితంలో ఎక్కడైనా నెగ్గొచ్చంటున్నారు నిపుణులు..

- మీరు చేసిన పనికి ఇతరులు ఫలితం తీసుకుంటే చాలా కోపమొస్తుంది. అలాంటి సమయంలో ఆవేశపడితే లాభం లేదు. అందుకని ఎప్పుడు చేసిన పనిని అప్పుడు ఫైల్ చేసి పెట్టుకోవాలి. నిరూపించాలనుకున్నప్పుడు ఆధారాలు చూపిస్తే సరి.
- ఇతరుల గురించి ఆఫీసులో గాసిప్స్ చాలా వింటాం. ఎవరెవరి గురించో మాట్లాడుకున్నవన్నీ విని పట్టించుకోవద్దు. ఎక్కడ విన్నవి అక్కడే మర్చిపోవాలి.
- ఇతరులకు మనకంటే అవకాశాలు ఎక్కువగా వస్తున్నాయని అసూయ పడటం తప్పు. కృషి ఎక్కువగా చేస్తే అవకాశాలు అవే వెతుక్కుంటూ వస్తాయి. ఇంత చిన్న విషయానికి ఎదుటి వారు ఎదిగిపోతున్నారని ఈర్ష్య చెందటం మంచిది కాదు.
- సహోద్యోగులతో పక్షపాత ధోరణితో కాకుండా స్నేహభావంతో మెలగాలి. ఈ సానుకూల అంశాలన్నీ ఎదగడంలో దోహదపడతాయి. కెరియర్‌లోనైనా, జీవితంలోనైనా చెడును వదిలేసి మంచిని తీసుకుంటే ముందడుగు వేయగలం.

అయోధ్యలో ముస్లిం అభ్యర్థి విజయం

(మొదటిపేజీ తరువాయి)



అనే స్థానిక యువకుడు తన ఎన్నికల అరంగేట్రం లోనే గణనీయమైన విజయాన్ని సాధించాడు. రామ్ అభిరామ్ దాస్ వార్డులో గెలిచాడు. "అయో ధ్యలో హిందూ-ముస్లిం సోదరభావం, రెండు వర్గాల శాంతియుత సహజీవనానికి ఇది ఉత్తమ ఉదాహరణ. మా హిందూ సోదరుల నుంచి ఎలాంటి పక్షపాతం లేదు. వారు నన్ను వేరే మతానికి చెందిన వ్యక్తిగా భావించలేదు. వారు నా విజయానికి మద్దతు, భరోసాను ఇచ్చారు" అని అన్సారీ చెప్పాడు.రామజన్మభూమి వెనుక భాగంలో ఉన్న ఈ వార్డులో ముస్లిం ఓట్ల శాతం 11 శాతం మాత్రమే ఉన్నది. మొత్తం ముస్లిం ఓట్లు 440 కాగా.. హిందూ ఓట్లు 3,844 గా ఉన్నాయి. మొత్తం 2,388 ఓట్లు పోలవగా అన్సారీకి 42 శాతం ఓట్లు లభించాయి. మొత్తం 10 మంది అభ్యర్థులు పోటీ చేయగా.. అన్సారీకి 996 ఓట్లు వచ్చాయి. అన్సారీ.. మరో స్వతంత్ర అభ్యర్థి నాగేంద్ర మాంఝీపై 442 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ బీజేపీ మూడో స్థానంలో నిలవడం గమనార్హం. " రామ మందిరానికి అయోధ్య ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ మతపరమైన పట్టణం హిందువులకు ఎంత పవిత్రమైనదో ముస్లింలకు కూడా అంతే పవిత్రమైనది. ఇక్కడ చాలా మసీదులు కనిపిస్తాయి. అనేక శతాబ్దాల నాటి ముస్లిం సూఫీల సమాధులు కూడా ఉన్నాయి" అని అయోధ్యకు చెందిన వ్యాపారవేత్త సౌరబ్‌సింగ్ అన్నారు. అయోధ్యలో ముస్లింలు ఉండగలరు, ఎన్నికల్లోనూ గెలవగలరని వార్డుకు చెందిన అనూప్ కుమార్ తెలిపారు.

ఎండ@45.9 డిగ్రీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మొన్నటి వరకు వర్షాలతో కొంత చల్లగా ఉన్నవాతావరణంలో క్రమంగా మార్పులు మొదలయ్యాయి. ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతూ పోతున్నాయి. మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో ఆదివారం నాడు 45.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ఇప్పటికే చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోయాయి. వచ్చే నాలుగైదు రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు కాస్తా రెండు నుంచి మూడు డిగ్రీల మేర పెరిగే అవకాశముంది. ముఖ్యంగా మంచిర్యాల, ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. భానుడు ఉదయం 10 గంటల నుంచే తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని భయానక పరిస్థితిని కల్పిస్తున్నాడు. ఓవైపు తీవ్ర ఎండలు, మరోవైపు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇండ్లల్లో ఫ్యాన్లు వేసినా వేడిగాలే వస్తుంది తప్ప ఉపశమనం లభించని పరిస్థితి. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. మరోవైపు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి పెరుగుతున్న క్రమంలో వడగాల్పులు వీచే ప్రమాదం కూడా ఉంది. 45 డిగ్రీలు దాటిన ప్రాంతాలు రెడ్ హెచ్చరిక జాబితాలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తతో ఉండాల్సిన అవసరముంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకుగానూ వీలైనంత మేరకు ఎక్కువగా(కనీసం నాలుగైదు లీటర్ల) నీళ్లు తాగాల్సిన అవసరముంది. వీలైనంత మేరకు ప్రయాణాలు ఉదయం, సాయంత్రం పూటనే ఉండేలా చూసుకోవాలి.

కొండాపూర్(మంచిర్యాల)	45.9 డిగ్రీలు
జన్నారం(మంచిర్యాల)	45.8 డిగ్రీలు
జైన (జగిత్యాల)	45.5 డిగ్రీలు
నీల్వాయి(మంచిర్యాల)	45.5 డిగ్రీలు
జీలంపల్లి(మంచిర్యాల)	45.4 డిగ్రీలు
కెరమెరి(కొమ్రం భీమ్ అసిఫాబాద్)	45.4 డిగ్రీలు
ముప్కాల్(నిజామాబాద్)	45.1 డిగ్రీలు
పజ్జూర్(నల్లగొండ)	45.1 డిగ్రీలు





బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే తొలగించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. క్రీడాకారులు లైంగిక వేధింపులకు గురి కావడం అంతర్జాతీయ సమాజం దృష్టిలో దేశ ప్రతిష్ఠ దిగజార్చిందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల నేతలతో పాటు అఖిల భారత రూరల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారని అన్నారు. క్రీడాకారులకు సంఘీభావంగా ఈనెల 18న దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నామని తెలిపారు.

అధికార బీజేపీ మహిళా ఎంపీలు మద్దతు ఇవ్వలేదు..
వారికి లేఖలు పంపుతాం : వినేష్ ఫోగట్



"మహిళల గౌరవం కోసం మేం చేస్తున్న పోరాటంలో మద్దతునిచ్చేందుకు" రెజ్లర్లను ఒక్క అధికార పార్టీ మహిళా పార్లమెంటేరియన్ కూడా కలవలేదని రెజ్లర్ వినేశ్ ఫోగట్ మండిపడ్డారు. సోమవారం నుంచి అధికార పార్టీకి చెందిన మహిళా పార్లమెంటేరియన్లందరూ వచ్చి తమకు మద్దతివ్వాలని మల్లయోధులు చేతితోరాసిన లేఖలను ఈ-మెయిల్ ద్వారా పంపుతామనితెలిపారు. దేశంలోని మహిళల భద్రత గురించి వారు మాట్లాడినప్పుడు, మేం కూడా వారి కుమార్తెలమే, వారు బయటకు వచ్చి తమకు మద్దతు ఇవ్వాలని ఆమె అన్నారు. "మేం వారికి (అధికార పార్టీ మహిళా పార్లమెంటేరియన్లు) బహిరంగ లేఖ రాస్తున్నాం. ఆ లేఖలను చేతితో అందజేస్తాం. మేం ఈ-మెయిల్ ద్వారా కూడా లేఖలు పంపుతాం. మా వాయిస్, మా మనోవేదనలు ఇంకా వారికి చేరలేదని మేం భావిస్తున్నాం. వారు లేఖలు అందుకున్న తర్వాత వచ్చి మాకు మద్దతు ఇస్తారని భావిస్తున్నాం" అని వినేశ్ చెప్పారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనలో భాగస్వామ్యం అవుతున్న ప్రజలు మే 16న తమ జిల్లా కేంద్రాలను సందర్శించి రెజ్లర్లకు మద్దతుగా మెమోరాండం ఇవ్వాలని వినేశ్ అభ్యర్థించారు. "మహిళల గౌరవం కోసం కేవలం ఒక్కరోజు మాత్రమే సత్యాగ్రహ ఆందోళన (అహింసాత్మక ప్రతిఘటన) ప్రారంభించాలని మాకు మద్దతు ఇస్తున్న వారిని ప్రత్యేకంగా అభ్యర్థిస్తున్నాం" అని వినేశ్ తెలిపారు.

అడ్డగోలు దందా..!

(మొదటిపేజీ తరువాయి)

నారాయణ విద్యాసంస్థలో చదువుకున్న విద్యార్థే కాదు. అయినా ఆ విద్యార్థి పేరును వాడుకున్నది. ఈ రకంగా అడ్డగోలుగా ర్యాంకుల పేరుతో అబద్ధాల దందా నిర్వహిస్తున్నది. విద్యావ్యాపారాన్ని విస్తరించేందుకు ఇష్టారాజ్యంగా ప్రకటనలు ఇస్తున్నది. ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలు, ప్రయివేటు జూనియర్ కాలేజీలు కూడా ప్రకటనలు ఇచ్చాయి. కానీ నారాయణ విద్యాసంస్థ మాత్రం బరితెగించి ఆలిండియా స్థాయిలో ఒకటో ర్యాంకులు ఐదు వచ్చాయంటూ ప్రకటించింది. ఇంత జరిగినా ఉన్నత విద్యాశాఖ, ఇంటర్ బోర్డు చోద్యం చూస్తున్నాయి. ఆ విద్యాసంస్థకు ఇప్పటి వరకు నోటీసులివ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. దీన్ని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. తప్పుడు ప్రకటనలు ఇచ్చిన నారాయణ విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

'క్యాష్' చేసుకుంటున్న నారాయణ

కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివితేనే ఐఐటీ-జేఈఈ, నీట్‌లో మంచి ర్యాంకులు వస్తాయంటూ పలు కాలేజీలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షించేలా ప్రకటనలు ఇస్తున్నాయి. రంగురంగుల భవనాలు, 1,1,1,1,1, 2,2, 3,3 ఇలా టాప్ టెన్‌లో ఎన్ని ర్యాంకులు వస్తే అన్ని ఇస్తాయి. ఆ ప్రకటనలను చూసి చాలా మంది ప్రభావితమవుతారు. సహజంగానే విద్యార్థుల జీవితం పట్ల తల్లిదండ్రులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. జీవితంలో ఏ రంగంలో స్థిరపడాలన్నా ఇంటర్ చదువే చాలా కీలకం. అందుకే డబ్బు గురించి ఆలోచించకుండా కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వారి పిల్లలు విద్యలో ముందుండాలని, ఏ విషయంలోనూ తక్కువ కాకూడదనే ఉద్దేశంతో ఆ కాలేజీల్లో చేర్పించేందుకు ప్రాధాన్యత ఇస్తారు. అయితే దీన్నే నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని అబద్ధాలతో ఆకర్షించే కుయుక్తులకు పాల్పడుతున్నాయి. ఈ అనైతిక విద్యావ్యాపారాన్ని అరికట్టేందుకు విద్యాశాఖ, ఇంటర్ బోర్డు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలు మీడియాలో వచ్చే ప్రకటనలను పర్యవేక్షించడం కోసం ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఇటీవల ఓ కమిటీని నియమించింది. ప్రకటన ఇచ్చే ముందు ఇంటర్ బోర్డు అనుమతి తప్పనిసరి అని ఆదేశించింది. ఆ కమిటీ తూతూమంత్రంగా పనిచేస్తున్నదనీ, నారాయణ వంటి కార్పొరేట్ కాలేజీలను నియంత్రించడంలో విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి. ఆ కాలేజీల మాయలో పడకుండా విద్యార్థుల జీవితాలను రక్షించాలంటూ విద్యావేత్తలు కోరుతున్నారు. ప్రభుత్వం వాటి ఆగడాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు సీఎస్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఆదివారంనాడామె సచివాలయంలో దీనిపై పలు శాఖలతో కూడిన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలు జూన్ రెండు నుంచి ఇరవై ఒక్క రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయని చెప్పారు. గడచిన తొమ్మిదేండ్లలో ఆయా శాఖలు సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ఈ ఏర్పాట్లు ఉండాలని అన్నారు.

దీనికి సంబంధించిన డాక్యుమెంటరీలను రాష్ట్ర స్థాయిలో ప్రతి శాఖ తయారు చేయాలని చెప్పారు. స్మారక చిహ్నాలు, ప్రభుత్వ భవనాలకు విద్యుత్ అలంకరణ చేయాలని ఆదేశించారు. దీనికోసం సబ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జీఏడీ సెక్రటరీ శేషాద్రి, ఆర్థికశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కార్యదర్శి నిర్మల, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కె. అశోక్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ బి. రాజమౌళి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎం. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవలు మరువలేనివి

(మొదటిపేజీ తరువాయి)

కృషిని ఈ తరానికి తెలియజేయడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందించింది.

కేటీఆర్‌తో ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ చర్చలు

ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ యూకే సీఈఓ కీత్ రిడ్జ్‌వే, ఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇండియా సీఈఓ సీకా చంద్రశేఖర్ తదితరులు మంత్రి కేటీఆర్‌ను లండన్‌లో కలిశారు. హస్క్ పెల్లెట్స్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ గురించి చర్చించారు. తెలంగాణలో 25మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి ఆ సిద్ధంగా ఉన్నామని, ఏడాది వెయ్యి మెట్రిక్ టన్నుల బయో పెల్లెట్స్ ఉత్పత్తి చేస్తామనిఇన్‌క్రెడిబుల్ హస్క్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఈ సందర్భంగా వెల్లడించింది. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానితో కలిసి పనిచేయడానికి ఆ సంస్థ సంసిద్ధతను వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం నుంచి ఆ సంస్థకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు.

హైకమాండ్ చేతిలో సీఎం ఎంపిక



(మొదటిపేజీ తరువాయి)

కూడా ఆ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. హర్పన్‌హల్లి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన లత మల్లికార్జున్ కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ 66,జనతాదళ్ (సెక్యులర్) 19 స్థానాలను గెలిచిన సంగతి తెలిసిందే.

ప్రజలకే సేవచేయడమే కాంగ్రెస్ ప్రాధాన్యత : ఖర్గే

పార్టీకి ఎవరు ఓటు వేసినా, వేయకపోయినా రాష్ట్ర ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ ప్రాధాన్యత అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఢిల్లీలోని10 రాజాజీ మార్గ్ నివాసంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది, మద్దతుదారులు ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ప్రజల విజయమని అన్నారు. ప్రజలు బీజేపీని తిరస్కరించారని, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతితో సతమతమవుతున్న ప్రజలు కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కోసం కాంగ్రెస్‌కు అతిపెద్ద ఆదేశం ఇచ్చారని చెప్పారు. 'మా మంత్రివర్గం ఏర్పడిన తొలిరోజే ఐదు హామీలకు జీవం పోసి వాటిని అమలు చేస్తాం.. అందుకే మాకు పెద్ద ఆదేశం వచ్చింది, ప్రజలకు సేవ చేయాలి.. ప్రజలకు సేవ చేయడం, సంక్షేమం చేయడమే మా పని.." అని ఆయన అన్నారు. ప్రజలు, ముఖ్యంగా పేదలు, మహిళలు, మైనార్టీలు, దళితులు కాంగ్రెస్ ఐదు హామీలను అంగీకరించారని, వారి అంచనాలకు అనుగుణంగా వాటిని అమలు చేస్తామని ఖర్గే చెప్పారు. "ప్రభుత్వాన్ని సక్రమంగా నడపాలి, ఇది ఏకాభిప్రాయంతోనే సాధ్యం. మాది ప్రజాస్వామ్య పార్టీ.... ఎన్నికల్లో ఇప్పటి వరకు అంతా సజావుగా ఉంది, మాకు మెజారిటీ వచ్చింది, వీలైనంత త్వరగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం" అని తెలిపారు.

రాజ్‌భవన్‌లో మాతృదినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అంతర్జాతీయ మాతృదినోత్సవం వేడుకలను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ రాజ్‌భవన్‌తో నిర్వహించారు. రాజ్‌భవన్ పరివార్ లోని వయోవృద్ధులైన మాతమూర్తులు, ఇటీవలే మొదటి సారి తల్లులైన యువతులతో కలసి ఆమె ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

'మత రాజకీయాలను తిప్పి కొట్టిన కర్ణాటక ప్రజలకు శుభాకాంక్షలు'

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

శనివారం వెలువడిన కర్ణాటక ఫలితాలు బీజేపీకి, మోడీకి చెంపదెబ్బ లాంటిదని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మత రాజకీయం చేస్తామని అనుకుంటే రానున్న ఎన్నికలలో బీజేపీకి ఇదే గతి పడుతుందని : సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ ఒక ప్రకటనలో అన్నారు. బీజేపీ అధికారం కోసం మతంను వాడుకోవడమే కాకుండా చివరికి హనుమంతుడిని కూడా వాడుకోవడం సిగ్గుచేటు అన్నారు. 2014లో కూడా కాంగ్రెస్ అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చాక మత రాజకీయాలు చేసి ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచిందన్నారు. గతంలోనే ఎన్నడూ లేనంత మత విద్వేషం పెరగడానికి కారణం బిజెపినే అన్నారు. తెలంగాణ అంటేనే హిందూ ముస్లిం తహజీబని లాంటిది తెలంగాణలో మత రాజకీయాలు పనికిరావన్నారు. రానున్న ఎన్నికల్లో గట్టి బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ కూడా ఎన్నికల్లో గెలిచామని విర్రవీగకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల మధ్య సామరస్యం పెంచేలా చూడవలసిన బాధ్యత ఉందన్నారు.

చాకలి బస్తీలో డ్రయినేజీ పనులు పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-హయత్ నగర్



హయత్ నగర్ డివిజన్‌లోని చాకలి బస్తీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆదివారం డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బస్తీ వాసులకు రాబోయే కాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈ పనులు పూర్తైన వెంటనే సీసీ రోడ్ పనులు కూడా మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, బస్తీ వసూలు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-సంతోష్ నగర్



సేవా పతకాన్ని అందుకున్న సందర్భంగా సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సివి ఆనందన్‌ను ఆదివారం పీస్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు మెమొంటో అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ ఆనంద్ మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలు పీస్ కమిటీ సభ్యులు, పోలీసులకు సహకారం అందించాలని సూచించారు. సమాజ సేవలో కమిటీ సభ్యులు ముందుండాలని కోరారు. కమిషనర్‌ను సన్మానించిన వారిలో ఆల్ జోన్ ప్రధాన కార్యదర్శి కిషన్ శర్మ, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు శశికాంత్ అగర్వాల్, సౌత్ జోన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ సంపత్ తోష్నివాల్, సౌత్ జోన్ అధ్యక్షుడు ఖ్వాజా అబ్దుల్ ముహిజ్, సౌత్ వెస్ట్ జోన్ ప్రెసిడెంట్ మహ్మద్ మహామ్ అలీ, వెస్ట్ జోన్ ప్రెసిడెంట్ తేజు కుమారి, సౌత్ ఈస్ట్ జోన్ ప్రెసిడెంట్ ఖాజా ఘజియుద్దీన్, ఈస్ట్ జోన్ సెక్రటరీ డాక్టర్ మజర్ ఉద్దీన్, గోపాల్ దాస్, నరసింహగౌడ్, డాక్టర్ జానౌలా, ఉమేంద్ర అడ్వకేట్, డాక్టర్ రవీందర్, శరద్ శ్యామ్, కౌసర్ మునీర్ ఖాద్రీ, యూసుఫ్ ఉన్నారు.

దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడమే సీపీఐ లక్ష్యం

- **సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ**

నవతెలంగాణ -సంతోష్‌నగర్

విధ్వంసక రాజకీయాలు చేస్తున్న బీజేపీని దేశవ్యాప్తంగా ఓడించడమే సీపీఐ లక్ష్యం అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. మలక్ పేట్ నియోజకవర్గం హైదరాబాద్ మూసారాం బాగ్, ఆస్మాన్ గఢ్, టీవీ టవర్, బి బ్లాక్స్, తిరుమల హిల్స్, వీకే దాగే నగర్, బ్యాంకు కాలనీ తదితర బస్తీలు, కాలనీలలో ఆదివారం 'బీజేపీ హటావ్ - దేశ్ బచావ్' అనే నినాదంతో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి పాదయాత్ర నిర్వహించింది. ఈ సందర్భంగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బి. వెంకటేశంతో పాటు వందలాది మంది సీపీఐ శ్రేణులు దుకాణాలు, ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ బీజేపీ ప్రజా వ్యతరేక విధ్వంసక విధానాలను వివరించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 15 నుండి మే 15 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలలోని మహానగరాలు, పట్టణాలు, గ్రామాలలో 'బీజేపీ హటావ్ - దేశ్ బచావ్' నినాదంతో పాదయాత్రలు చేపట్టినట్లు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అధికారం నుంచి దించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశమంతటా మత విషాన్ని వ్యాపింపజేస్తున్న బీజేపీ పార్టీ.. ప్రజలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి అని హుకుం జారీచేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. కర్ణాటక మాదిరిగానే దేశమంతటా తరమికొడుతారని అన్నారు. ప్రతిపక్షాలను అణిచివేసేందుకు ఈడీ, సీబీఐ, ఐటీ డిపార్ట్‌మెంట్లను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ప్రగతిశీల, ప్రజాసామ్యవాదులందరూ ఏకమై బీజేపీని వచ్చే లోక్ సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించడానికి కషి చేయాలని నారాయణ పిలుపునిచ్చారు.



ఈ.టి.నరసింహ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేయడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. బీజేపీ నియంతత్వ పాలన నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ పాదయాత్రలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రమోహన్ గౌడ్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, సీపీఐ నగర నేతలు మన్నన్, గ్యార నరేష్, బైరగోని రాజు గౌడ్, మహమూద్, ఒమర్ ఖాన్, లతీఫ్, సిహెచ్. జంగయ్య, ఎండీ. సలీమ్, మునీర్ పటేల్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేత



నవతెలంగాణ -వనస్థలిపురం

మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త దాతలకు ఆదివారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ ముద్దగొని లక్ష్మీ ప్రసన్న గౌడ్ హాజరై మాట్లాడారు. సమాజ సేవ చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. గౌరవ అతిథులు ప్రముఖ కవి రచయిత, డాక్టర్ ప్రొఫెసర్, ప్రభుత్వసిటీ కళాశాల కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ పక్షాన శంకర్ చాలా గొప్ప సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈరోజు రక్తదాన శిబిరంలో 25 మంది రెడ్ క్రాస్ సొసైటీ వారికి ఈ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. రక్తమిచ్చు ప్రతి మనిషి దైవ సమానం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి.శంకర్, ఎస్సీ ఆర్ పీ ఎస్ చైర్మన్ గంగం. శివశంకర్, చేపూరి. సునీత, ముద్దం వెంకటేష్, షేక్ మబుల్, రామారావు, ప్రవీణ్, అరుణ్ , కరుణ, నరసింహ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిన సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొని బడంగ్ పేట్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసిన అనంతరం ర్యాలీగా బాలాపూర్ చౌరస్తా, జిల్లెలగూడా మీదుగా మీర్ పేట్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తర్వాత బాణ సంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అంతకు ముందు గాంధీభవన్ లో జరిగిన సంబరాలకు హాజరైన మేయర్ పారిజాత నర్సింహారెడ్డి..టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గొంతులేని వాడి గొంతుక 'నవతెలంగాణ'

- **సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్**

నవతెలంగాణ -సంతోష్ నగర్



గొంతులేని వాడి గొంతుక నవతెలంగాణ పత్రిక అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. యాకుత్ పురా నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఆదివారం సౌత్ కమిటీ శాఖ కార్యదర్శి వేదిక సమావేశం జరిగింది. నవతెలంగాణ దినపత్రిక సర్క్యులేషన్ వర్క్ షాప్ ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ హాజరై మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితి రాష్ట్ర పరిస్థితులపై రాజకీయ రిపోర్ట్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజాభిప్రాయానికి పెద్దపీట, గొంతులేని వాడి గొంతుక నవతెలంగాణ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. సకల జనుల గుండెచప్పుడు నవతెలంగాణ..మన నదీజలాలు, ప్రాజెక్టులు, పరిశ్రమలు, వాటి అభివద్ధి వంటి వాటిపై అటు ప్రభుత్వానికి, ఇటు ప్రభుత్వేతర సంస్థలకు సూచనలు, సలహాలు ఇవ్వడం నవతెలంగాణ దినచర్య అని తెలిపారు. ప్రజల సమస్యలను అధికార యంత్రాంగం దష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపిస్తుందన్నారు. మన వనరుల్ని కబళించే కుట్రల్ని గమనించి.. ప్రజా సమూహాల్ని అప్రమత్తం చేస్తున్నది నవతెలంగాణ అని కొనియాడారు. అణచివేత, వివక్షతకు గురయ్యే వర్గాలకు అండగా నిలబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జి. విటల్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలునాయక్, ఎం. శ్రావణ్ కుమార్, పి.నాగేశ్వరరావు, కోటయ్య ఎస్. కిసాన్ నాయక్, ఎ. కష్ణ, లక్ష్మమ్మ శశికళ, నవతెలంగాణ జనరల్ మేనేజర్ లింగారెడ్డి, సిబ్బంది, అడ్వటైజ్మెంట్ భరత్ నాయక్, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలను హక్కున చేర్చుకోవడం అందరి బాధ్యత

- **సెంట్రల్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థకు రూ.25 వేలు విరాళం**
- **రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి**



నవతెలంగాణ-చైతన్యపురి

అనాథలను హక్కున చేర్చుకోవడం అందరీ బాధ్యత అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మాత దినోత్సవం సందర్భంగా మహేశ్వర నియోజకవర్గం ఆర్కేపురానికి చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మాత మూర్తి చిలుక హైమవతి తనకు వచ్చే పెన్షన్ డబ్బుల నుండి రూ.25వేల చెక్ ను ఆదివారం మునగనూర్ గ్రామం వేమూరి విజయలక్ష్మి స్థాపించిన సెంట్రల్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థకు ఆదివారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరూ సామాజిక భాధ్యతగా భావిస్తూ తమ వంతు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బెదిరింపులకు పాల్పడిన
నిందితులపై కేసు నమోదు

నవతెలంగాణ-వనస్థలిపురం

ఓ ఇంటి పైకొచ్చి అసభ్య పదజాలంతో ఓ తల్లి కుమారుడిని చంపుతామని బెదిరింపులకు పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ మేరకు వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఐజీ ఫేస్ ఫోర్ ప్లాట్ నెంబర్.216 లో మైరాజ్ బేగం తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. శనివారం రాత్రి11.30 నిమిషాలకు గుండాల ఆనంద్, నిట్టల రంగ నాథ శర్మ, తన్నీరు లక్ష్మీనారాయణ, నేలపాటి రాజేష్, ఆకుల సంపత్, రమావత్ బాలరా వాళ్లతో కలిసి సుమారు పదిమంది యువకులు తన ఇంటి మీదకు వచ్చి అసభ్యకర పదజాలంతో మద్యం మత్తులో తన చిన్న కుమారుడు ఎండి రియాజ్ ని అడిగి చంపి వేస్తామని బెదిరించారు. అందర్నీ భయభ్రాంతులకు గురి చేస్తూ అన్ని గదులు తనిఖీ చేశారు. మీ కొడుకు మా అమ్మాయిని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని బెదిరించ సాగారు. చుట్టుపక్కల వాళ్ళు 100కి కాల్ చేయగా స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆ నిందితులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారిని పోలీసులు స్టేషన్ కు తరలించారు. మైరాజ్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



నవతెలంగాణ -ఘట్కేసర్

డాక్టర్ బీఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వలనే భారతదేశం.. ప్రజాస్వామ్యంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని సంస్కతి టౌన్షిప్ అధ్యక్షుడు బి.హరి ప్రసాద్‌రావు అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 109వ వారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరి అంబేద్కం "విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంతో పోటీ పడుతుంది అంటే అది డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వలనే అని హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ కొన్ని వర్గాల కోసం మాత్రమే రాజ్యాంగం రాయలేదు..దేశంలోని అన్ని వర్గాల వారి కోసం, దేశ ప్రగతికోసం రాశారని గుర్తుచేశారు. అందరూ భారత రాజ్యాంగాన్ని అనుసరించు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న యం.అరుణ్ కుమార్ ను ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మేకల దాస్, కే.నర్సింగ్ రావు, ఇరిటం శ్రీనివాస్, మీసాల రాజేష్ కుమార్, ఎం.యాదగిరి, ఎస్.సాయి రాజ్ నాయక్, చిలుకమారి గణేష్, చల్లాపురం నారాయణ, జి.పరందాస్, ఎం.జాం నాయక్, కే.అర్జున్, టి.లింగం, వై.వెంకటేశ్వర్ రావు, ఎస్.కష్ణం రాజు, కే.మహిపాల్ పాల్గొన్నారు.

విశ్వకర్మ మహాసభ కార్యాలయంలో మాతృ దినోత్సవం



నవతెలంగాణ- వనస్థలిపురం

అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ మహాసభ రాష్ట్ర మహిళా రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు బోనాల ఇందిరా, అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ గౌరవ అధ్యక్షురాలు సావిత్రి పట్నాలను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ లీగల్ అడ్వైజర్ పగిడోజు భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

రవీందర్ రెడ్డికి బీజేపీ నేతల సన్మానం

నవతెలంగాణ- సంతోష్ నగర్



ఖేలో భారత్ పోటీల సందర్భంగా వాలీ బాల్ క్రీడాపోటీల్లో జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన మాజీ క్రీడా కారుడు, మలక్ పేట్ బీజేపీ సీనియర్ నాయకుడు కొత్తకాపు రవీందర్ రెడ్డిని బీజేపీ అగ్రనాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విక్టరీ ప్లే గ్రౌండ్ లో నిర్వహిస్తున్న ఖేలో భారత్ పోటీల సందర్భంగా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, బీసీసీ చైర్మన్ హనాజ్జు రవీందర్‌ను జ్ఞాపికతో సత్కరించారు. సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి భర్త అయిన ఆయన గతంలో బ్యాంక్ ఉద్యోగిగా పనిచేసిన సమయంలో జాతీయ వాలీ బాల్ పోటీల్లో పాల్గొని సత్తాచాటడమే కాకుండా...తమ జట్టు పలుమార్లు గెలవడంలో కీలకపాత్ర పోషించినట్లు చెప్పారు. బ్యాంక్ ఉద్యోగిగా విరమణ పొందిన తర్వాత రాజకీయాల్లో క్రియాశీలకంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

హనుమాన్ జయంతిలో అన్నదానం

నవతెలంగాణ- ఘట్కేసర్



హనుమాన్ జయంతి సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ గీత మందిరంలో ఆంజనేయ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ భక్తులకు అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మన్నే సత్తి రెడ్డి, ఆలయ నిర్వాహకులు వెంకట్ రెడ్డి, ఆలయ అర్చకులు, స్వాములు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ చైర్మెన్ రవి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - చైతన్యపురి



తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి జన్మదిన వేడుకలను ఆదివారం ఎల్బీనగర్‌లో మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు నక్క మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రథసారథి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రఉద్యమ శిఖరం, సబ్బండ వర్గాల గొంతుక పిడమర్తి రవి అని కొనియాడారు. ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చరణ్, నక్క దిలీప్, మనోహర్, అశోక్, ఆది మల్ల లింగస్వామి. శివ రామ్, నక్క నితీష్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్ మాదన్నపేట్ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద సరూర్‌నగర్ బీఆర్ఎస్ మైనార్టీ లీడర్ షేక్ అస్లం షాపు అర్బాన్ కీస్ గోల్డెన్ ఓపెనింగ్‌కు ఆదివారం ముఖ్య అతిథులుగా సరూర్ నగర్ బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఐ.అంకిరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ మైనార్టీ లీడర్ మహమ్మద్ సలీం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహేందర్ గౌడ్, ఆరిఫ్, అన్వర్, ఉస్మాన్, అష్రఫ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

(నవతెలంగాణ- చైతన్యపురి)

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ- సంతోష్ నగర్

వైశాఖ బహుళ దశమి పురస్కరించుకొని హనుమాన్ జయంతిని కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి సింధూరాభిషేకం చేశారు. తర్వాత దర్శనానికి, అర్చన, ఆకు పూజలు జరిపించుకోవడానికి భక్తులు వేలాది సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాస శర్మ, అర్చకులు, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

రాజీవ గృహకల్ప సహభావన టౌన్షిప్
సీ బ్లాక్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్ బండ్లగూడలో ఉన్న రాజీవ గృహకల్ప సహభావన టౌన్షిప్‌లోని సి బ్లాక్ యజమానుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నికలను ఆదివారం గహనిర్మాణ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ బ్లాకులో 846 ఫ్లాట్స్ ఉన్నాయని, 610 మంది యజమానులు మాత్రమే ఓటు హక్కు అర్హత కలిగి ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎండీ జబ్బార్ తెలిపారు. ఈ కమిటీలో ఏడు మంది కార్యనిర్వాహక సభ్యులతో పాటు మరో ఎనిమిది మందిని కార్యవర్గ సభ్యులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. రెండు కార్యనిర్వాక సభ్యులను, ఏడు మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, మిగిలిన 6 మందికి ఆదివారం ఎన్నికలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షులుగా పోటీలో ఉన్న ఏం సైదమ్మ పై, వి శ్రీనివాసరావు 210 ఓట్ల మెజారిటీతో గెలిచారని చెప్పారు. ఉపాధ్యక్షులుగా ఎల్. శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శిగా బి. వెంకన్న, కోశాధికారిగా పూజిత, సంయుక్త కార్యదర్శి ఆర్ సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నందు నాయక్, సహాయ కోశాధికారిగా ఆనందితలతో పాటు మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి వివరించారు. ఈ నూతన కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగు తుందని, వెంటనే వారికి బాధ్యతను అప్పగించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'నారపల్లి భూ బాధితులకు న్యాయం చేయాలి'

నవతెలంగాణ- ఉప్పల్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండల పరిధిలోని నారపల్లి సర్వే నెంబర్ 48లో గల దళితుల భూమిని దగాచేసి దోచుకున్న రాయలసీమ పులివెందుల కడప రెడ్డిల మాఫియా చెర నుండి విడిపించి, న్యాయం చేయాలని న్యూ రూషలేము షెల్టర్స్ లే అవుట్ యాజమాన్యం, సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూ బాధితురాలు సారా సుభాషిణి మాట్లాడారు. నా భర్త కలువూ ప్రభుదాను, మరికొందరు కలసి 2001లో అప్పులు చేసి కొన్న భూమిలో ఏర్పాటుచేసుకున్న 'న్యూ జెరూషలేము షెల్టర్స్' పేరుగల పంచాయతీ అప్రూవ్డ్ ప్రవేటు లేఅవుట్‌ను 2012-2013 డెవలప్మెంట్ చేసి అధిక లాభాలు ఇస్తామని నమ్మించి గజం భూమి రూ. 8 వేలు ఖరీదు ఉండగా.. మాకు కేవలం రూ. 1400 మాత్రమే చెల్లించారని ఆరోపించారు. తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకొని 10 ఏళ్లగా డెవలప్మెంట్ అపార్ట్మెంట్ లు కట్టకుండా నిర్లక్ష్యం చేస్తూ, అప్పుల బాధతో నా భర్త చనిపోవడానికి కారణమైన వారిపై మర్డర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వివిధ కారణాలు సాకుగా చూపి 24,000 గజాల భూమిని జనార్దన్ రెడ్డి, బాల చంద్ర శేఖర్ రెడ్డి, వారి అసిస్టెంట్ బాలరాజు వారి బంధువులు, డాక్టర్ భద్రారెడ్డి అతని బంధువులకు రిజిస్ట్రేషన్ చేపించి యుండగా, డాక్టర్. భద్రారెడ్డి మోసం చేశాడని భద్రారెడ్డి ఓ పోలీస్ అధికారి కలసి బిల్డర్ శ్రీనివాస్ రెడ్డి తాజాగా శ్రీనాద్ యాదవ్, భూనగరి తదితరులు కబంధ హస్తాలలో చిక్కుకొని, అతితక్కువకు భూమిని కోల్పోయిన బాధితులకు భూమిని తిరిగి అప్పగించాలని కోరారు.10 ఏళ్ల తర్వాత ఇప్పుడు మా భూమిని మాకు తెలియకుండా ఇతరులకు అమ్ముకొని మాకు మరింత ద్రోహం చేయాలని చూస్తున్న కుట్రదారులను అడ్డుకోవాలని కోరారు. అదేవిధంగా మొదటి నుంచి మా భూమి విషయంలో తప్పుడు ఆధారాలు, నకిలీ ఫ్యామిలీ ట్రీతో మా లే అవుట్‌కు అభ్యంతరాలు కలిగిస్తున్న సిండికేట్ ముస్లింలు, వారితో కుమ్మకైన రాంరెడ్డి తదితర మధ్యవర్తుల కుట్రల వలన మేము పూర్తిగా ఆర్థికంగా, మానసికంగా హింసించబడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగే వరకూ ప్రభుత్వం, రాజకీయ నాయకులు, రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా, ప్రజా సంసంఘాలు సహకరించాలని ఆమె వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జోసెఫ్ ఆల్ఫ్రెడ్, డెబోరా పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ రోడ్డులో పారుతున్న మురుగు

నవతెలంగాణ- సంతోష్ నగర్





యాకుత్ పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని క్రిస్టల్ బార్ ఎదురుగా కరూర్ బ్యాంక్, ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని రోమాన్ రెస్టారెంట్ వద్ద ప్రధాన రహదారిలో మురుగు రోడ్డుపై పారుతోంది. చంపాపేట్ డివిజన్ దుర్గ భవాని నగర్ కాలనీ ప్రధాన రహదారిలో పైపు లైన్ ద్వారా ఎలక్ట్రికల్ పైప్ లైన్ ఏర్పాటు చేస్తూ మరమ్మత్తు చేయకుండా కరూర్ బ్యాంక్ సమీపంలో ఉన్న ప్రధాన నాలాలోకి చేరాలి. అయితే స్థానికంగా అధికారులు అనాలోచితంగా ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ కార ణంగా నిత్యం ఉదయం, సాయంత్రం మురుగు రోడ్డుపైకి చేరుతోంది. స్థాని కంగా పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో ఇప్పటికి మూడుసార్లు పైపులైన్ పునర్నిర్మించారు. అయినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో మరోసారి సంతోష్ నగర్ డివిజన్ ప్రధాన రహదారి కరూర్ బ్యాంక్ వద్ద 300 మీటర్ల పొడవునా మురుగు రోడ్డుపై పారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు, బ్యాంకుకు వచ్చే లబ్దదారులు ఇబ్బందులు పడుతున్నారు.ాన రహదారిపై దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ సామర్థ్యం పెంచి, మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నవతెలంగాణ
మల్కాజిగిరి
సోమవారం 15 ఏప్రిల్ 2023

బాలమల్లును పరామర్శించిన మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లును ఆదివారం మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న బాలమల్లును ఆయన నివాసంలో హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ , ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్ర కుమార్ రమావత్ కలిసి మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో మాజీ మేయర్



నవతెలంగాణ- కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యురాలు, ప్రముఖ నటి విజయశాంతి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, మేకల హనుమంత రెడ్డి, గోపు సదానందం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను జల్లెడ పడుతున్న క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ బస్తీ నిద్ర కార్యక్రమంలో సమస్యలను జల్లెడ పడుతున్నారు. గత ఏడు వారాలుగా పలు ప్రాంతాల్లో బస్తీలలో కాలనీలలో నిద్ర కార్యక్రమం నిర్వహించి సమస్యలను తెలుసుకొని దాదాపు సమస్యలు పరిష్కారం చేశారు. ఇందులో భాగంగానే 7వ వార్డు సాయిబాబా హట్స్ లో కూడా 8వ నిద్ర కార్యక్రమాన్ని చేశారు. కార్యక్రమంలో స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొని అనేక సమస్యలను మన్నే క్రిశాంక్ దృష్టికి తీసుకెళ్లారు ఈ కార్యక్రమంలో 500ల మంది స్థానికులు పాల్గొని తొలగించిన ఓట్ల విషయంపై పేర్కొన్నారు . ఈ విషయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు తెలంగాణ మంత్రి కేటీఆర్ లేఖ రాసారని క్రిశాంక్ తెలిపారు. స్థానికులు బస్తీలో తమకు డ్రయినేజీ, నీటి సమస్యలు ఉన్నాయి చెప్పారు కార్యక్రమంలో మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ పాల్గొని స్థానికులు చెప్పిన సమస్యలు విన్నారు. యువకుల అభ్యర్థన మేరకు, క్రిశాంక్ వారికి వాలీబాల్ కిట్‌ను అందజేశారు. అనంతరం స్థానికులతో కలిసి కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కంటోన్మెంట్ మాజీ బోర్డ్ మెంబర్ పి.శ్యామ్ కుమార్, సాయి కుమార్, రాజు, గణేష్, సాయి, శేఖర్, మోని, రఘు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి, గురు నానక్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్



నవతెలంగాణ- కాప్రా

అనుమతి లేకుండా యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల నుండి అక్రమ ఫీలు వసూలు చేస్తున్న శ్రీనిధి, గురు నానక్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి అని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈసీఐఎల్‌లో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ ఎలాంటి గుర్తింపు లేని యూనివర్సిటీ పేరుతో మోసం చేస్తూ అక్రమంగా ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న శ్రీనిధి, గురు నానక్ విద్యా సంస్థల వల్ల వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు యూనివర్సిటీల యాజమాన్యాలు విద్యార్థులకు అడ్మిషన్ ప్రక్రియ నుండి ఐడెంటిటీ కార్డు మొదలుకొని ఫీజు రసీదు వరకు అన్ని యూనివర్సిటీల పేరుతో నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న యూనివర్సిటీ కళాశాల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను గుర్తింపు లేని యూనివర్సిటీల నుంచి కాపాడకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాథోడ్ సంతోష్, బ్యాగరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాము, వంశీ, సహాయ కార్యదర్శులు మనోజ్, అజయ్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి బీఎల్ఆర్ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావు నగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రమేశ్ చారి కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గోలి శ్రీను, బేతాళ బాల రాజు, పాషా, శ్రీశైలం, మహేష్, నవీన్, జంపాల్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, నవీన్, ముత్యం రాజు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిలో మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ పరిధిలోని పలు దేవాలయాలను మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి సందర్శించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అదేవిధంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో జమ్మిగడ్డకు చెందిన కుందనపల్లి నర్సింహా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమంలో పావని మణిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఈవో వీరయ్య, షేర్ మనెమ్మ మల్కా రమాదేవి, బాలమని, చేప్యాల నాగేశ్వర్‌రెడ్డి, పెంచాల సురేందర్‌రావు, సింగం రాజు, మురళి పంతులు, రాజి రెడ్డి, మోగులయ్య, యాదగిరి, వెంకట్ రాజు, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ గుప్త పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య కార్డులు నమోదు



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ కాలనీలో తెలంగాణ భవన నిర్మాణ సంఘం, సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య కార్డులు నమోదు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ ఉప్పల్ అధ్యక్షుడు చిగుళ్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. రెక్కాడితేనే కానీ డొక్కాడే కష్టజీవులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవడంతో పలు సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అలాంటి వారి కోసం సీఎస్ సీ హెల్త్ కేర్ ప్రత్యేక చొరవ తీసుకుని కార్మికులకు ఆరోగ్య పరీక్ష కార్డులను నమోదు చేయడం అభినందనీయమన్నారు. అంతేకాదు ప్రతి వారం వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయిలు, ప్రభాకర్ రెడ్డి, సీఎస్ సీ హెల్త్ కేర్ సిబ్బంది అరుణ, శ్రీకాంత్, భీమ్ రెడ్డి, ప్రేమ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

మంటలార్పడానికి వెళ్తే..

అట్టపెట్టెల్లో రూ. కోట్లు

నవతెలంగాణ- కంటోన్మెంట్

ఓ ఇంట్లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. ఆ మంటలను ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక పోలీసులకు ఘటనా స్థలంలో అట్టపెట్టెల్లో కోట్ల రూపాయాలు కనిపించాయి. వివరాల్లోకి వెళ్లితే.. మెంటల్ బజార్‌లోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఆ మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లారు. మంటలు తగ్గిన వెంటనే ఆ ఇంటి కుటుంబీకులు హడావిడిగా బెడ్రూంలోకి వెళ్లారు. అక్కడ అట్ట పెట్టలో ఉన్న డబ్బు అంతా సరిచూసుకుంటున్నారు. అది కాస్త అగ్నిమాపక పోలీసుల కంట పడింది. దీంతో వెంటనే వారు గోపాలపురం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ ఇంట్లో కోటీ 65లక్షలా 40వేల నగదు, బంగారం, వెండి ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ కుటుంబానికి సంబంధించిన శ్రీనివాసరావు ఓ కంపెనీలో సీఈఓగా పనిచేస్తున్నాడని,అలాగే ఒక ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా కూడా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఇంట్లో దొరికిన డబ్బు అంతా హవాలా డబ్బు అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాసరావు వైజాగ్‌లో ఉన్నట్టు కుటుంబ సభ్యులు చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి మంది రంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతథులుగా కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకన్న , స్థానిక నాయకులు గడి యారం రామక్రిష్ణ, దండెం నరేందర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, డిఫెన్స్ కాలనీ, వాయుపురి సొసైటీల అధ్యక్షులు నిమ్మగడ్డ విజయ సారథి, టి.జే రెడ్డిలు అన్నారు. మాతదినోత్సవాన్ని పురస్కరించుకొని మాతత్వ మెటర్నిటీ జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నూతన ఆపరేషన్ థియేటర్, మహిళా విభాగానికి చెందిన వార్డ్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. పలు కారణాలతో మహిళలు మాతత్వానికి దూరమవుతున్నారని, అలాంటి వారికి ప్రత్యేక చికిత్స ద్వారా సంతానం అందించేందుకు మాతత్వ మెటర్నిటీ హాస్పిటల్ ను ఎండి డాక్టర్ ప్రసన్నలక్ష్మి కషి చేయడం అభినందనీయమన్నారు. యాప్రాల్ , అమ్ముగుడా, నిర్మల్ నగర్, డిఫెన్స్ కాలనీ, వాయుపురి, నేరేడ్మెట్, సైనిక్ పురి, తులసి గార్డెన్, కందిగూడా తదితర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా మాతత్వ హాస్పిటల్ నిర్వహించడం సంతోషమన్నారు. సంతానం కోసం నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామనిడాక్టర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నారెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డిఫెన్స్ కాలనీ సొసైటీ సభ్యులు శివయ్య, ప్రకాష్ రెడ్డి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని చాణిక్యపురి కాలనీ పక్కన దుర్గామాత టెంపుల్ వద్ద నిత్యం డ్రైనేజీ మురుగు రోడ్లపై పొంగిపొర్లుతుంది. ఈ మేరకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని స్థానికులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జనాభా పెరిగిపోవడంతో గతంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ సామర్థ్యం తగ్గిపోయి..ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి డ్రైనేజీ పొంగిపొర్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నూతన డ్రైనేజ్ నిర్మాణాన్ని చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, ఎండి ముబాన్, అజీమ్, శ్రీనివాస్, ప్రవీణ్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

వీహెచ్ పీఎస్ ఆధ్వర్యంలో

మాతృ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో ఆదివారం మల్కాజిగిరి జీహెచ్ఎంసీ కార్యాలయంలో మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగ మాతృ మూర్తులు ఎచ్.సీతామహాలక్ష్మి, బి.లక్ష్మీ బి.కే.పద్మ దుర్గమ్మ, లావణ్య, నాగమణి, రేణుకలను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగ మాతృమూర్తులను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఎస్.శాంతా బాయి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కే.నర్సింహులు, జి.నర్సింహ, ఆర్.రామ కుమార్, వరలక్ష్మి, పూజా తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను

ప్రతి ఒక్కరూ అనుసరించాలి

- కీసర ఉప సర్పంచ్ తటకం లక్ష్మణ్ శర్మ



నవతెలంగాణ- మేడ్చల్ కలెక్టరేట్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కీసర ఉప సర్పంచ్ తటకం లక్ష్మణ్ శర్మ అన్నారు. కీసర మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి 'వారం వారం పూలమాల' కార్యక్రమంలో భాగంగా ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వించ దగ్గ గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ ఆశయాలను కొనిసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎం.రవీందర్, చినింగని యాదగిరి, కీసర గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శీలం లలిత మల్లేష్, కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్, కీసర బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మెట్టు పరమేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గణేష్, 108 సిబ్బంది చిత్రం రవి, పిన్నింటి లక్ష్మారెడ్డి, చినింగని మైసయ్య, శీలం భూపాల్ తదితరులు పాల్గొన్నారు

లక్ష్మమ్మకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ నివాళి



నవతెలంగాణ-నాచారం

హైదరాబాద్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎంబీ కష్ణ యాదవ్ మాతమూర్తి మన్నెబోయిన లక్ష్మమ్మ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ జంగా కష్ణమూర్తి యాదవ్ ఆదివారం ఎంబీ కష్ణ యాదవ్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్ సతీష్, రాష్ట్ర యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బొబ్బల గోపాలకష్ణ యాదవ్, శకుంతల మూవీ నల్లగొండ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మేకల యాదయ్య యాదవ్, దొడ్డబోయిన రాములు యాదవ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్‌ను లండన్ ఇండియా వీక్ సమ్మిట్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు.

నవతెలంగాణ-కాప్రా

సాకేత్‌లో దొంగల హల్చల్...

- సోదరి రిసెప్షన్‌కు వెళ్ళి వచ్చే సరికి ఇల్లు ఖాళీ



నవతెలంగాణ - జవహర్‌నగర్

సాకేత్ కాలనీ ఫేజ్-1లో దొంగలు హల్చల్ చేశారు. సోదరి రిసెప్షన్కు వెళ్ళి వచ్చేసరికి దొంగలు ఇల్లు ఖాళీ చేశారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మధుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... జమ్మిగడ్డలోని సాకేత్ కాలనీ ఫేజ్-1లో కొలిచిన రామసుబ్బ నరసింహశాస్త్రీ కుటుంబసభ్యులతో కలిసి నివాసిసున్నారు. ఆయన సాఫ్ట్‌వేర్‌ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తాజ్‌లో తన సోదరి రిసెప్షన్కు కుటుంబసభ్యులతో కలిసి వెళ్ళాడు. అర్ధరాత్రి ఇంటికి తిరిగి రాగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని చూసి ఇంటి యజమాని దొంగలు పడ్డారని గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చెరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి క్షూస్టంతో వివరాలు సేకరించారు. 6 తులాల బంగారు ఆభరణాలు, 2కేజీల వెండి వస్తువులు, 3 ల్యాప్ ట్యాపలు దొంగలించినట్టు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హనుమాన్ జయంతిలో

కమిషనర్ నవీన్ మిట్టల్ దంపతులు



నవతెలంగాణ- మేడ్చల్ కలెక్టరేట్

హనుమాన్ జయంతి సందర్భంగా చీర్యాల లక్ష్మీ నసింహా స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆర్థిక రిజిస్ట్రేషన్ల శాఖ చీఫ్ ల్యాండ్ కమిషనర్ నవీన్ మిట్టల్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి వారి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త హరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళిని పరామర్శించిన రామ్మోహన్



నవతెలంగాణ-కాప్రా

కాప్రా శ్రీరామ్ నగర్ కాలనీ అధ్యక్షుడు సిహెచ్ చంద్రమౌళికి హార్ట్ ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం చంద్రమౌళిని తన నివాసంలో కలిసి పరామర్శించారు. మాజీ మేయర్ వెంట బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి గొల్లూరి అంజన్న, తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మచ్చ పాండుగౌడ్, చిందం బాల నరసింహ వంశరాజ్, రాజు వంశరాజ్ తదితరులు ఉన్నారు.

కలాలకు విరామం ఉండదు

నవతెలంగాణ-కల్చరల్



సామాజిక చైతన్యం గల రచయితల కవుల కలాలకు విరామం ఉండదని శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ అన్నారు. రవీంద్రభారతి లోని సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ నిర్వహణ లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కందుకూరి శ్రీరాములు, సంపత్ కుమార్ సంకలనం చేసిన కవి వారం కవితా సంకలనం సంపుటి అవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ మట్టిలోనే కవిత్వపు వాసనలు ఉన్నాయన్నారు. సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్ధ రెడ్డి సంపుటిని ఆవిష్క రించి మాట్లాడుతూ యాభై పైగా కవితలు సంపుటి లో వున్నాయని ప్రతి కవితా భావవ్యక్తీకరణ తో ఉందని అన్నారు. కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహించిన సభ లోఎస్.రఘు విద్య వతి తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-బంజారా హిల్స్



జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని చత్రపతి శివాజీ నగర్, ఫిలింనగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కార్యకర్తలు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నేటి నుంచి
ఇంటర్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ సెంటర్స్ టోర్నమెంట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా మే 15(నేటి) నుండి 19 వరకు ఇంటర్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ సెంటర్స్ టోర్నమెంట్‌ను ఐదు రోజులపాటు 16 గేమ్స్ ద్వారా నిర్వహిస్తుంది. ఇంటర్ టోర్నమెంట్‌లో బాస్కెట్‌బాల్ ,బ్యాడ్మింటన్, బాక్సింగ్ క్రికెట్ ,చెస్ ,క్యారమ్స్ ,ఫుట్‌బాల్ ,జిమ్నాస్టిక్స్ ,హాకీ ,కబడ్డీ, రోలర్ స్కేటింగ్ , సెపక్‌తక్రా, టేబుల్ టెన్నిస్ టెన్నిస్, టెన్నికోయిట్, వాలీబాల్ నిర్వహిస్తారు. నగర వ్యాప్తంగా జీహెచ్ఎంసీ 2023 సంవత్సరంలో 6 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల పిల్లలకు సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను 37 రోజుల పాటు 44 క్రీడల్లో 915 సెంటర్లలో ఉదయం 6:15 గంటల నుండి 8:15 గంటల వరకు 77 పార్ట్ టైం కోచ్‌లు, 712 హానరేరియం కోచ్‌ల ద్వారా నిర్వహించడం జరుగుతుంది. విద్యార్థుల ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపు నందు షటిల్ బ్యాడ్మింటన్ ,రోలర్ స్కేటింగ్ క్రికెట్ , టెన్నిస్ రూ.50/-కు,మిగతా గేమ్స్ కు పది రూపాయలు చెల్లించి శిక్షణ పొందవచ్చును. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ www.sports.ghmc.gov.in లో చేసుకోవాలి.

ఖైరతాబాద్‌జోన్‌లో షటిల్ బ్యాడ్మింటన్ గేమ్, అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, విజయనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, షేక్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాపూర్ ప్లేగ్రౌండ్, హిందీ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

ఓయూలో ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మేడితపల్లి విజయ్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యమంలో ముందుండి విద్యార్థులను కదిలించిన ఉద్యమ నేత, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అభ్యున్నతి గురించి ఎన్నో ఉద్యమాలు చేసిన పిడమర్తి రవి జన్మదినం ఆర్ట్స్ కాలేజ్ దగ్గర నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్ మాట్లాడుతూ బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవన్న నిండు నూరేండ్లు సబ్బండ వర్గాల సమస్యలపై పోరాటం చేసి వారి అభివృద్ధిని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ప్రజలకు చూపించాలని, ఈ వర్గాల గురించి చట్టసభల్లో గలమెత్తాలని అదేవిధంగా ఆయురారోగ్యాలతో , సుఖ సంతోశాలతో ఉండాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బహుజనులకు డాక్టర్ పిడమర్తి రవి మరో కాన్షిరాం అని అన్నారు. వేడుకల్లో బీఎస్ ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, ఓయూ అధ్యక్షులు జోగు నరేందర్, రాష్ట్ర నాయకులు మంగళపల్లి ప్రవీణ్, చెవుల కిషన్, బాలస్వామి, ప్రసాద్, కల్వకుర్తి శ్రీశైలం, సేనాపతి, గోవిక్, సైదులు, శ్రీకాంత్, రాజేష్, గోవర్దన్, విజయ్ కుమార్, రాజు, ప్రవీణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భాషను చిన్నారులకు సరైన రీతిలో నేర్పించాలి

- కవి సమాగమంలో వక్తలు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



మైత్రి సంస్థ (అట్లాంటా యూఎస్ఏ) నవ్య సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కోటీలోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాష నిలయంలో కవి సమాగమం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత గేయ కవి సీనీకవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మండే గీష్మలో మళయ మారుతంలా కవి సమాగమం సాగిందన్నారు. మైత్రి సంస్థ వ్యవస్థాపకులు చిలువేరు జాతీయ సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైత్రి, జనని సంస్థల ఆధ్వర్యంలో ఒక కవికి పురస్కారం ప్రతీ ఏడాది అందిస్తామన్నారు. కలలు, కవితలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రముఖ రచయిత్రి స్వాతి శ్రీపాద మాట్లాడుతూ.. భాషను చిన్నారులకు సరైన రీతిలో నేర్పించడం పెద్ద బాధ్యత అని గుర్తు చేశారు. ఆచార్య గౌరీ శంకర్, ప్రముఖ కవి రాపోలు సుదర్శన్, శైలజ, మాధవరావు, కామేశ్వరరావు, రంగయ్య, రామకష్టారావు, సుందరయ్య సాధన నరసింహచార్య, భానుప్రకాష్, శారద, సాయి, విజయ్ కుమార్ పాల్గొన్నారు

అనాథలు, అభాగ్యులను ఆదుకోండి



నవతెలంగాణ - అడిక్ మెట్

అనాథలు, అభాగ్యులను ఆదుకోండి అని స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 228వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ అనాథలను, అభాగ్యులను ప్రతీ ఒక్కరు ఆదుకోవాలని కోరారు. వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు ఖుషి కోమల్, వర్షిత రెడ్డి, దివ్య శ్రీ,, ఇర్ఫాన్, అఖిల్, జతిన్, శుభం, చరణ్ తదితరులు పాల్గొన్నారు

హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం

నవతెలంగాణ-ఓయూ



హనుమాన్ జయంతి సందర్భంగా తార్నాక చౌరస్తాలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బీజేపీ సీనియర్ నాయకురాలు విజయశాంతి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బండ చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విజయశాంతి, రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమంలో 3000 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు, హరి వీరన్న, జిల్లా అధికార ప్రతినిధి శారదా మల్లేష్, ప్రభు గుప్తా, వినాయక్ నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, తార్నాక డివిజన్ ప్రెసిడెంట్ రాము వర్మ , బీజేపీ నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన...

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ఇటీవలే విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 10/10 సాధిం చిన విద్యార్థి పి వినీత్ గుప్తాను ప్రజా ఏక్త పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

'విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన'ను సద్వినియోగించుకోవాలి

- విశ్వకర్మ సెల్ కో-కన్వీనర్ పడకంటి బ్రహ్మచారి

నవతెలంగాణ-అంబర్ పేట



పి.యం కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని రాష్ట్రంలోని విశ్వకర్మీయులు సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ సెల్ కో-కన్వీనర్, బీజేపీ సీనియర్ నాయకులు పడకంటి బ్రహ్మచారి కోరారు.ఆదివారం అంబర్ పేట్ లోని విశ్వకర్మ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మీయులకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఈ పథకాన్ని పల్లె పల్లెకు తీసుకెళ్ల డానికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం సాంప్రదాయ వత్తులపై ఆధారపడ్డ విశ్వకర్మ వర్గాల వారిని ఎంఎస్ఎంఈ వాల్యూ చైన్‌తో అనుసంధానిస్తారని, దేశవ్యాప్తంగా ఉన్న శిల్ప కళలను నమ్ముకున్న వారి నైపుణ్యాలను పెంపొందిం చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దష్టి సారించిందని పేర్కొన్నారు. ఈ పథకంపై విశ్వకర్మీయులకు పూర్తి అవగాహన పెంపొందించడానికి ఈ నెల 15న పి.యం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ సభను మల్లాపూర్ లోని వీఎస్ఆర్ గార్డెన్స్ లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు ఈటల రాజేందర్, బీజేపీరాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్, బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజు, బీజేపీ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మం పాల్గొంటారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో విశ్వకర్మ సెల్ ప్రతినిధులు చేరాల జలంధరా చారి, కొంపోజు గోవర్ధన చారి, నాంపల్లి సోమచారి, తల్లోజు చెన్నయ్య చారి, పరిపూర్ణ చారి, శ్రీరామదాసు వెంకటరమణ చారి, ఎం.మధుచారి, ఆవంచి మురళి చారి, రమణ, తదితరులు పాల్గొన్నారు.



40వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్షలు

నవతెలంగాణ-ఓయూ

మాణికేశ్వరి నగర్ భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామని మనికేశ్వరి నగర్ అఖిలపక్షం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 40వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు పలువురు సంఘీభావం తెలిపారు. మానికేశ్వరి నగర్ బస్తి ప్రజలు ఈ దీక్ష లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ యూత్ యూత్ వింగ్ ప్రెసిడెంట్ ఆలకుంట హరి దీక్షలో పాల్గొన్న వాళ్లకు పూలదండలు వేసి దీక్ష ప్రారంభించారు.

'ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగిస్తే భారీ ధర్నా చేపడతాం'

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ మోతినగర్ చౌరస్తాలో ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఆదివారం ఉదయం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ అధికారులు అక్కడ విగ్రహం ఏర్పాటు చేయటానికి ఎలాంటి అనుమతులు లేవని, ఎస్సార్ నగర్ పోలీస్ అధికారులను తీసుకొని వచ్చి విగ్రహాన్ని తొలగించుటకు ప్రయత్నం చేశారు .విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు భారీగా తరలివచ్చి అధికారులను , పోలీసులను అడ్డుకున్నారు. దాంతో విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాన్ని విరమించుకొని అక్కడి నుండి పోలీసులు, అధికారులు వెళ్లిపోయారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగిస్తే భారీ ధర్నా చేపడతాం ఈ సందర్భంగా టీడీపీ నాయకులు హెచ్చరించారు.

గోనె సాలమన్ రాజ్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



క్రైస్తవ కమ్యూనిటీతో సంబంధాలు కలిగి ఉండడంతోపాటు క్రైస్తవ కమ్యూనిటీ సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనే సాలమన్ రాజ్‌ను ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేయాలని పాతబస్తీ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోఠిలోని బ్యాంక్ స్టేట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు జోసెఫ్‌ఇన్యూయేల్. జయ కుమార్ జాకీ యస్. బి సాలామన్. ఎన్ జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ అన్ని మతాలకు సమానత్వం కల్పించినందుకు సీఎం కేసీఆర్ కు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో పాస్టర్లు కే వెంకటేష్ పాల్, సంపత్ కుమార్, జాషువా, జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు



ఆరె కటిక సంఘం అధ్యక్షుడిగా టీ నర్సింగ్ రావు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఆరె కటిక సంఘం జియాగూడ నూతన అధ్యక్షుడిగా టీ నర్సింగ్ రావును ఎన్నుకున్నారు. ఆదివారం ఏకే ట్రస్ట్ పెద్దల సమక్షంలో ఏకే భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయనను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘం అనుబంధ సంఘాలైన చర్మకష్ సంఘం, నవయువక సంఘం తదితర సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరె కటిక కులాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఈషా ఫెర్టిలిటీ సెంటర్ బ్రాండ్ అంబాసిడర్‌గా భూమిక



నవతెలంగాణ-బంజారాహిల్స్

మదర్స్ డే సందర్భంగా ఆదివారం ఈషా ఫెర్టిలిటీ సెంటర్ బ్రాండ్ అంబాసిడర్‌గా భూమిక చావ్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి తల్లి కావాలని ఆశ ఉంటుందని.. ఆ ఆశను ఈశా ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా నెరవేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'స్వయం సిద్ధ' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్



ప్రముఖ రచయిత్రి భండారు విజయ, పి. జ్యోతి రచించిన స్వయం సిద్ధ (ఒంటరి మహిళలు జీవిత గాథలు) పుస్తకా విష్కరణ సభ తెలంగాణ భాష సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ డాక్టర్ మృణళిని పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒంటరి మహిళలు తమ జీవితాన్ని ఏకాంతంగా మార్చు కున్నప్పుడే సంతోషంగా జీవించగలుగుతారని పేర్కొన్నారు. మహిళలు ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా జీవిస్తున్నారని వివరించారు. సమాజంలో ఒంటరి మహిళలపై సానుభూతి కాకుండా వారిని గౌరవించాలన్నారు. ఒంటరి మహిళ జీవిత గాథలను కథలను పుస్తకా రూపంలో తీసుకురావడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జతిన్ కుమార్, గీతాంజలి, డాక్టర్ భారతి, రుక్మిణి రావు, డాక్టర్ ఎస్. కామేశ్వరి, సుభద్ర దేవి పాల్గొన్నారు.

సెక్స్ రాకెట్ గుట్టు రట్టు

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్‌లోని వ్యభిచార ముఠా గుట్టు రట్టయింది. వివిధ ప్రాంతాలనుండి మసాజ్ థెరపిస్టుల పేరిట అమ్మాయిలను తీసుకువచ్చి ఓ అపార్ట్ మెంట్ ఫ్లాట్ లో గుట్టుగా వ్యభిచారం చేయిస్తున్నారు. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు ఫ్లాట్ పై దాడిచేశారు. వివరాల్లోకెళ్తే ఫిలింనగర్ రోడ్ నెంబర్ 9 లో సోమా కమల్ అనే వ్యక్తి అలివర్ స్పా పేరుతో మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈజీగా డబ్బులు సంపాదించేందుకు అతడు క్రాస్ మసాజ్ పేరిట విటులను ఆకర్షించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వారితో వ్యభిచారం చేయిస్తున్నాడు. ఇలా స్పా ముసుగులో జరుగుతున్నకార్యకలాపాల కోసం సుమంత్ అనే యువకున్ని మేనేజర్‌గా నియమించుకున్నాడు. అయితే ఈ దందాపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు స్పా సెంటర్‌పై దాడిచేసారు. ఇందులో వ్యభిచారం జరుగుతున్నట్టు నిర్ధారించుకుని నిర్వహకుడు, మేనేజర్ పై కేసులు నమోదు చేసారు. అలాగే స్పా సెంటర్‌ను సీజ్ చేసారు. స్పా సెంటర్లో పనిచేసే యువతులను రెస్క్యూ హోం కు తరలించారు.

'దోపిడీ కులాల రాజకీయ పార్టీలను ఓడించాలి'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణలో దోపిడీ కులాల రాజకీయ పార్టీలను ఓడించకపోతే నిమ్న జాతులకు సామాజిక బానిసత్వం తప్పదని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. ఆదివారం హిమాయత్ నగర్ లో పార్టీ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ తెలంగాణలో ఆధునిక నియంతతత్వం, సీఎం కేసీఆర్ దోపిడీ వల్ల అప్రజాస్వామిక అరాచక రాజ్యం నడుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ పార్టీతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై, అంతర్గతంగా మెజార్టీ దళిత బహుజన జాతులను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అణిచివేస్తున్నారని ఆరోపించారు. ఈ దోపిడీ కులాల రాజకీయ పార్టీల నాయకత్వం నుంచి దళిత జాతి విముక్తి కావాలని, లేకపోతే దళిత జాతికి అన్యాయం జరుగుతుందన్నారు.రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా ఓటు వేయాలని సూచించారు అంబేద్కర్ ఆశయ సాధనకు రాజకీయ పోరాటం చేస్తున్న దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి చట్ట సభలకు పంపాలని కోరారు. కర్ణాటక ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక, క్రిమినల్ మాఫియా పాలనపై ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారని, సెక్యులర్ ప్రజాస్వామ్య పార్టీలను ప్రజలు ఆదరించారని పేర్కొన్నారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ప్రజాస్వామ్యం ఉందని, కానీ తెలంగాణ కాంగ్రెస్‌లో ఆ పరిస్థితి లేదని అరాచకం, కుల దురహంకార ఉన్మాదులు ఉన్నారని, అంబేద్కర్ ఆలోచన, దళిత వ్యతిరేక, కుల ఆధిపత్య శక్తులు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ అన్నీ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. మాయావతి నేతత్వంలోని బీఎస్పీ మనువాదుల ఆర్ఎస్ఎస్, బీజేపీ ఏజెంట్, కార్పొరేట్ వ్యాపార వర్గ రాజకీయ దళారీ పార్టీ అని విమర్శించారు. బీఎస్పీ పట్ల తెలంగాణలోని దళిత జాతి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ నెల 17వ తేదిన న్యూఢిల్లీలో జరిగే పార్టీ జాతీయ కార్యవర్గ అజెండా, కార్యాచరణను అమలు పరచడానికి తమ పార్టీ క్యాడర్ సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ డాక్టర్ వీఎల్.రాజు, ప్రధాన కార్యదర్శి బీరం సతీష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిలివేరి వసంతరావు, డీబీఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, అధికార ప్రతినిధి దేవునూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మద్దెల ప్రవీణ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-అడిక్ మెట్



ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ వివేక్ నగర్ హనుమాన్ దేవాలయం, అడిక్ మెట్ సీతారామ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, ఆంజనేయ స్వామి దేవాలయం ఈవో దేవనాథం, చైర్మెన్ మురళి ప్రసాద్, ఆలయ చైర్మెన్ రవి యాదవ్, ముషీరాబాద్ డివిజన్ కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ శ్రీధర్ రెడ్డి, ఆకారం శ్రీనివాస్, వంశీ, సంతోష్, గోరక, రమణ, మహేష్, రాములు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పరశురాం, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రావు



నవతెలంగాణ-బంజారా హిల్స్

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పరశురాం, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రావులు మాట్లాడారు. 2016 ఫిబ్రవరి మాసంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 16 ప్రకారం తమను సైతం రెగ్యులర్ చేయాల్సి ఉండగా ఆయా యూనివర్సిటీల వీసీలు, కొందరు అధికారుల తీరుతో రెగ్యులేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని మండిపడ్డారు. జూనియర్ లెక్చరలతో సహా డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్లను సైతం రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం తమ పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ యూనివర్సిటీలలో కేవలం 10 శాతం మాత్రమే శాశ్వత ఉద్యోగులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో న్యాక్ అక్రిడేషన్ సైతం రాకపోవచ్చు అని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని 900 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూఏసీటీఎస్ అధ్యక్షులు పరశురాం,వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి
విద్యార్థులను తీసుకెళ్లడం సరికాదు'

నవతెలంగాణ-సిటీబ్యూరో



బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళానికి గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులను తీసుకెళ్లడం సరికాదని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) పేర్కొంది. ఈ మేరకు అదివారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఘట్‌కేసర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులను తీసుకెళ్లడమేంటని ఆయన ప్రశ్నించారు. ఒక పార్టీ కార్యక్రమానికి గురుకుల మహిళా డిగ్రీ విద్యార్థులకు సంబంధమేంటని? నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ సమావేశాలకు విద్యార్థులను పంపించిన ప్రిన్సిపల్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ తరపున ఆయన డిమాండ్ చేశారు. గురుకుల మహిళా డిగ్రీ కళాశాల అమ్మా యిలకు ఎలాంటి భద్రత లేకుండా పార్టీ మీటింగ్‌లకు పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దీనిపై సమగ్ర విచా రణ జరిపిం చాలని రాథోడ్ సంతోష్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్మిక శాఖ మంత్రి మల్లా రెడ్డి విద్యార్థులు పార్టీ కార్యక్రమాలు వచ్చేలా కాకుండా.. గురుకుల పాఠశాలలో కనీస మౌలిక సదుపా యాల్లేని హాస్టళ్లను గుర్తించి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలోని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని బీఆర్ఎస్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

ఐసీఎస్, ఐసీఎస్ఈలో బేగంపేట్ పబ్లిక్ స్కూల్ టాప్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఐసీఎస్, ఐసీఎస్ఈ-2023 పబ్లిక్ పరీక్షల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట విద్యార్థులు టాప్‌లో నిలిచారు. తమ స్కూల్ వందశాతం రిజల్ట్స్‌ను నమోదు చేసినట్టు ఆ స్కూల్ యాజమాన్యం ఆదివారం ఒక ప్రతిక ప్రకటనలో తెలిపింది. ఐసీఎస్ కామర్స్ స్ట్రీమ్‌లో రజిత వల్లూరి 483/500 (96.6శాతం) స్కోర్‌తో స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఎకనామిక్స్‌లో ఆమె 100 స్కోర్ సాధించారని తెలిపారు. హ్యుమానిటీస్ స్ట్రీమ్‌లో వల్లి లక్ష్మి సంజన పాండ్రాంగి 477/500(95.4 శాతం), కామర్స్ స్ట్రీమ్‌లో శ్రీనిధి కరమలపూడి 475/500(95శాతం), సైన్స్ స్ట్రీమ్‌లో మైథిలీ నంద 472/500(94శాతం) స్కోర్ సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఐఎస్‌సీ-2023లో 30 శాతం మంది విద్యార్థులు 90శాతం కంటే ఎక్కువ స్కోర్ చేశారు. 84శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. అలాగే ఐసీఎస్ఈ-2023లోనూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట విద్యార్థులు టాప్‌లో నిలిచారు. హిస్టరీ, సివిక్స్, జియోగ్రఫీ (హెచ్‌సీజీ)లో సార్థక్ లాంబా 594/600(99 శాతం) స్కోర్‌తో టాపర్‌గా నిలిచారు. గణితం, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఆద్య కొల్లిపార 593/600(98.8శాతం) రెండో టాపర్‌గా నిలి చారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు పబ్లిక్ స్కూల్ బేగంపేట యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపింది.



ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన వద్దే జంగయ్య (మ్యాకల కా డి) ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం ఈ విషయం ఉప్పల వెంకటేష్ మిత్రమండలి సభ్యుడు గ్రామ ఉప సర్పంచ్ అజీజ్ ద్వారా విష యం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ స్థానిక జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి రూ 3 వేల ఆర్థికసాయాన్ని, గ్రామ ఎంపీటీసీ మల్లికేడి అంబాజీ రూ.1000 వేల ఆర్థికసాయాన్ని, గ్రామ ఉపసర్పంచ్ అజీజ్ రూ.1000 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్య క్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అజీజ్, గ్రామ యువ నాయకుడు వద్దే రాజు, గ్రామస్తులు జంగయ్య, బొందయ్య వెంకటయ్య , రమేష్, దూల, శివ, శ్రీను , రవి తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ మాక్స్ కార్మికులకు అండగా ఉంటాం'



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గల సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు 76 రోజులుగా చేపడుతున్నటువంటి రిలే నిరాహార దీక్షలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. గత పది నెలలుగా సూపర్ మాక్స్ కంపెనీ యజమాన్యం కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను వెంటనే చెల్లించి, కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సూపర్ మాక్స్ కంపెనీ యజమాన్యాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రెడ్డి, జగదీష్ , చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి ,రవీందర్, పాండే ,బిహారి తివారి ,శివకుమార్ సింగ్ మరియు సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్ఆర్ జారీ దశలోనే..

- సిమ్యులేటర్ శిక్షణ తప్పనిసరి చేసే విధానానికి ఆర్టీఏ యోచన
- కరోనాతో ఖైరతాబాద్ ఆర్టీఏలో నిలిచిన సేవలు
- సేవల పునరుద్ధరణకు రవాణాశాఖ కసరత్తు
- త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి..



ఫైల్ ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్తగా డ్రైవింగ్ నేర్చుకునే వారికి సిమ్యులేటర్‌పైన శిక్షణ తప్పనిసరి చేయాలని రవాణాశాఖ భావిస్తోంది. ఈ దఫా లెర్నింగ్ లైసెన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు సిమ్యులేటర్‌పై శిక్షణ తీసుకుంటేనే ఎల్ఎల్ఆర్ జారీ చేసే విధానానికి ఆర్టీఏ అధికారులు ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి కరోనాతో నిలిచిపోయిన ఈ సేవలను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తేవాలనే యోచనలో అధికారులు ఉన్నారని తెలిసింది. ఈ మేరకు గతంలో ఖైరతాబాద్ ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మారుతీ సంస్థతో ఇప్పటికే రవాణా అధికారులు చర్చలు కూడా జరిపారు. శిక్షణ తరగతులు, ధరల విషయంలోనూ స్వల్ప మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం పునరుద్ధరణకు సంబంధించిన ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మరో వారం పది రోజుల్లో ఈ సేవలు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. సిమ్యులేటర్ శిక్షణపై రవాణాశాఖ మంత్రి సైతం ఎంతో ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు. దీంతో దశలవారీగా గ్రేటర్‌లోని 11 ఆర్టీఏ ఆఫీస్‌లతో పాటు మిగతా కార్యాలయాలకు విస్తరించే అంశంపై ఆర్టీఏ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

రోడ్డుపై వాహనాన్ని నడపడం కంటే ముందే డ్రైవింగ్‌లో మెళకువలను సిమ్యులేటర్‌పై ఇప్పించడం ద్వారా రెట్టింపు ప్రయోజనం కలగనుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రతి ఆర్టీఏ కార్యాలయంతో పాటు డ్రైవింగ్ స్కూళ్లలో సిమ్యులేటర్‌పై ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆలోచిస్తున్నారు. ప్రధానంగా లెర్నింగ్ లైసెన్సు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు సిమ్యులేటర్ శిక్షణ తీసుకునేలా ప్రోత్సహించాలని రవాణాశాఖ నిర్ణయం తీసుకుంది. రెండేండ్ల క్రితం కరోనా కారణంగా ఆర్టీఏ సేవలకు బ్రేక్ పడుతూ వచ్చాయి. మహమ్మారి కట్టడి చర్యల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు స్లాట్స్ సంఖ్య కుదించడంతో కార్యాలయాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య తగ్గిపోయింది. ఆఫీస్‌లకు వచ్చేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోవడంతో మారుతీ సంస్థకు సిమ్యులేటర్ నిర్వహణ భారంగా మారింది. ఆ సంస్థకు లాభాల మాట పక్కనపెడితే ఉద్యోగికి వేతనం ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ గందగోళ పరిస్థితుల్లోనే కోవిడ్ దెబ్బకు రవాణాశాఖ సైతం ఈ సేవలను నిలిపివేసింది. ప్రస్తుతం పరిస్థితులు మెరుగుపడడంతో తిరిగి ఈ సేవలను పునరుద్ధరించడంతో పాటు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. అయితే ఈసారి మాత్రం లెర్నింగ్ లైసెన్సు కోసం వచ్చేవారికి ముందుగా సిమ్యులేటర్‌పై శిక్షణ తప్పనిసరిగా చేయనుంది. అలాగే పాత రేట్లను సవరించనుంది.

వినియోగదారులపై కొంతమేర భారం..!

సిమ్యులేటర్ ద్వారా శిక్షణ పొందేవారికి అనేక అంశాలపైన స్పష్టమైన అవగాహన ఉంటుంది. సిమ్యులేటర్‌పై శిక్షణ ఒక ఊహజనితంగా ఉన్నప్పటికీ.. డ్రైవింగ్ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తుంది. ముఖ్యంగా రోడ్డు భద్రతా నిబంధనలు తెలిసే అవకాశం ఉంది. ఈ శిక్షణ ద్వారా నిజంగా



కారు నడిపే అనుభూతిని పొందుతారు. ఈ క్రమంలోనే 2018 అక్టోబర్‌లో ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రముఖ దిగ్గజ సంస్థ మారుతీ సుజుకీ దీనిని ఏర్పాటు చేసింది. రూ.50 చెల్లిస్తే 15 నిమిషాల పాటు సిమ్యులేటర్‌పై అవగాహన కల్పించేవారు. రూ.550 చెల్లిస్తే.. రోజుకు అరగంట చొప్పున ఆరు రోజులు పాటు శిక్షణ ఇచ్చేవారు. కాగా ఈ సిమ్యులేటర్ సెంటర్‌లో నెలకు 80-100 మంది శిక్షణ తీసుకోగా.. వెయ్యిమందికిపైనే డ్రైవింగ్‌లో మెళకువలు నేర్పించారు. ఈ సంఖ్య రోజురోజుకి పెరుగుతున్న క్రమంలోనే కోవిడ్-19 కారణంగా ఈ సేవలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ముఖ్యంగా సిమ్యులేటర్‌పై శిక్షణ తర్వాత వినియోగదారుడికి డ్రైవింగ్‌పైన భయం పూర్తిగా తొలగిపోతుంది. రోడ్డుపైన ఎలాంటి గందగోళం లేకుండా సులువుగా నేర్చుకోగలుగుతాడు. అతితక్కువ సమయంలో వీరికి రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపైన అవగాహన ఏర్పడుతుంది. ముఖ్యంగా వాహనదారులకు ఈ సేవలు ఎంతో ఉపయుక్తంగా మారడంతో తిరిగి ప్రవేశపెడుతున్నారు. ధరల విషయంలో గత పరిస్థితులను పరగణనలోకి తీసుకుని.. ఈసారి 15 నిమిషాల పాటు సిమ్యులేటర్‌పై ఇచ్చే శిక్షణకు రూ.50 బదులుగా రూ.100 పెంచడంతో పాటు రోజుకు అరగంట చొప్పున ఆరు రోజుల పాటు ఇచ్చే శిక్షణకు రూ.550 వినియోగదారుల నుంచి వసూలు చేస్తుండగా.. ఇప్పుడది వెయ్యి రూపాయల వరకు పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. వీటితో పాటు మరికొన్ని మార్పులు చేయనున్నారు. దీనిపై ఆర్టీఏ ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

సిమ్యులేటర్లతో ఎన్నో ప్రయోజనాలు..

సిమ్యులేటర్లతో వాహనదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వీటి ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా డ్రైవింగ్‌లో నైపుణ్యం కూడా సంపాదించుకోవచ్చు. అంతేకాకుండా ఏదో నామమాత్రంగా డ్రైవింగ్ నేర్చుకుని రోడ్డు మీదకు వచ్చేవారికి కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయి. డ్రైవర్లలో కొంత మంది నిరక్షరాస్యుల లాంటి వారికి వాహన రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక అవగాహన ఉండటం లేదు. వాహనాల్లో డీజిల్ మీటర్లు, గేర్ సిస్టం లేని సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సిమ్యులేటర్లో సెంటర్‌లలో వీటిపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై పక్కన ఉండే సైన్ బోర్డులు తెలుగు, ఆంగ్లం, ఊర్దు భాషల్లో గ్రామాలు, పట్టణాలు పేర్లు ఉంటాయి. ఇవి ఇతర రాష్ట్రాల్లో డ్రైవర్లకు అర్థం కావు. ఈ విషయంలో డ్రైవర్లకు కనీస పరిజ్ఞానాన్ని పెంపొందిస్తారు. రహదారి విస్తరణకు అనుగుణంగా వాహన వేగం ఎంత ఉండాలి? రోడ్డు పరిస్థితులను ఏ విధంగా అంచనా వేయాలి. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు డ్రైవింగ్‌లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి విషయాలపై అవగాహన కల్పిస్తారు. మరిముఖ్యంగా డొల్ల శిక్షణ సంస్థలకు(డ్రైవింగ్ స్కూళ్లు) చెక్‌పడనుంది.

ఐడీపీఎల్‌లో కుంభకోణం పై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలి

- సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్



నవతెలంగాణ - బాలానగర్

ఆసియా ఖండంలోనే పేరుగాంచిన అతిపెద్ద ఫార్మా కంపెనీ బాలానగర్ పారిశ్రామిక వాడలోని ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మసిటికల్ లిమిటెడ్ (ఐడిపిఎల్) మందుల పరిశ్రమలోని స్క్రాప్ విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై రిటైర్డ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సిఐటియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ అక్రమ విక్రయాలలో కేంద్ర ప్రభుత్వ అధికార పార్టీ పెద్దల హస్తం ఉన్నట్టు వస్తున్న ఆరోపణలపై న విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను, ప్రజలను ఐక్యం చేసి ఆందోళన ,పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు

కాలనీలలో మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- 58వ రోజు ఎమ్మెల్యే ప్రగతి యాత్ర



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ లో ప్రగతి యాత్రలో భాగంగా 58వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ నగర్, గణేష్ హౌసింగ్ కాలనీలలో పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులు పరిశీలించారు. కాగా శ్రీకృష్ణ నగర్‌లో కొత్త డ్రయినేజీ లైన్ , సీసీ రోడ్డు, మంజీరా పైప్ లైన్ ,గణేష్ హౌసింగ్ కాలనీలో రోడ్డు వెడల్పు , బీటీ రోడ్డు, కరెంటు పోల్ ,3 ఫేస్ లైన్, మ్యాన్ హెూల్స్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. అందుకు ఎమ్మెల్యే.. అక్కడే ఉన్న అధికారులకు వాటిపై చర్యలు తీసుకోవాలని తీసుకొని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ భాను చందర్, ఏఈ సురేందర్ నాయక్ , మేనేజర్ అనూష, కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

2024లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఎండీ నిజాముద్దీన్



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

నాడు హిమాచల్ ప్రదేశ్‌లో నేడు కర్ణాటకలో కాంగ్రెస్ విజయపరంపర కొనసాగించడంతో దేశంలో, రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా కాంగ్రెస్ మారనుందని 2024లో అధికారంలోకి రావడం ఖాయం అని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మైనారిటీ నాయకులు ఎండీ నిజాముద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ భారీ మెజార్టీ గెలవడంతో రంగారెడ్డి నగర్ డివిజన్ రంగారెడ్డి నగర్ చౌరస్తాలో టీపీసీసీ మాజీ కార్యదర్శి సువ్వారి శ్రీనివాస్, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అవినీతి, రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలోని సుస్థిరపలన సాధ్యమని అందుకు ఈ ఫలితాలు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మైనారిటీ ఇన్చార్జి ఫహీం ఖురేషి, మైనారిటీ నాయకులు ఎండీ అజీముద్దీన్, ఎండీ హుస్సేన్, ఎండీ రహమత్, హాజీ భాయ్ అబ్దుల్, ఎండీ ముక్తార్, ఎండీ ఇస్మాయిల్, మొహమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-దుండిగల్

బౌరంపేట్ సింహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ ట్రైనింగ్ సెంటర్ ను ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ గాజులరామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, రామ్ కుమార్, నర్సింహా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హనుమాన్ జయంతి సందర్భంగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్‌లో రామాలయంలో, శ్రీనివాస కాలనీ హనుమన్ దేవాలయంలో వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు సతీసమేతంగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు, కాలనీ వాసులు గాంధీ రావు, మూర్తి, గోపీచంద్, చక్రపాణి, వెంకటేశ్వర్ రావు, రాముడు, సుధాకర్, రామకష్ణయ్య, రాజగోపాల్ రెడ్డి, బుల్లయ్య, రవి, మాధవయ్య ఎల్లయ్య నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి అంకిత భావంతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలి



నవతెలంగాణ - కూకట్ పల్లి

యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ మేనేజర్ కే రాములు ఆధ్వర్యంలో ఎల్లమ్మబండ, జయశంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను వారి ఆహ్వానం మేరకు ఎన్వైకే రంగారెడ్డి జిల్లా, భారత ప్రభుత్వ సభ్యులు కుమార్ యాదవ్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి అంకితభావంతో కూడిన జీవితాన్ని నిర్మాణం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎర్పర్చుకొని ఆ లక్ష్యసాధన కోసం పనిని ప్రారంభించి మొక్కవోని దీక్షతో కృషి చేస్తే తప్పకుండా విజయం వరిస్తుందని అన్నారు. తల్లిదండ్రులతో గాని, అధ్యాపకులతో గాని, సమాజ పెద్దలతో గానీ మంచి ఆలోచనతో గౌరవంగా మాట్లాడే విధానాన్ని అలవర్చుకొని, క్రమశిక్షణతో ఉండి ఎలాంటి దురలవట్లకు లొంగకుండా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి దశలోనే జీవితాన్ని మంచి వైపు మలుపు తిప్పుకుంటే జీవితంలో అనేక విజయాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు పిరికితనంగా ఉండకుండా జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను సవాల్‌గా స్వీకరించి ధైర్యంగా ఎదుర్కోవడానికి మానసికంగా, భౌతికంగా సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీపతి నాయుడు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఎమ్మెల్సీ అభినందన

నవతెలంగాణ-దుండిగల్

పదో తరగతిలో ప్రతిభ కనబర్చి 10/10 గ్రేడ్ సాధించిన చింతల్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని వర్షిత వల్లిని ఆదివారం ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శంభీపూర్ కార్యాలయంలో అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, చింతల్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ రఫీ, రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

పేద వయోవృద్ధులకు ఆకలి తీరుస్తూ.. భరోసా కల్పిస్తూ..



నవతెలంగాణ-బాలానగర్

వయోవృద్ధులు తమ జీవిత అనుభవాలను, విజ్ఞానాన్ని సమాజాభివృద్ధికి పాటుపడుతూ మానవత్వంతో బతకడమే మానవ ధర్మమని తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘాల సమాఖ్య చాటి చెబుతోంది. శనివారం కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘాల సమాఖ్య నిరుపేద వయోవృద్ధులకు తామున్నామంటూ భరోసాను కల్పించేందుకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ ఎస్సై మక్బూల్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల ఆకలిని తీరుస్తూ, వయోవృద్ధులకు ఏ కష్టం వచ్చినా తామున్నామంటూ భరోసానిస్తూ వారికి అండగా నిలవడం అభినందనీయ మని కొనియాడారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘాల సమాఖ్య అధ్య క్షుడు పలుగుల రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అనుబంధ సంఘాలను కూడగట్టుకుని సీనియర్ సిటిజన్లకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సంక్షేమం కోసం పనిచేసే లాభాపేక్ష లేని ఏకైక సంస్థని, సమాఖ్య ఆద్వర్యంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్లకు, వృద్ధాశ్రమాలకు, అనాథ శరణాల యాలకు, నిరుపేదలకు ఉచితంగా మందులు, అవసరమైన నిత్యవసర సరుకులను, వస్తువులను అందిస్తున్నామని తెలిపారు. పేదలు వృద్ధాప్యంలో ఉన్న వాళ్ళకి మానవతా దృక్పథంతో ఎల్లవేళల అందుబాటులో ఉంటూ తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘాల సమాఖ్య ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా ఆదుకునేందుకు ముందుంటుందని తెలిపారు. నేటికీ వయోవృద్ధులకు, నిరుపేదలకు వస్తు, ధన రూపేనా అండగా నిలుస్తూ విజయవంతంగా 84 నెలలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. చేయి చేయి కలుపుతూ సీనియర్ సిటిజన్స్‌కు అండగా నిలుస్తున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ సేవలందిస్తున్న ఇద్దరు పాత్రికేయులకు ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, దయానంద్, మధులత తదితరులు పాల్గొన్నారు.



ఆలయ పున : నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారంలో శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ రేణుకా ఎల్లమ్మ దేవస్థాన పున్ణ నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆలయాల అభివద్ధిలో ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉప్పల శ్రీనివాస గుప్త



నవతెలంగాణ- నాగోల్.

ఉత్తర ప్రదేశ్ లో నీ ప్రయాగ రాజ్‌లో మూడు నదుల కలయిక అయిన త్రివేణి సంగంలో ఆదివారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్త, ఆయన కుటుంబ సభ్యులు స్నానాలను ఆచరించి హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస గుప్త మాట్లాడుతూ దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో మరోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని, అదేవిధంగా దేశ రాజకీయాల్లో కేసీర్ ప్రధాన పాత్ర పోషించాలని కోరుకున్నట్టు తెలిపారు

పీర్జాదిగూడ జేడ్పీహెచ్ఎస్‌లో వికసించిన విద్యాకుసుమాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలపై ఎంతో నమ్మకంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీర్జాదిగూడలో చేర్పించారు. ఈ మేరకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రయి వేటు పాఠశాలలకు దీటుగా పదో తరగతి పరీక్షలలో 92శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీర్జాదిగూడ నుంచి 47 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 43 మంది విద్యార్థులు పాసయ్యారు. పి.కృష్ణవేణి(9.5), టి.పుణ్యవతి (9.3), ఎండీ నహీద్(9.0), శ్రీలజ. ఎస్‌కే రేష్మ, బుష్ర(8.8) సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు డి.సుశీల తెలిపారు. ఈ ఉత్తీర్ణతకు సహకరించిన తోటి ఉపాధ్యా యులకు, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గానికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో అయ్యప్ప స్వామి దేవాలయ భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా నిజాంపేట్ హిల్ కౌంటీ వాసులు నరేందర్ రెడ్డి రూ.1,00,000/- ను అయ్యప్ప స్వామి ఆలయ చైర్మెన్ కోలన్ చంద్ర శేఖర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌లకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, ఇంద్ర కుమార్ దేవ్, వెంకట్ రెడ్డి, 191 ఎన్టీఆర్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి'



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పేదలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీపీఐ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. ఆదివారం అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలో జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ లోని ప్రభుత్వ పాఠశాలలో లేబర్ గుర్తింపు కార్డ్ ఉన్నవారికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరం ఏఐటియుసి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కేతరాజు నర్సింహ,ఓటీసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ముత్యాల యాదిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులు హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉచిత టెస్ట్‌లు చేయిం చుకొని మందులు తీసుకోవాల్సిందిగా కోరారు. డాక్టర్ నిహాద్ అహ్మద్,రామ్ కుమార్ ,తవ్ఫీక్, అహ్మద్,ఓటీసీ కాలనీ అధ్యక్షా కార్య దర్శి వి. శ్రీనివాస్ సాగర్, అచ్చిని మహేష్ సీపీఐ శాఖ కార్యదర్శి నాగవల్లి యాదగిరి, సీనియర్ నాయకులు ఐతరాజు బిక్షపతి,మహిళ సమైఖ్య నాయకులు ఎనుగొంటి లక్ష్మి కమిల్ల చందన,కేతరాజు మంజుల, కరిమున్నిసా, చంగయ్య తదితరులు పాల్గొన్నారు

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-శామీర్ పేట:

హనుమాన్ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో వీరా హనుమాన్, అభయ ఆంజనేయస్వామి దేవాలయాల్లో కాంగ్రెస్ మున్సిపాల్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్ ముదిరాజ్, నర్సింహారెడ్డిలు అభిషేకాలు,ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రాజస్థాన్ రాయల్స్ ధమాల్. మూడు రోజుల క్రితం 150 పరుగుల లక్ష్యాన్ని 13.1 ఓవర్లలో ఊదేసిన రాజస్థాన్ రాయల్స్.. తాజాగా 171 పరుగుల ఛేదనలో 10.3 ఓవర్లలోనే కుప్పకూలింది. టాప్ ఆర్డర్ వైఫల్యంతో మూడు రోజుల్లోనే భిన్నమైన ప్రదర్శనతో పరాజయం చవిచూసిన రాజస్థాన్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్షిప్తం చేసుకుంది. బౌలర్ల విజృంభణతో 112 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపర్చుకుంది.





రాజస్థాన్ ధమాల్

- 59కే కుప్పకూలిన రాయల్స్
- సిరాజ్, వేనీ పార్నెల్ విజృంభణ

112 పరుగుల తేడాతో బెంగళూర్ గెలుపు

నవతెలంగాణ-జైపూర్

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ భారీ విజయం నమోదు చేసింది. బౌలర్లు మహ్మద్ సిరాజ్ (1/10), వేనీ పార్నెల్ (3/10), మైకల్ బ్రాస్‌వెల్ (2/16), కరణ్ శర్మ (2/19) వికెట్ల వేటలో మ్యాజిక్ చేశారు. 172 పరుగుల ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 10.3 ఓవర్లలోనే కుప్పకూలింది. షిమ్రోన్ హెట్‌మయర్ (35, 19 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు) రాజస్థాన్ రాయల్స్‌కు 50 ప్లస్ స్కోరు అందించాడు. ఐదుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే నిష్క్రమించగా రాజస్థాన్ రాయల్స్ 59 పరుగులకే చేతులెత్తేసింది. 112 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఘన విజయం సాధించింది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ (55, 44 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), గ్లెన్ మాక్స్‌వెల్ (54, 33 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. చివర్లో అనుజ్ రావత్ (29 నాటౌట్, 11 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. పవర్‌ప్లేలో మూడు వికెట్లు పడగొట్టిన వేనీ పార్నెల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు.

పార్నెల్, సిరాజ్ నిప్పులు :

రాజస్థాన్ లక్ష్యం 172 పరుగులు. ఆ జట్టు ఆడిన గత మ్యాచ్‌లో ఛేదనను 13.1 ఓవర్లలోనే ఊదేసింది. దీంతో సహజంగానే రాయల్స్ ఫేవరేట్‌గా కనిపించింది. కానీ పవర్‌ప్లేలో మహ్మద్ సిరాజ్, వేనీ పార్నెల్ అద్వితీయ బౌలింగ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. వికెట్ల పతనంతో సంబంధం లేకుండా పవర్‌ప్లేలో ఎదురుదాడి చేసే రాయల్స్ ప్రణాళిక ఇక్కడ బెంగళూర్‌కు కలిసొచ్చింది. భీకర ఫామ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ (0)ను సిరాజ్ సాగనంపగా.. వేనీ పార్నెల్ తన ఓవర్లో జోశ్ బట్లర్ (0), సంజు శాంసన్ (4) కథ ముగించాడు. దేవదత్ పడిక్కల్ (4)ను బ్రాస్‌వెల్ అవుట్ చేయగా.. ఆరో ఓవర్లో జో రూట్ (10)ను వేనీ పార్నెల్ బలిగొన్నాడు. దీంతో పవర్‌ప్లేలో రాజస్థాన్ రాయల్స్ 28 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. జైస్వాల్, బట్లర్, శాంసన్ వికెట్లతో ఛేదనలో చతికిల పడిన రాజస్థాన్.. ఆ తర్వాత మిడిల్ ఆర్డర్ పతనంతో కోలుకోలేదు. లోయర్ ఆర్డర్ కథను స్పిన్నర్ కరణ్ శర్మ ముగించాడు. దీంతో 10.3 ఓవర్లలో 59 పరుగులకే రాజస్థాన్ కుప్పకూలింది. షిమ్రోన్ హెట్‌మయర్ (35) ఒక్కడే బెంగళూర్ బౌలర్లపై పైచేయి సాధించాడు. నాలుగు సిక్సర్లు, ఓ ఫోర్ బాదిన హెట్‌మయర్ రాయల్స్‌కు 50 ప్లస్ స్కోరు అందించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది మూడో అత్యల్ప స్కోరు కావటం గమనార్హం. రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో ఇద్దరు మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు సాధించారు. ఐదుగురు డకౌట్‌గా వికెట్ కోల్పోయారు.



13 మ్యాచుల్లో రాజస్థాన్ రాయల్స్‌కు ఇది ఏడో పరాజయం. 12 పాయింట్లతో ఆ జట్టు ప్రస్తుతం ఆరో స్థానానికి పడిపోయింది. చివరి మ్యాచ్‌లో నెగ్గినా.. ఇతర మ్యాచుల ఫలితాలపై రాయల్స్ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశం రాజస్థాన్ రాయల్స్ చేజారింది.

డుప్లెసిస్, మాక్స్ ఫిఫ్టీలు :

టాస్ నెగ్గిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు విరాట్ కోహ్లి (18), డుప్లెసిస్ (55) తొలి వికెట్‌కు శుభారంభం అందించారు. ఏడు ఓవర్లలో 50 పరుగులు జోడించిన అనంతరం విరాట్ కోహ్లి వికెట్ కోల్పోయాడు. రాయల్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయటంతో బెంగళూర్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడలేకపోయింది. డుప్లెసిస్‌కు గ్లెన్ మాక్స్‌వెల్ (54) జత కట్టడంతో బెంగళూర్ స్కోరు బోర్డుకు ఊపొచ్చింది. మూడు సిక్సర్లు, ఐదు ఫోర్లు బాదిన మాక్స్‌వెల్ సీజన్లో అర్థ సెంచరీ సాధించాడు. డుప్లెసిస్ సైతం ఫామ్‌ను కొనసాగిస్తూ అర్థ సెంచరీ పూర్తి చేశాడు. మిడిల్ ఆర్డర్‌లో మహిపాల్ (1), దినేశ్ కార్తీక్ (0) విఫలమైనా.. చివర్లో అనుజ్ రావత్ (29 నాటౌట్, 11 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) అదరగొట్టాడు. చివరి ఓవర్లో రెండు సిక్సర్లు సహా ఓ బౌండరీ బాదిన రావత్ బెంగళూర్‌కు మంచి స్కోరు అందించాడు. రాజస్థాన్ బౌలర్లలో జంపా, అసిఫ్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు. ఇక 12 మ్యాచుల్లో ఆరో విజయం నమోదు చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 12 పాయింట్లతో ప్రస్తుతం ఐదో స్థానంలో నిలిచింది. మరో రెండు మ్యాచులు మిగిలి ఉండగా బెంగళూర్ దర్జాగా 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు చేరుకునేందుకు అవకాశం ఉంది. 112 పరుగుల తేడాతో విజయం సాధించటంతో ఋణాత్మక నెట్‌రన్‌రేట్ నుంచి సైతం బయటపడింది.

స్కోరు వివరాలు :

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : విరాట్ కోహ్లి (సి) యశస్వి జైస్వాల్ (బి) అసిఫ్ 18, డుప్లెసిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) అసిఫ్ 55, మాక్స్‌వెల్ (బి) సందీప్ శర్మ 54, మహిపాల్ (సి) ధ్రువ్ జురెల్ (బి) జంపా 1, దినేశ్ కార్తీక్ (ఎల్బీ) జంపా 0, బ్రాస్‌వెల్ నాటౌట్ 9, అనుజ్ రావత్ నాటౌట్ 29, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 171.**

వికెట్ల పతనం : 1-50, 2-119, 3-120, 4-120, 5-137.

బౌలింగ్ : సందీప్ శర్మ 4--0-34-1, ఆడం జంపా 4-0-25-2, యుజ్వేంద్ర చాహల్ 4-0-37-0, అశ్విన్ 4-0-33-0, అసిఫ్ 4-0-42-2.

రాజస్థాన్ రాయల్స్ : యశస్వి జైస్వాల్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 0, జోశ్ బట్లర్ (సి) సిరాజ్ (బి) పార్నెల్ 0, సంజు శాంసన్ (సి) అనుజ్ రావత్ (బి) పార్నెల్ 4, జో రూట్ (ఎల్బీ) పార్నెల్ 10, దేవదత్ పడిక్కల్ (సి) సిరాజ్ (బి) బ్రాస్‌వెల్ 4, షిమ్రోన్ హెట్‌మయర్ (సి) బ్రాస్‌వెల్ (బి) మాక్స్‌వెల్ 35, ధ్రువ్ జురెల్ (సి) మహిపాల్ (బి) బ్రాస్‌వెల్ 1, అశ్విన్ రనౌట్ 0, ఆడం జంపా (బి) కరణ్ శర్మ 2, సందీప్ శర్మ నాటౌట్ 0, అసిఫ్ (సి) కోహ్లి (బి) కరణ్ శర్మ 0, ఎక్స్‌ట్రాలు : 3, **మొత్తం : (10.3 ఓవర్లలో ఆలౌట్) 59.**

వికెట్ల పతనం : 1-1, 2-6, 3-7, 4-20, 5-28, 6-31, 7-50, 8-59, 9-59, 10-59.

బౌలింగ్ : మహ్మద్ సిరాజ్ 2-0-10-1, వేనీ పార్నెల్ 3-0-10-3, మైకల్ బ్రాస్‌వెల్ 3-0-16-2, కరణ్ శర్మ 1.3-0-19-2, గ్లెన్ మాక్స్‌వెల్ 1-0-3-1.

నేటి నుంచి సీఎం కప్ టోర్నీ

మండల స్థాయి పోటీలు షురూ



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర క్రీడా సంబురాలకు రంగం సిద్ధం. సీఎం కప్ 2023 టోర్నీలో తొలి అంచె పోటీలు నేడు మండల స్థాయిలో ఆరంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 612 మండల కేంద్రాల్లో సీఎం కప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రాల్లో పోటీల నిర్వహణకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసింది. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు నేడు మండల స్థాయిలో సీఎం కప్ పోటీలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయ గౌడ్‌లు సైతం నేడు ఎంపిక చేసిన మండల కేంద్రాల్లో సీఎం కప్ పోటీలకు హాజరు కానున్నారు. సీఎం కప్ పోటీల్లో మండల స్థాయిలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. తొలుత ఫుట్‌బాల్‌ను పురుషులకు మాత్రమే షెడ్యూల్ చేయగా.. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం విజ్ఞప్తితో మహిళలకు సైతం ఫుట్‌బాల్‌ను షెడ్యూల్ చేశారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. సోమ, మంగళ, బుధ వారాల్లో మండల స్థాయిలో సీఎం కప్ పోటీలు జరుగుతాయి. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక చేయనున్నారు.





ఉత్సాహంగా సాగిన సైక్లోథాన్

నవతెలంగాణ-హైదరాబాద్ : అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా నిర్వహించిన సైక్లోథాన్ ఉత్సాహంగా సాగింది. మహిళల ఫిట్‌నెస్, ఆరోగ్యం, శ్రేయస్సులపై అవగాహన కల్పించటంలో భాగంగా భారత్‌లో ఆపిల్ ఉపకరణాల సంస్థ ఆప్ట్రోటిక్స్ 10 కిమి సైక్లోథాన్‌ను నిర్వహించింది. ఆదివారం ఉదయం గచ్చిబౌలిలో జరిగిన సైక్లోథాన్‌లో సుమారు 800 మంది వరకు క్రీడాస్ఫూర్తి వాతావరణంలో పోటీపడ్డారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి జెండా ఊపి సైక్లోథాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్ట్రోనిక్స్ సీఈవో మేఘన సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

భిన్న కాంబినేషన్

మలయాళ యువ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ అన్ని భాషల్లోనూ తనదైన శైలిలో రాణిస్తున్నారు. ఆయన ఏ భాషలో నటించినా, అక్కడి సంస్కృతికి తగ్గట్టుగా తనని తాను మలచుకొని, ఆ మట్టిలో పుట్టిన వ్యక్తిగానే అందరికీ చేరువ అవ్వడం విశేషం. తన ప్రతిభతో తెలుగు ప్రేక్షకులకు కూడా ఎంతగానో దగ్గరైన దుల్కర్ సల్మాన్ తన కొత్త చిత్రాన్ని యువ దర్శకుడు వెంకీ అట్లూరితో చేయబోతున్నారు 'సార్/వాతి'తో ఘన విజయాన్ని అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి మరోసారి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మాణంలో ఈ సినిమా చేస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కలిసి అత్యుత్తమ నాణ్యత, కంటెంట్‌తో కూడిన అద్భుతమైన చిత్రాలను నిర్మిస్తున్నాయి. వినోదాన్ని అందించడంతో పాటు, ఎప్పటికీ ప్రేక్షకుల మదిలో నిలిచి పోయే చిత్రాలను అందించడానికి వారు కృషి చేస్తున్నారు. ఈ చిత్రం కూడా ప్రేక్షకులందరినీ తప్పకుండా అలరించే మరో క్వాలిటీ, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా అవుతుందనే దీమాని వ్యక్తం చేశారు. అద్భుతమైన కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్ర షూటింగ్ అక్టోబర్ నుండి ప్రారంభం కానుంది. 2024 వేసవిలో విడుదలకి ప్లాన్ చేస్తున్నారు.


వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్, నాగవంశీ

బర్త్‌డేకి డబుల్ ధమాకా

బోయపాటి శ్రీను, రామ్ పోతినేని కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఏకధాటిగా జరుగుతోంది. అన్ని కమర్షియల్ అంశాలతో యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై భారీ నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో శ్రీనివాస చిట్టూరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ థండర్‌ను రామ్ పుట్టినరోజు కానుకగా నేడు (సోమవారం) విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రామ్ డాషింగ్, డైనమిక్‌గా కనిపిస్తున్నారు. స్టైలిష్ హెయిర్‌తో, గుబురు గడ్డం రగ్గడ్ నెస్ ని తీసుకొచ్చింది. డెనిమ్ షర్ట్, జీన్స్ ధరించి రామ్ తన చేతిలో బేస్ బాల్ బ్యాట్‌తో ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. బ్యాగ్రౌండ్‌లో పెద్ద ఎద్దును కూడా చూడవచ్చు. ఈ సినిమాలో మాసీవ్ క్యారెక్టర్‌లో నటించేందుకు రామ్ బీస్ట్ లుక్‌లో కనిపించారు. హీరోయిన్ శ్రీలీల ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో రామ్‌కు జోడిగా నటిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 20న హిందీతోపాటు అన్ని దక్షిణ భారతీయ భాషల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

రామ్, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొంది బ్లాక్ బస్టర్‌గా నిలిచిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. ఈ సినిమా విడుదలైన దాదాపు నాలుగు సంవత్సరాలైంది. తాజాగా ఈ సెన్సేషనల్ కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతోందని రామ్ బర్త్‌డేకి గిఫ్ట్‌గా ఒక్కరోజు ముందే మేకర్స్ అనౌన్స్ చేయటం విశేషం. పూరి కనెక్ట్స్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. విషు రెడ్డి సీఈవో. ఇస్మార్ట్ శంకర్‌కి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రానికి 'డబుల్ ఇస్మార్ట్' అని పేరు పెట్టారు. ఇది ఈసారి రెట్టింపు మాస్, రెట్టింపు వినోదాన్ని ఇవ్వబోతుంది. పూరి జగన్నాథ్ చాలా పెద్ద స్పాన్ కలిగిన కథ రాశారు. అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో, భారీ స్థాయిలో హై బడ్జెట్‌తో రూపొందనుంది. అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో త్రిశూలం పై రక్తపు గుర్తులు ఉన్నాయి. ఈ పోస్టర్ ఇస్మార్ట్ శంకర్ సెకండ్ ఫ్రాంచైజీ నేపథ్యం గురించి సూచిస్తోందని వేరే చెప్పక్కర్లేదు. ఈ సినిమా పాన్ ఇండియా రిలీజ్ అవుతోంది. వచ్చే ఏడాది మహా శివరాత్రి కానుకగా ఈ చిత్రాన్ని మార్చి 8న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో అనౌన్స్ చేస్తారు.ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.


రామ్


పూరీ జగన్నాథ్

చిత్రగా అలరిస్తా..

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హీరో పంజా వైష్ణవ్ తేజ్‌తో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్న విషయం విదితమే. శ్రీకరా స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సినిమాకి కీలకమైన పవర్ ఫుల్ పాత్రలలో జోజు జార్జ్, అపర్ణా దాస్ నటిస్తున్నట్లు ఇటీవల చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని, సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న శ్రీలీల పాత్ర వివరాలను తాజాగా చిత్ర బృందం వెల్లడించింది. ఇందులో ఆమె ఉల్లాసభరితంగా, కొంటెగా ఉంటూ అందరి మనసులు దోచుకునే అందమైన 'చిత్ర' పాత్రను పోషిస్తున్నారు. తాను పోషిస్తున్న చిత్ర పాత్ర పట్ల శ్రీలీల ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ఇప్పటిదాకా చిత్రీకరించిన ఆమె పాత్రకు సంబంధించిన సన్నివేశాలన్నీ అద్భుతంగా వచ్చాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. 'అసురన్, ఆడుకాలం' వంటి జాతీయ అవార్డులు గెలుచుకున్న చిత్రాలకు సంగీతం అందించిన జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. ఇదిలా ఉంటే, నేడు (సోమవారం) ప్రేక్షకుల అంచనాలను రెట్టింపు చేసేలా ఈ మూవీ నుంచి అదిరిపోయే యాక్షన్ గ్లింప్స్ విడుదల కానుంది.


శ్రీలీల

పెదవులు వీడి మౌనం..

'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బొమ్మరిల్లు' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న హీరో సిద్ధార్థ్ త్వరలో 'టక్కర్' అనే సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. ఈనెల 26న తెలుగు, తమిళ భాషల్లో భారీస్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన 'టక్కర్' మూవీ టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. టీజర్‌లో సిద్ధార్థ్ సరికొత్త మేకోవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంతో సిద్ధార్థ్ మరో భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే అంచనాలున్నాయి. అలాగే ఈ సినిమా నుంచి విడుదలైన 'కయ్యాలే' సాంగ్ కూడా విశేష ఆదరణ పొందింది. ఇక ఇప్పుడు ఈ చిత్రం నుంచి 'పెదవులు వీడి మౌనం' అనే సాంగ్ విడుదలైంది. ఈ లిరికల్ వీడియోని చిత్రబృందం శనివారం విడుదల చేసింది. నివాస్ కె ప్రసన్న స్వరపరిచిన ఈ రొమాంటిక్ సాంగ్ కట్టిపడేస్తోంది. "పెదవులు వీడి మౌనం.. మధువులు కోరే వైనం.. తనువులు చేసే స్నేహం.. నేడే..." అంటూ సాగిన పాట ప్రేమ మైకంలో ముంచేసేలా ఉంది. ఆ పాట మూడ్‌కి సందర్భానికి తగ్గట్టుగా నివాస్ కె ప్రసన్న ఎంత చక్కగా స్వరపరిచారో.. కృష్ణ కాంత్ అందించిన సాహిత్యం కూడా అంతే చక్కగా కట్టిపడేసేలా ఉంది. తేలికైన పదాలతో లోతైన భావాలను పలికించారు కృష్ణ కాంత్. దీపక్ బ్లూ, చిన్మయి శ్రీపాద ఎంతో అందంగా ఈ పాటను ఆలపించి, తమ మధుర గాత్రంతో మాయ చేశారు. ఇక నాయకా నాయికల మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరిందని, వెండితెరపై ఈ జోడి మ్యాజిక్ చేయబోతోందని ఈ లిరికల్ వీడియో స్పష్టం చేసింది. ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ప్రేక్షకులను ఆకట్టుకొని ఘన విజయం సాధిస్తుందని మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాలో అభిమన్యు సింగ్, యోగి బాబు, మునీశ్ కాంత్, ఆర్జే విఘ్నేశ్ కాంత్ తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: కార్తీక్ జి. క్రిష్, సంగీతం: నివాస్ కె ప్రసన్న, సినిమాటోగ్రాఫర్: వాంచినాథన్ మురుగేశన్, ఎడిటర్: జీఏ గౌతమ్, ఆర్ట్ డైరెక్టర్: ఉదయ కుమార్ కె, స్టంట్స్ కోరియోగ్రఫీ: దినేష్ కాశి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మయాంక్.



సిద్ధార్థ్, దివ్యాంశ కౌశిక్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బరితెగిస్తున్న నయా గ్యాంగ్‌లు

బీజేపీ రాజకీయాలతో భారత్‌కు చేటు

- మోడీ పాలనలో తిరోగమన పరిస్థితులు
- పలు రంగాలను భ్రష్టు పట్టిస్తున్న కాషాయ పార్టీ
- రాజకీయ విశ్లేషకులు, నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ : ఢిల్లీలోని అత్యంత భద్రతతో కూడిన తీహార్ జైలులో టిల్లు తాజ్‌పురియా అనే వ్యక్తి హత్యకు సంబంధించిన వార్తలను వారం రోజులుగా హిందీ వార్తాపత్రికలు వరుసగా అందించాయి. హతుడిని 50 సార్లు పొడిచిన విధానాన్ని వివరించాయి. జైలులో ఇంత ఘోరం జరిగినా పోలీసులు మాత్రం అడ్డుకోలేకపోయారు. తీహార్ జైలులో ముఠాలు, ముఠా నాయకుల ఉనికి గతంలో దేశంలో నెలకొని ఉన్న కఠినమైన రోజులను గుర్తు తెస్తున్నది. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 2014 తర్వాత, శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గత కొన్నేండ్లుగా ఆ పార్టీ అధికారంలో ఉన్న ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలే ఈ విషయాన్ని తెలియజేస్తున్నాయన్నారు. వ్యాపారం, రాజకీయం, క్రీడలు, బ్యూరోక్రసీ, వినోదం, సాహిత్య ప్రపంచం.. ఇలా రంగమేదైనా బీజేపీ నాయకుల రంగప్రవేశంతో అవి కలుషితమవుతున్నాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు.

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ వ్యవహారం

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా అథ్లెట్ల లైంగిక ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఇది దేశం దృష్టిని ఆకర్షించింది. న్యూఢిల్లీలోని జంతరమంతర్ వద్ద జరుపుపుతున్న మహిళా అథ్లెట్ల నిరసనలకు అన్ని రంగాల నుంచి మద్దతు లభించింది. బ్రిజ్ భూషణ్ రాజీనామా చేయాలనే డిమాండ్ పెరిగింది. అయితే, బ్రిజ్ భూషణ్ తాను రాజీనామా చేసేది లేదని తెలి పాడు. దేశరాజధానిలోనే ఇంత తతంగం జరుగుతున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారుకు కానీ, బీజేపీ పార్టీ పెద్దలకు గానీ ఇదేదీ కనిపించకపోవడం గమనార్హం. ఇలాంటి తరుణంలో నెటిజన్లు మోడీ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మణిపూర్ హింసాత్మకం

ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అట్టుడికిపోతున్నది. గిరిజన, గిరిజనేతరుల మధ్య జరిగిన ఘర్షణలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర హింసకు దారి తీశాయి. 50 కంటే ఎక్కువ మంది వ్యక్తుల మరణానికి దారి తీశాయి. వందలాది మంది గాయాలపాలయ్యారు. "జాతీయ ప్రతిష్ట" దెబ్బ తిన్నది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున మోహరించాల్సిన పరిస్థితి అక్కడ ఏర్పడింది. రాష్ట్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ గొడవలను నివారించడంలోనూ, అదుపు చేయటంలోనూ విఫలమైంది. సాక్షాత్తూ బీజేపీ పార్టీ కింది స్థాయి కార్యకర్తలే బీజేపీ బలహీన తీరును విమర్శించారు. మణిపూర్‌లో ఇంత గొడవ జరుగుతున్నా.. ప్రధాని మోడీ, కేంద్ర హౌం మంత్రి అమిత్ షాలు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా ఎన్నికల్లో లబ్ది పొందటమే లక్ష్యంగా కర్నాటక ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు. మోడీ సర్కారు తీరుపై రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి.

కర్నాటకలో 40 శాతం కమీషన్ వ్యవహారం

కర్నాటకలో బీజేపీ "డబుల్-ఇంజిన్" సర్కారు పట్ల ప్రజలు విసుగు చెందారు. ముఖ్యంగా, అక్కడ 40 శాతం కమీషన్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ కోపాన్ని కన్నడ ఓటరు ఓటుతో తీర్చుకున్నాడు. ఈ విషయాన్ని ఈనెల 10న అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం అనేక ఎగ్జిట్ పోల్స్ ఫలితాలే స్పష్టం చేశాయి. దాదాపు అన్ని సర్వేల్లో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా అవతరించడం గమనార్హం. దీంతో కన్నడిగులు మళ్లీ బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టడానికి ఇష్టంతో లేరనేది స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు. మోడీ, షా, యోగి త్రయం ప్రచారం చేసినా ఓటర్లను అనుకున్నంత ప్రభావితం చేయలేకపోయారని తెలుస్తోంది..

ఆరెస్సెస్ కార్యకలాపాలు

ఇటు బీజేపీ మాతృ సంస్థగా చెప్పబడే ఆరెస్సెస్ తన అనుబంధ సంస్థలతో హింసకు పాల్పడుతున్నదని విశ్లేషలు వెలువడుతున్నాయి. నాగ్‌పూర్ కేంద్రంగా అనేక కుట్రలు తెరలేపుతున్నదని చెప్పారు. బజరంగ్‌దళ్ వంటి హిందూత్వ సంస్థలను అల్లర్లకు ఎగదోస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నదని విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి సంస్థల కారణంగానే కర్నాటకలో హిజాబ్ వివాదం చెలరేగిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.. అలాగే, తన విద్యార్థి విభాగంతో ఢిల్లీ, జేఎన్‌యూ వంటి యూనివర్సిటీల్లో గొడవలకు కారణమైందన్నారు.

చంద్రబాబు నివాసం జప్తు

రాజధాని భూముల కుంభకోణం కేసులో దర్యాప్తు వేగవంతం

- సుప్రీంకోర్టు స్టే తొలగింపుతో మళ్లీ రంగంలోకి సిఐడి
- మాజీ మంత్రి నారాయణ, పలువురు టిడిపి నేతల ఆస్తులు, బ్యాంక్ ఖాతాలు అటాచ్

గుంటూరు : రాజధాని భూముల కుంభకోణం కేసులో ఉండవల్లి కరకట్టపైనున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసాన్ని సిఐడి జప్తు చేసింది. మాజీ మంత్రి నారాయణ సహా పలువురు టిడిపి నేతల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు అటాచ్ చేసింది. రాజధాని రాక ముందు అమరావతిలో భూముల కొనుగోలుకు సంబంధించి వైసిపి ప్రభుత్వం నియమించిన సిట్ (సిఐడి) దర్యాప్తు వేగం పుంజుకుంది. చంద్రబాబుపై దాఖలైన కేసుల దర్యాప్తుపై హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను సుప్రీం కోర్టు ఇటీవల తొలగించడంతో సిఐడి అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. రాజధాని ప్రాంతంలో అక్రమంగా భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలపై పలువురి ఆస్తుల జప్తు ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. క్రిమినల్ లా అమెండ్‌మెంట్ 1944 చట్టం ప్రకారం ఆస్తులు, బ్యాంకుల్లోని నగదు జప్తు చేసినట్టు ప్రకటించారు. క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారన్న అభియోగాలపై చంద్రబాబు, మాజీ మంత్రి పి.నారాయణలతోపాటు పలువురిపై సిఐడి దర్యాప్తు జరుగుతోంది. సిఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్లలో అవకతవకలు జరిగాయని, అధికార పదవులను ఉపయోగించుకుని తమ బంధువులు, స్నేహితులకు, టిడిపి వారికి మేలు చేశారని సిఐడి అభియోగాలు మోపింది. తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని కరకట్ట వద్ద ఉన్న లింగమనేని ఎస్టేట్ అతిథి గృహం (చంద్రబాబు ప్రస్తుతం ఉంటున్న నివాసం)తో పాటు పలువురి ఆస్తులను జప్తు చేసింది. రాజధాని ప్రాంతంలో తనకు అనుకూలంగా అలైన్‌మెంట్ మార్చినందుకు క్విడ్ ప్రోకో కింద చంద్రబాబుకు ఈ అతిథి గృహాన్ని లింగమనేని సంస్థ అధినేత రమేష్ బహుమతిగా ఇచ్చారనేది సిఐడి ఆరోపణ. దానిని జప్తు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చంద్రబాబు రాజధాని ప్రాంతంలో లింగమనేని రమేష్‌కి లబ్ధి చేకూరే విధంగా రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని, చిన్న రైతులకు నష్టం చేస్తూ లింగమనేనితోపాటు చంద్రబాబు సొంతమనుషుల ఆస్తుల విలువ పెంచే విధంగా రాజధాని మాస్టర్ ప్లాన్ మార్చారనేది సిఐడి అభియోగం. హెరిటేజ్ డైరెక్టరుగా ఉన్న అప్పటి మంత్రి నారా లోకేష్... లింగమనేని రమేష్ నుంచి రాజధాని ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారని అభియోగం మోపింది. నారా లోకేష్‌తోపాటు పలువురు టిడిపి నాయకులు రాజధాని ప్రాంతంలో బినామీల పేరుతో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్టు వైసిపి నాయకులు సిఐడికి గతంలో ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతంలోని స్టార్ట్ అప్ ప్రాంతంలో రూ.3.66 కోట్లతో 2015 జూన్, జులై, ఆగస్టు నెలల్లో బినామీ పేర్లతో భూమి కొనుగోలు చేశారని అప్పటి మంత్రి నారాయణపై అభియోగం ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు చెందిన నారాయణ విద్యా సంస్థల ఉద్యోగి పొత్తూరి ప్రమీల, ట్రెజరర్ రాపూరు సాంబశివరావు పేరుతో ఉన్న ఆస్తులను సిబిఐ జప్తు చేసింది. రాజధాని గ్రామాల్లో నారాయణతోపాటు ఇతరులకు చెందిన మొత్తం 75,880 గజాల విస్తీర్ణంలోని ప్లాట్లు జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిలో ఉద్దండరాయునిపాలెంలోని 2,040 గజాల రెండు ప్లాట్లు, రాయపూడిలోని 18,140 గజాల విస్తీర్ణంలోని ప్లాట్లు ఉన్నాయి. లింగాయపాలెంలో 12,440 గజాల ప్లాట్లు, మందడంలో 39640 గజాల ప్లాట్లు జప్తు చేశారు. కొండమరాజుపాలెంలో 3,180 గజాల ప్లాట్లు జప్తు చేసిన వాటిలో ఉన్నాయి. రామకృష్ణ హౌసింగ్ ఎండి కెపివి అంజనీకుమార్‌కు చెందిన రాయపూడిలోని రెండు ఎకరాల భూమిని, పలువురి బ్యాంకు ఖాతాల్లోని రూ.1,92,11,482 నగదును సిఐడి జప్తు చేసింది. హైదరాబాద్ చందానగర్ బ్రాంచిలో పొట్లూరి ప్రమీలకు చెందిన రూ.40.88 లక్షలు, రాపూరి సాంబశివరావుకు చెందిన రూ.60.94 లక్షలు, వివిధ బ్యాంకుల్లో ఆవుల శంకర్‌కు చెందిన రూ.69,16502, కె.వరుణ్‌కుమార్ పేరిట ఉన్న రూ.21,11,660 జప్తు చేసిన వాటిలో ఉన్నాయి.

తరుగు పేరిట ధాన్యం దించుకోవట్లే

రైస్‌మిల్లర్ల తీరుపై రైతుల ఆందోళన

నవతెలంగాణ-బోధన్

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిచి రంగు మారడంతో పాటు మొలకలు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రైస్‌మిల్లర్ల యజమానులు తరుగు పేరిట కొనుగోలు చేయడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని తిరుమల రైస్‌మిల్ ఎదుట రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హున్సా సొసైటీ చైర్మెన్ మందర్న రవి మాట్లాడుతూ.. ఇటీవల ఏకధాటిగా కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల మూలంగా బోధన్-సాలూర మండలంలోని పలు సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాల వద్ద , రోడ్ల వెంబడి ఉన్న కొంతమంది రైతుల ధాన్యం కుప్పల కిందకు కొంత వర్షం నీరు చేరడం వల్ల కుప్ప కింది భాగంలోని వడ్లు తేమ శాతంతో కొంత రంగు మారాయని తెలిపారు. దాన్ని సాకుగా చూపడంతో పాటు వర్షాలతో తేమ 14-15 శాతం ఉందని, అలాగే నూక శాతం ఎక్కువగా ఉందని తరుగు ఎక్కువగా ఇస్తేనే ధాన్యం దించుకుంటామని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సొసైటీ చైర్మెన్ హోదాలో రైతుల పక్షాన వెళ్లి మాట్లాడినా కూడా కొందరు మిల్లర్లు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఫ్లీనరీ సమావేశంలో రైతుల వద్ద ఉన్న తడిసిన ధాన్యాన్ని-మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ హామీ ఇచ్చారని దాంతో రైతులు హర్షం వ్యక్తం చేశారని, అయినా ఇప్పటి వరకు ఎలాంటి ధాన్యం కొనుగోలు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఖాజాపూర్ అశోక్, హున్సా మాజీ ఎంపీటీసీ చీల శంకర్, సొసైటీ డైరెక్టర్ రమేష్, రైతులు శంకర్, ఛిద్రపు అనిల్, చీల ప్రకాష్ బాధిత రైతులు పాల్గొన్నారు.

పేదల బియ్యం బుగ్గిపాలు

పీడీఎస్ రైస్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- 600 క్వింటాళ్ల బియ్యం అగ్నికి ఆహుతి





నవ తెలంగాణ- జడ్చర్ల

జడ్చర్ల పట్టణం గంగాపూర్ శివారులోని పత్తి మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లయ్ గోడౌన్‌లో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో గోడౌన్‌లో నిల్వ ఉన్న దాదాపు 600 క్వింటాళ్లకుపైగా సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం, వంద క్వింటాళ్లకుపైగా రేషన్ దుకాణాల బియ్యం మంటల్లో కాలిపోయాయి. 70వేలకు పైగా గన్నీ సంచులు అగ్నికి ఆహుతై బూడిదయ్యాయి. అందులో 13వేల కొత్త గన్నీ సంచులు కాలిపోయాయి. దాంతో సుమారు రూ.40 లక్షల ప్రభుత్వ ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. గోడౌన్‌లో మంటలు అంటుకున్న విషయాన్ని గోడౌన్ కాంట్రాక్టర్ రమేష్, డీటీ కిషోర్ స్థానిక ఫైర్ సిబ్బందికి సమాచారాన్ని తెలపడంతో ఘటన స్థలానికి చేరుకున్న రెండు ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పేందుకు విశ్వ ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దాంతో ఘటనా స్థలంలో ఉన్న జిల్లా సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్ ఉన్నతాధికారులతో మాట్లాడి గోడౌన్ గోడలను కూల్చేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు ఆర్పేందుకు సుమారు నాలుగు గంటలు పైగా సమయం పట్టింది. కాగా ఈ విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ సీతారాం ఘటనా స్థలానికి చేరుకొని కాలిపోతున్న గోడౌన్ని పరిశీలించారు. అక్కడ చేపడుతున్న సహాయక చర్యలను మంటలు, ఆర్పడానికి ఫైర్ సిబ్బంది చేపడుతున్న చర్యలను పరిశీలించి గోడౌన్‌లో జరిగిన అగ్నిప్రమాద నష్టాన్ని అంచనా వేసి సివిల్ సప్లయ్ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమాచారం అందించారు.

అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు

పట్టణంలో సివిల్ సప్లయ్ గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించి భారీగా ప్రభుత్వ ఆస్తినష్టం జరగడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

గోడౌన్‌లో విద్యుత్ సరఫరా లేకపోవడంతోపాటు పరిసరాల్లో మంటలు సంభవించడానికి ఎలాంటి ఆధారం కనిపించలేదు.

పీడీఎస్ బియ్యం వద్ద మంటలు ఎలా అంటుకున్నాయి అనే పలు అనుమానాలు చెలరేగుతున్నాయి. కూలీలు ఎవరైనా బీడీ కాల్చిపడేశారా లేక ఎవరైనా కావాలనే గోడౌన్‌లో మంటలు పెట్టారా అని చర్చించుకుంటున్నారు. ఈ ఘటనపై సివిల్ సప్లయ్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీని ఓడించడమే సీపీఐ లక్ష్యం

- సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ కె. నారాయణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

విధ్వంసక రాజకీయాలు చేస్తున్న బీజేపీని దేశవ్యాప్తంగా ఓడించడమే సీపీఐ లక్ష్యం అని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డా॥ కె.నారాయణ తెలిపారు. సీపీఐ ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు నెల రోజులు దేశ వ్యాప్తంగా 'బీజేపీ కో హటావో - దేశ్ కో బచావో' నినాదంతో బీజేపీ ప్రజా వ్యతిరేక, వినాశకరమైన విధానాలను ప్రజలకు వివరించేందుకు పాద యాత్రలు నిర్వహించినట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని మూసారాంబాగ్, ఆస్మాన్ గఢ్, టీవీ టవర్, బీ బ్లాక్స్, తిరుమల హిల్స్, వీకే దాగే నగర్, బ్యాంక్ కాలనీ తదితర బస్తీలు, కాలనీల్లో ఆదివారం హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతటా మత విషాన్ని వ్యాపింపజేస్తున్న బీజేపీ.. ప్రజలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి అని హుకుం జారీచేస్తే ప్రజలు ఊరుకోరని కర్నాటక మాదిరిగానే దేశమంతటా తరమికొడతారని తెలిపారు.కర్నాటకలో మోడీ, అమిత్ షా ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహించినా బీజేపీ అవ మానకరమైన ఓటమి చెందిందన్నారు. ప్రజలను పేదరికం, వెనుకబాటు నుంచి బయటికి నడిపిం చడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. రెండు పర్యాయాల బీజేపీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం.. దేశ సంస్కృతి, నైతికత, ప్రజా సంస్థలు, ప్రజాస్వామ్య నిర్మాణం, రాజ్యాంగ విలువలకు అపారమైన నష్టం కలిగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం.. రాజ్యాంగ ఆదేశాన్ని పరిరక్షించడం కోసం ప్రగతిశీల, ప్రజాసామ్య వాదులందరూ ఏకమై బీజేపీ వినాశకరమైన విధానాలు ప్రజలకు తెలిపి, చైతన్య పరిచి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ మాట్లాడుతూ.. బీజేపీ నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని కాపాడు కోవల సిన అవసరం ఏర్పడిందని, ప్రజలు బీజేపీ తప్పి దాలను గమనించి వచ్చే ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ పాద యాత్రలో.. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు బి. వెంకటేశం, జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రమోహన్ గౌడ్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, పార్టీ నగర నేతలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పదంగా కూలీ మృతి
భార్య భర్తల మధ్య తగాదాలే కారణం

నవతెలంగాణ-దుండిగల్

కూలీ తలకు బలమైన గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని ఖుషి నగర్ తాలూకా ఫాజీ నగర్‌కు చెందిన మనోజ్ చౌహన్(35) ఆరేండ్ల కిందట ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. దుండిగల్ మున్సిపాల్టీ బౌరంపేట్ పరిధిలోని సతీష్ కో అపరేటివ్ సొసైటీ సమీపంలోని శివ టైల్స్ కంపెనీలో అతను, అతని భార్య లక్ష్మీ చౌహన్ దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో మూడేండ్లుగా తమ కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేది. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్య వేరొకరితో ఫోన్‌లో మాట్లాడడం చూసిన భర్త గొడవపడ్డాడు. అనంతరం ఆదివారం తెల్లవారేసరికి మనోజ్ చౌహన్ ఇంటి పరిసర ప్రాంతంలో తలకు బలమైన గాయాలతో శవమై కనిపించాడు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. భార్య హత్య చేసిందా.. లేక ఇతరులు ఎవరైనా హత్య చేసి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటక ఫలితాలు మత రాజకీయాలకు చెంపపెట్టు : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కర్నాటక ఎన్నికల ఫలితాలు మతరాజకీయాలకు చెంప పెట్టులాంటివని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే తరహాలో తెలంగాణలో కూడా కుట్ర రాజకీయాలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తమ స్వార్థ రాజకీయాలకు పాల్పడితే ఇలాంటి తీర్పులే వెలువడుతాయని గుర్తుచేశారు. కులం, మతం, డబ్బు, అధికారమదంతో ప్రజాస్వామ్యాన్ని కొనలేరని పేర్కొన్నారు. నియంత పాలనను గద్దె దించేందుకు తెలంగాణ సమాజం ఎదురుచూస్తున్నదని తెలిపారు.

ఉదారవాద ప్రజాస్వామ్యంలోనే భారత అభివృద్ధి మార్గం

- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ : దేశ అభివృద్ధి మార్గం ఉదారవాద ప్రజాస్వామ్యంలో ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. భారత అభివృద్ధి పథం దాని అంతర్గత బలాలను ఉపయోగించుకోవడం, ప్రపంచ సరఫరా గొలుసులకు కీలకమైనదిగా మారడంతో అందరికీ గౌరవమైన చారిత్రాత్మక సంస్కృతిని నిర్మించడం ద్వారా కీలకమైనదిగా మారిందని చెప్పారు. సేవల పరిశ్రమలో భారతదేశానికి నాయకత్వ పాత్ర పోషించే అవకాశం ఉన్నదనీ, ఈ ప్రయత్నంలో ప్రపంచం విశ్వాసాన్ని సంపాదించడానికి దేశం యొక్క ఉదారవాద ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం ఆర్థిక అవసరమని నొక్కి చెప్పారు. విశ్వసనీయమైన ప్రపంచ సరఫరాదారుగా మరింత నేరుగా తయారీ లేదా సేవల సర్వీస్ కాంపోనెంట్‌పై దృష్టి పెట్టడం ద్వారా భారతదేశం ప్రయోజనం పొందుతుందని అన్నారు. "మన స్వతంత్ర న్యాయవ్యవస్థ, మన ఉదారవాద ప్రజాస్వామ్యం, మనం ఈ ఉత్పాదక సేవ-నేతత్వంలోని వద్ధి పథంలోకి వెళ్లాలంటే ఇవి క్లిష్టమైన ప్రయోజనాలు. ఎందుకంటే ఇది ప్రపంచం యొక్క నమ్మకాన్ని సంపాదించడానికి వీలు కల్పిస్తుంది. ఇది అంతర్గతంగా అవసరం" అని 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సులో రాజన్ తన ప్రధాన ప్రసంగంలో అన్నారు. "మనం భారతీయులుగా ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నాం. కానీ మనం విశ్వసించగలమనీ, ఈ రకమైన సేవలను సమర్థవంతంగా అందించగలమని ప్రపంచాన్ని ఒప్పించేలా ప్రజాస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నాం. మన సంస్థలను బలోపేతం చేయడంలో, మన పటిష్టతలో మనం మన హౌంవర్క్ చేయాలి" అని తెలిపారు.

బీజేపీ సెల్ఫ్‌గోల్

ఆ పార్టీ చర్యలతోనే కాంగ్రెస్‌కు లాభం

- కర్నాటక ఎన్నికల ఫలితాలపై విశ్లేషకులు, సామాజికవేత్తలు

న్యూఢిల్లీ : దక్షిణాది రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఒక్క రాష్ట్రాన్ని బీజేపీ కోల్పోయింది. కర్నాటకను ఆధారంగా చేసుకొని దక్షిణాదిన విస్తారిద్దామనుకున్న బీజేపీ ఆశలు అడియాశలయ్యాయి. అయితే, రాష్ట్రంలో ఆ పార్టీ ఓటమికి తాను తీసుకున్న నిర్ణయాలు, చర్యలే కారణమని విశ్లేషకులు, సామాజికవేత్తలు, నిపుణులు అన్నారు. ఫలితంగా కాంగ్రెస్‌కు లాభం చేకూరటం.. హస్తం పార్టీ కూడా ఐక్యంగా ముందుకు వెళ్లటంతో తాజా ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఈ సందర్భంగా విశ్లేషకులు, సామాజికవేత్తలు కొన్ని విషయాలను తెలిపారు.

- దేశంలోని చాలా రాష్ట్రాలు విపక్షాల పాలనలో ఉన్నాయనేది వాస్తవమే అయినా.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో నిరంకుశ ధోరణిని మరవకూడదని నిపుణులు, మేధావులు అన్నారు. కర్నాటక విజయం మరింత శ్రేయోదాయకమనీ, రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేసిన విపరీతమైన ఆగ్రహాన్ని ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు.
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) డిపార్ట్‌మెంట్, ఇతర కేంద్ర ఏజెన్సీల ద్వారా ప్రతిపక్షంతో సంబంధం ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం ఎన్నికల ప్రచారంలో నిరాటంకంగా కొనసాగిందని చెప్పారు. ఈ సంస్థల కీలక పదవులకు ఎంపికైన వ్యక్తులు సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు.
- ఎన్నికల సంఘం(ఈసీ) నరేంద్ర మోడీ, అమిత్ షాల అనేక ప్రకటనలు, చర్యలపై.. కాంగ్రెస్, ఇతరులు చేసిన ఫిర్యాదులను విస్మరించిందని తెలిపారు. ఇది ఒక పక్షపాతాన్ని ప్రదర్శించిందన్నారు. ఓటు వేసేటప్పుడు జై బజరంగ్‌బలి అనే మతపరమైన ప్రార్థనను ఉపయోగించాలని మోడీ ఓటర్లను నిర్ద్వంద్వంగా ఉద్బోధించడంపై ఈసీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి నోటీసూ రాలేదని గుర్తు చేశారు. ఈ పిలుపు ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ ఆరోపించిందని తెలిపారు.
- అజ్ఞాత ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులను బీజేపీ మరోసారి వినియోగించుకోగలిగిందని విశ్లేషకులు అన్నారు. ఈ రకమైన అపారదర్శక రాజకీయ నిధుల రాజ్యాంగబద్ధతను సవాలుపై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేస్తూనే ఉన్నది. అంటే కర్నాటక ఎన్నికలు కచ్చితంగా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగలేదని అభిప్రాయపడ్డారు.
- ఎన్నికల కోడ్‌ను విధించే ముందు అధికారిక సందర్శనల కోసం మోడీ రాష్ట్ర వనరులను భారీగా ఖర్చు చేయడంతో కార్పొరేట్ యాజమాన్యంలోని పెద్ద జాతీయ మీడియా బీజేపీకి ప్రచార విభాగంగా పని చేసిందని తెలిపారు.
- కాంగ్రెస్ పార్టీ టెర్రరిస్టులతో కలిసి పనిచేస్తోందని చెప్పడం నుంచి కాంగ్రెస్ గెలిస్తే అల్లర్లు జరుగుతాయని అమిత్ షా చెప్పడం వరకు బీజేపీ ప్రచారం, మోడీ ప్రసంగాలు తీవ్ర మతతత్వ, విద్వేషపూరితంగా ఉన్నాయని విశ్లేషకులు అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేయాలనే నిర్ణయంతో ఎన్నికల ముందు బీజేపీ తన ప్రచారాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ చర్యపై సుప్రీంకోర్టు స్టే విధించటం గమనార్హం. ఈవీఎం బటన్‌ను నొక్కిన తర్వాత 'జై బజరంగ్‌బలి' అని కేకలు వేయాలని ఓటర్లను కోరడం ఒక్కటే కాదు.. హిందువుల ఓటర్లను ఆకట్టుకునేందుకు మోడీ 'కేరళ స్టోరీ' చిత్రం సహాయం కూడా తీసుకున్నారని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు అన్నారు.
- మణిపూర్‌లో 60 మందికి పైగా అధికారికంగా ప్రాణాలు కోల్పోయిన భారీ హింసాకాండను మోడీ,షా పట్టించుకోలేదని చెప్పారు. వారు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నందున హింసాకాండ కారణంగా 35,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారనీ, ఇద్దరు నేతలు కర్నాటకలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' ప్రాముఖ్యతపై పాఠాలు చదువుతుండగా, మణిపూర్‌లో 'లా అండ్ ఆర్డర్'కు ఆటంకం ఏర్పడిందని తెలిపారు.

అదేవిధంగా, ఇదే సమయంలో జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడుల కారణంగా భారత సైన్యానికి చెందిన ఐదుగురు స్పెషల్ ఫోర్సెస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అయితే కర్నాటక ప్రచారంలో బిజీగా ఉన్న మోడీ వారి మరణాలను గుర్తించకపోవడం గమనార్హం.

- కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గుజరాత్ కోర్టు తీర్పుతో లోక్‌సభ నుంచి ఉద్వాసనకు గురయ్యారు. రాహుల్ విషయంలో న్యాయస్థానం, లోక్‌సభ సెక్రెటరీ, స్పీకర్ శీఘ్ర నిర్ణయాలు తీసుకోవటం బీజేపీకే మైనస్‌గా మారిందన్నారు.
- ప్రచార సమయంలో అదానీ అవినీతి సమస్యపై మోడీ మౌనం నిరాటంకంగా కొనసాగిందనీ, అలాగే రాష్ట్ర ప్రభుత్వం '40 పర్సంటేజీ సర్కారు' అని జనాల్లోకి బలంగా నాటుకుపోయిందని చెప్పారు.
- ఎన్నికలకు ముందు రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో బీజేపీ ప్రభుత్వం అనవసర కేసులు, ఇతర ప్రతీకార చర్యల ద్వారా పౌర సమాజ గొంతులను భయపెట్టడానికి తన శాయశక్తులా ప్రయత్నించిందన్నారు. హిందూత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియా పోస్ట్ చేసినందుకు నటుడు చేతన్ కుమార్‌ను అరెస్టు చేయడం, అతని ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డును రద్దు చేయాలనే నిర్ణయం తీసుకోవడం దీనికి ఉదాహరణ అని విశ్లేషకులు గుర్తు చేశారు.